సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 82

గురువారం 13-6-2019




'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



**భారత్‌కు బలపరీక్ష**

ప్రపంచకప్‌లో నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా మ్యాచ్ - స్పోర్ట్స్‌లో



**రూ.2 లక్షల కోట్లు!**

11 ఏళ్లలో బ్యాంకు మోసాలు రూ.2.05 లక్షల కోట్లుగా నమోదు - బిజినెస్‌లో


SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


## బీజేపీ.. ఆపరేషన్ ఆకర్ష్ షురూ

### రాష్ట్రంలోని పలు పార్టీల నేతలను చేర్చుకునేందుకు యత్నాలు

- హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో మకాం వేసిన రాంమాధవ్
- ఆయనతో సమావేశమైన మాజీ పార్లమెంట్ సభ్యుడు వివేక్
- కాంగ్రెస్ మాజీ నేత రేగులపాటి రమ్యారావును తీసుకెళ్లిన డా.లక్ష్మణ్
- రాంమాధవ్‌తో టచ్‌లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కీలక నేతలు
- జాబితాలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి?
- తెలంగాణలో పార్టీ బలోపేతం బాధ్యతలు రాంమాధవ్‌కు అప్పగింత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం కమలనాథుల ఆపరేషన్ ప్రారంభమైంది. రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల కీలక నేతలను బీజేపీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను ఆర్‌ఎస్‌ఎస్ మాజీ నేత, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌కు అధిష్టానం అప్పగించింది. ఇందులో భాగంగా రాంమాధవ్ హైదరాబాద్ వచ్చి పార్క్ హయత్‌లో మకాం వేశారు. మధ్యాహ్నం నుంచి పలువురు నేతలతో ఆయన సమావేశమయ్యారు. రాంమాధవ్‌తో భేటీ అయిన వారిలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మోహన్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి రేగులపాటి రమ్యారావు మిగతా 2వ పేజీలో ▶

## గుజరాత్‌కు 'వాయు' గండం

### వెరవల్, ద్వారక మధ్య తీరం దాటనున్న తుపాను



ఉత్తరభారతంలో ఒక వైపు సూర్యుడి ప్రతాపంతో జనం అల్లాడుతుండగా మరోవైపు 'వాయు' తుపాను గుజరాత్ వైపు దూసుకు వస్తోంది. గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్రపై 'వాయు' ప్రభావం మరో 24 గంటలు ఉంటుందని, భారీ వర్షాలతోపాటు గంటకు 170 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్న హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. - వివరాలు 13లో

## జూలై 15న చంద్రయాన్-2


### ఇస్రో చైర్మన్ కె. శివన్ వెల్లడి



చంద్రుడిపైకి రెండో మిషన్‌లో భాగంగా చంద్రయాన్-2ని జూలై 15 తెల్లవారుజామున 2.51గం.కు జీఎస్‌ఎల్‌వీ ఎంకే-3 రాకెట్ సాయంతో ప్రారంభిస్తామని ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు. ఈ ప్రయోగంతో మీటరు పొడవైన 25 కేజీల బరువున్న రోవర్, ఆర్బిటర్, లాండర్లను చంద్రుడిపైకి పంపనున్నామన్నారు. - వివరాలు 13లో

## కశ్మీర్‌లో ఉగ్రదుశ్చర్య

### ఐదుగురు జవాన్లు మృతి.. ఒక ఉగ్రవాది కూడా



కశ్మీర్‌లో ఉగ్రవాదులు భద్రతా దళాలపై జరిపిన దాడిలో ఐదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో చోటు చేసుకుంది. భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది కూడా మృతి చెందాడని అధికారులు వెల్లడించారు. - వివరాలు 13లో

# 21న కాళేశ్వర 'తీర్థం'




- మేడిగడ్డ బ్యారేజీ వద్ద, గోదావరి చెంత జల సంకల్ప మహాయాగం
- తర్వాత మోటార్లను ఆన్ చేసి ఎత్తిపోతలకు శ్రీకారం
- ఈ సీజన్‌లో 150 టీఎంసీల ఎత్తిపోత... రూ.50 వేల కోట్లకు చేరువైన వ్యయం
- ప్రారంభోత్సవానికి ఏపీ, మహారాష్ట్ర సీఎంలు వైఎస్ జగన్, ఫడ్నవిస్‌కు ఆహ్వానం
- త్వరలో విజయవాడ, ముంబైలకు వెళ్లి స్వయంగా ఆహ్వానించనున్న కేసీఆర్

### ఆ రోజునే ప్రాజెక్టు ఎత్తిపోతలకు నాంది పలకనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి వరప్రదాయిని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 21న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని ఎత్తిపోయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొత్త శకానికి నాంది పలకనుంది. తెలంగాణ భూ భాగంలోని దాదాపు 70 శాతం జిల్లాలకు సాగు, తాగు, పరిశ్రమల అవసరాలను తీర్చే ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగానే అక్కడే జల సంకల్ప మహాయాగం నిర్వహించాలని నిర్ణయించారు. ఇక ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ని ఆహ్వానించాలని కేసీఆర్ నిర్ణయించారు. గోదావరిలో వరద ఉండే దినాలను బట్టి కనిష్టంగా 150 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించి, రూ.50 వేల కోట్ల మేర నిధులు ఖర్చు చేసి పనులు పూర్తి చేసింది.

**ఏటా 80 లక్షల ఎకరాల్లో పంట...**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 13 జిల్లాల్లోని 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, మిగతా 2వ పేజీలో ▶




**ప్రాజెక్టులో నీటి వినియోగం (టీఎంసీల్లో)**

| | | |
|---|---|---|
| 134.5 కొత్త ఆయకట్టుకు సాగునీరు | 34.5 శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూర్ ఆయకట్టు స్థిరీకరణ | 30 హైదరాబాద్‌కు నీటి సరఫరా |
| గ్రామాలకు తాగునీరు 10 | పారిశ్రామిక అవసరాలకు 16 | మొత్తం నీటి వినియోగం 225 |






ఆధార్ సవరణ బిల్లుకు ఓకే 13లో






# కొలువుదీరిన ఏపీ కొత్త సభ

ప్రమాణ స్వీకారం చేసిన శాసనసభ సభ్యుల సంఖ్య **173**

- తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... తరువాత ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎమ్మెల్యేలుగా ప్రమాణం
- ముకుళిత హస్తాలతో సభలోకి ప్రవేశించిన వైఎస్ జగన్
- వేద పండితుల ఆశీర్వచనాల నడుమ చాంబర్‌లోకి..

3లో



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## పొల్యూషన్.. సిగ్నల్‌లో కన్ఫ్యూజన్



- మెట్రో రూట్లలో ఆనవుతున్న రెడ్‌సిగ్నల్స్
- తరచూ నిలిచిపోతున్న మెట్రో రైళ్లు..
- 25 కేఎంపీహెచ్‌కు పడిపోతున్న రైళ్ల వేగం
- హైదరాబాద్‌కు సరిపడని సీబీటీసీ టెక్నాలజీ... సాంకేతికతలో మార్పు చేర్పులు చేయాలని థేల్స్ సంస్థకు హెచ్‌ఎంఆర్ మొర

- వివరాలు 4లో

## నీట్ కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల

- జూన్ 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- జూన్ 27న తొలి విడత సీట్ల కేటాయింపు
- రెండో విడత కౌన్సెలింగ్ జూలై 6 నుంచి 9 వరకు
- 12న సీట్ల కేటాయింపు
- ఆగస్టు 13 నుంచి 18 వరకు చివరి విడత...

- వివరాలు 5లో

## 14 జిల్లాల్లో డెంగీ హైరిస్క్

- 5 జిల్లాల్లో మలేరియా అత్యధికంగా నమోదు
- సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించిన సర్కారు
- రేపు పలు జిల్లాల కలెక్టర్లతో వైద్య ఆరోగ్య మంత్రి ఈటల సమీక్ష

- వివరాలు 3లో

## లోక్‌సభలో బీజేపీ నేతగా మోదీ



- లోక్‌సభలో బీజేపీ నేతగా ప్రధాని మోదీ, ఉపనేతగా రాజ్‌నాథ్ సింగ్ నియమితులయ్యారు. బుధవారం సమావేశమైన బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకుంది. రాజ్యసభలో బీజేపీ నేతగా థావర్‌చంద్ గెహ్లోత్, ఉపనేతగా పీయూష్ గోయెల్ నియమితులయ్యారు. - వివరాలు 13లో









# 21న కాళేశ్వర 'తీర్థం'



▶ మొదటి పేజీ తరువాయి

మరో 20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195 టీఎంసీల గోదావరి నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించిన విషయం తెలిసిందే. కొత్తగా ఆయకట్టు సాగులోకి వచ్చే జిల్లాల్లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి, నల్లగొండ, సంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి జిల్లాలున్నాయి. కాళేశ్వరం నీటితోనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం చేపట్టారు. నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు కూడా నీరందివ్వనున్నారు. దీంతో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సంగారెడ్డి, నిజమాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో మరో 20 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా రాష్ట్రంలోని 40 లక్షల ఎకరాలకు ప్రతీ ఏడాది 2 పంటలకు నీరందనుండగా, ఏటా 80 లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయి. అందుకే తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయనిగా నిలవబోతోందని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు.

## ఏపీ, మహారాష్ట్ర సీఎంలకు కేసీఆర్ ఆహ్వానం..

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ నెల 21న ప్రారంభోత్సవం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ని ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని కేసీఆర్ నిశ్చయించారు. త్వరలోనే విజయవాడకు వెళ్లి వైఎస్ జగన్‌ను కేసీఆర్ ఆహ్వానించనున్నారు. బుధవారం కేసీఆర్ ఫడ్నవీస్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రారంభోత్సవానికి రావాలని కోరగా ఆయన అంగీకరించారు. త్వరలోనే స్వయంగా ముంబై వెళ్లి ఫడ్నవీస్‌ను కేసీఆర్ ఆహ్వానించనున్నారు.

## రాత్రింబవళ్లు పనులు.. పూర్తయిన నిర్మాణాలు..

కాళేశ్వరం పథకానికి 2016, మే 2న కన్నెపల్లి వద్ద ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే ప్రాజెక్టులోని ప్రధాన భాగమైన బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తయింది. రిజర్వాయర్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లూ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 3 బ్యారేజీలు, 19 రిజర్వాయర్లు, 20 లిఫ్టులను నిర్మిస్తున్నారు. 12 బ్లాకుల్లో 1,531 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, 203 కిలోమీటర్ల మేర సొరంగాల పనులు సాగుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు 4 వేల మందికి పైగా కార్మికులు నిరంతరం షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు ఇప్పటికే పూర్తవగా, మేడిగడ్డ పంప్‌హౌజ్‌లో 11 మోటార్లకు గానూ 8 మోటార్లు సిద్ధమయ్యాయి. మిగతా వాటి పనులు సాగుతున్నాయి. అన్నారంలో 8కి గానూ 5, సుందిళ్లలో 9కిగానూ 6 సిద్ధం చేశారు. ఇందులో మేడిగడ్డ పంపులను ఈ నెల 21న కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించి గోదావరి నీటి ఎత్తిపోతలకు అంకురార్పణ చేయనున్నారు. రెండు లేక మూడు మోటార్లతో 21 నుంచి మేడిగడ్డను ఆరంభించి అన్నారానికి నీటిని తరలించాలని, అక్కడ 4.47 టీఎంసీల నిల్వకు రాగానే, రెండు మోటార్లతో 28 నుంచి అన్నారం ఎత్తిపోతలను ఆరంభించి సుందిళ్లకు నీటిని తరలించాలని, అక్కడ 4.25 టీఎంసీల నిల్వకు చేరగానే, వచ్చే నెల 5 నుంచి 3 మోటార్లను ఆరంభించి ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎల్లంపల్లి దిగువన ప్యాకేజీ–6, 7, 8 ఉండగా, ఇందులో ప్యాకేజీ–6 ద్వారా ఎల్లంపల్లి నుంచి నీటిని మేడారం రిజర్వాయర్‌కు తరలించేలా పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ–6లో 124 మెగావాట్ల సామర్థ్యమున్న 7 మోటార్లను సిద్ధం చేయాల్సి ఉండగా ఇప్పటికే 4 రెడీ అయ్యాయి. ప్యాకేజీ–7 పరిధిలో 11.24 కిలోమీటర్ల జంట టన్నెళ్ల నిర్మాణం పూర్తయింది. లైనింగ్ పనులు పూర్తి కావస్తున్నాయి. ప్యాకేజీ–8లో 139 మెగావాట్ల సామర్థ్యమున్న బాహుబలి మోటార్ పంపులు 5 సిద్ధమయ్యాయి. ఇంకో మోటార్‌ను మరో 15–20 రోజుల్లో సిద్ధం చేయనున్నారు. ఇక మిడ్‌మానేరు కింద కొండపోచమ్మసాగర్ వరకు ప్యాకేజీ–10, 11, 12, 13, 14 ఉండగా, ఇవన్నీ యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇందులో చాలా ప్యాకేజీల్లో మోటార్ల బిగింపు ప్రక్రియ లక్ష్యాల మేరకు పూర్తయింది. ఈ ఖరీఫ్‌లో కొండపోచమ్మసాగర్ వరకు 150 టీఎంసీల మేర నీటిని ఈ సీజన్‌లో తరలించేలా పనులు పూర్తి చేస్తున్నారు. మొత్తంగా మేడిగడ్డ వద్ద సముద్ర మట్టానికి 100 మీటర్ల ఎత్తులో గోదావరి నీళ్లను ఆరు దశల్లో లిఫ్టు చేసి 618 మీటర్ల ఎత్తులో ఉండే కొండపోచమ్మ సాగర్ వరకు తరలిస్తారు. అంటే గోదావరి నది నీళ్లను అర కిలోమీటరుకు పైగా ఎత్తుకు లిఫ్టు చేస్తారు.

## చెరువులకు ఊతం...

కాళేశ్వరం ద్వారా వచ్చే గోదావరి జలాలతో తొలి ప్రాధాన్యంగా చెరువులు నింపనున్నారు. ప్రాజెక్టు కాలువల ద్వారా వచ్చే నీరు, వరదనీరు, పడబాటు నీళ్లు అన్ని చెరువులకు మళ్లేలా పనులు చేస్తున్నారు. మేడిగడ్డ మొదలు బస్వాపూర్ వరకు గరిష్టంగా 2,600 చెరువులు నింపే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఇందులో మిడ్‌మానేరు దిగువన బస్వాపూర్ వరకు 1,700 చెరువులు నింపే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. ఇక ఎస్సారెస్పీ స్టేజ్–1, స్టేజీ–2 కింద 700 చెరువులు, కడెం కింద 50 చెరువులు, వరద కాల్వ కింద 60 చెరువులు నింపవచ్చని గుర్తించారు. ఇందులో ఈ ఖరీఫ్ సీజన్‌లోనే ఎస్సారెస్పీ కింద 200 చెరువులు, అనంతగిరి కింద సిరిసిల్ల జిల్లాలో 30 చెరువులు నింపి 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించారు. రంగనాయక సాగర్ కింద సిద్దిపేట జిల్లాలో 50, సిరిసిల్ల జిల్లాలో 70 చెరువులు నింపనున్నారు. ఈ రిజర్వాయర్ల పనుల అనంతరం మల్లన్నసాగర్‌కు చేరే నీటిని ఫీడర్ చానల్ తవ్వి గంధమల, బస్వాపూర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల కింది కాలువలకు అనుసంధానించి కనిష్టంగా 150 చెరువులు నింపేలా పనులు చేస్తున్నారు. ఈ చెరువులను నింపేందుకు వీలుగా 785 తూముల నిర్మాణం చేయాలని ఇప్పటికే నిర్ణయించారు.

## తొలి ఫలితం ఎస్సారెస్పీకే...

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా లబ్ధి పొందనున్న తొలి ఆయకట్టు ఎస్సారెస్పీదే కానుంది. ఎల్లంపల్లి మిడ్‌మానేరుకు తరలించే నీటిని వరద కాల్వపై నిర్మిస్తున్న ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకంలోని లిఫ్టుల ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటిని తరలించనున్నారు. ఎస్సారెస్పీ స్టేజ్–1 కింద 9.68 లక్షలు, స్టేజ్–2 కింద మరో 4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను దాటుకొని నీరు ఎల్లంపల్లి మీదుగా వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు చేరుతుంది. అయితే మిడ్‌మానేరుకు చేరకముందే వరద కాల్వ మీద మూడు పంప్‌హౌజ్‌లను నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని వరద ఉండే 60 నుంచి 120 రోజుల పాటు ఎస్సారెస్పీకి పంపిస్తారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలోని మూడు పంప్‌హౌజ్‌లకు గానూ రెండు పంప్‌హౌజ్‌లు సిద్ధమవుతున్నాయి. ఈ రెండు పంప్‌హౌస్‌ల్లో 6.5 మెగావాట్ల సామర్థ్యం ఉన్న నాలుగేసి చొప్పున పంపులను జూన్ చివరికి పూర్తి చేసి, జూలై నుంచి ఖరీఫ్‌లో కనిష్టంగా 60 టీఎంసీల నీటిని ఆయకట్టుకు తరలించనున్నారు. ఈ నీటికి ఎస్సారెస్పీకి సహజ ప్రవాహాలతో వచ్చే మరో 30 నుంచి 40 టీఎంసీల నీరు తోడైతే పూర్తి ఆయకట్టుకు నీరందించడం సాధ్యం కానుంది. లేని పక్షంలో ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన 9 లక్షల ఎకరాలకు సరఫరా చేస్తారు.



### ప్రతిపాదిత జలాశయాలు

| బ్యారేజీ/ రిజర్వాయర్ | సామర్థ్యం (టీఎంసీల్లో) |
|---|---|
| మేడిగడ్డ | 16.17 |
| అన్నారం | 10.87 |
| సుందిళ్ల | 8.83 |
| మేడారం | 0.78 |
| అనంతగిరి | 3.50 |
| రంగనాయక సాగార్ | 3.00 |
| మల్లన్న సాగర్ | 50.00 |
| మలక్‌పేట | 3.00 |
| కొండ పోచమ్మ సాగర్ | 15.00 |
| గంధమల్ల | 9.87 |
| బస్వాపురం | 11.39 |
| భూంపల్లి | 0.09 |
| కొండెం చెరువు | 3.50 |
| తిమ్మక్కపల్లి | 1.50 |
| దంతెపల్లి | 1.00 |
| ధర్మారావు పేట | 0.50 |
| ముద్దిజివాడి | 0.50 |
| కాటేవాడి | 0.50 |
| మోతె | 1.00 |
| మొత్తం | 141.00 |

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది రోజుకు 2 టీఎంసీల నీరు ఎత్తిపోయడానికి 4,992.47 మెగావాట్ల విద్యుత్తు అవసరం కానుంది. 3 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి 7,152 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా వేశారు. దీనికి తగినట్టుగానే ఏర్పాట్లు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ విద్యుత్ సంస్థలు రాష్ట్రంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలకు అత్యధిక విద్యుత్ సరఫరా అందించడానికి రికార్డు స్థాయి ఏర్పాట్లు చేశాయి. ట్రాన్స్‌కోలో ఎత్తిపోతల పథకాల కోసమే ప్రత్యేక డైరెక్టర్ సూర్యప్రకాశ్‌ను సీఎం కేసీఆర్ ఇప్పటికే నియమించారు. జెన్ కో– ట్రాన్స్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో విద్యుత్, నీటి పారుదల శాఖ అధికారులు

## విద్యుత్ సరఫరా ఏర్పాట్లు పూర్తి

ప్రతీ వారం క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించారు. ఆస్ట్రియా తదితర దేశాలు పర్యటించి పంపుల సామర్థ్యాన్ని మదింపు చేశారు. బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకుని వివిధ ప్లాంట్లలో సమాంతరంగా ప్రత్యేక పంపులను తయారు చేయించారు. ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌లకు అవసరమైన విద్యుత్‌కోసం గోలివాడ గ్రామ శివారులో ట్రాన్స్‌మిషన్ (సబ్‌స్టేషన్) వ్యవస్థ సిద్ధమైంది. నిర్దేశిత గడువుకు ముందే ఈ వ్యవస్థను పూర్తిచేశారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు ముఖ్యాంశాలు

| అంశం | సంఖ్య |
|---|---|
| నీటిని సరఫరా చేసే మార్గం పొడవు (కి.మీ) | 1832 |
| వాలు కాలువ పొడవు (కి.మీ) | 1531 |
| వాలు టన్నెల్ పొడవు (కి.మీ.) | 203 |
| ప్రెషర్ పైపు లైన్ పొడవు (కి.మీ.) | 98 |
| లిఫ్టులు | 20 |
| పంప్ హౌస్‌లు | 19 |
| జలాశయాలు | 19 |
| జలాశయాల నిల్వ సామర్థ్యం: (టీఎంసీల్లో) | 141 |
| అవసరమయ్యే విద్యుత్ (మెగావాట్లలో) | 4,992.47 |

### ప్రాజెక్టులో నీటి లభ్యత (టీఎంసీల్లో)

| | |
|---|---|
| గోదావరి నీరు: | 180 |
| ఎల్లంపల్లి ప్రాజెక్టులో లభ్యమయ్యే నీరు: | 20 |
| ఎల్లంపల్లి వద్ద మొత్తం నీటి లభ్యత: | 200 |
| చెరువుల పరివాహక ప్రాంత నీటి లభ్యత: | 10 |
| ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల రీచార్జ్: | 25 |
| ఆవిరి నష్టాలు (-): | 10 |
| ప్రాజెక్టు వినియోగానికి నికరంగా నీటి లభ్యత: | 225 |

# నేడు, రేపు రాష్ట్రంలో వడగాడ్పులు

సాక్షి, హైదరాబాద్

ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల గురు, శుక్రవారాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు ఈశాన్య, మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇదిలావుండగా బుధవారం పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం, రామగుండంల్లో ఏకంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, భద్రాచలం, హన్మకొండ, మెదక్‌ల్లో 42 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదు కాగా, నిజామాబాద్, నల్లగొండల్లో 41 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 39, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.

KALINGA UNIVERSITY
RAIPUR INDIA

Programs

Engineering: M.Tech, B.Tech, Diploma
Law: LLM · LLB, BALLB · BBALLB (Integrated)
Pharmacy: B.Pharma, D.Pharma
Arts: MA · BA, MSW · BSW
Management: MBA, BBA
Design: M.Sc./B.Sc. in Fashion & Interior Design
Commerce: M.Com Hons (E-Commerce / Banking & Finance), B.Com Hons (E-Commerce / Banking & Finance)
Computer Science: MCA · PGDCA, B.Sc. CS · BCA
Science: M.Sc. * · M.Sc. BT, B.Sc (Med / Non Med / Non Conventional Energy), B.Sc. (Bio Technology)
*Physics, Chemistry, Mathematics, Botany & Zoology
Journalism & Mass Communication: MJMC, BJMC
Research Programs: Ph.D., M.Phil.
Education: B.Ed., B.P.Ed
Library Science: M.Lib, B.Lib

Ranking & Partners

NIIT: Preparing students for IT, Non IT & Accounting skills
CAREER LAUNCHER: Preparing Students for Competitive and Government Jobs examinations.
INDIA TODAY: 30th Rank in Top Universities established after year 2000 India Today
BOSCH
competition success review: 7th Rank in Business School ranking of competition success review

Kalinga Scholastic Entrance Exam 2019
Apply for KALSEE 2019
Be a Warrior. Not a Worrier!
Apply Now!
Download Kalinga Warriors App & Connect with us
https://admission.kuerp.in/
and stay updated with our Counsellors and a lot more...
www.kalingauniversity.ac.in kalsee@kalingauniversity.ac.in
Call: 9303097004 / 7024213219
Campus: Kalinga University, Kotni, Near Mantralaya Naya Raipur - 49210, Chhattisgarh, India.
City Office : 1st Floor, SLT Water Front, Opp. Telibandha Talab, Raipur - 492001.

# కాళేశ్వరానికి 'కరెంట్' సిద్ధం!



- అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం
- ప్రాజెక్టుకు 4,700 మెగావాట్ల విద్యుత్ అవసరం
- రూ.2,890 కోట్లతో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు

– ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఈనెల 21న ప్రారంభోత్సవం నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినందున, నీటిని ఎత్తిపోయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ప్రకటించారు. గోదావరి నుంచి 2 టీఎంసీల నీటిని ఎత్తి జలాశయాలకు తరలించడానికి 4,992.47 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని అంచనా వేశామన్నారు. కొన్ని రిజర్వాయర్ల పనులు, లిఫ్టుల పనులు ఇంకా జరుగుతున్నందున ఈ ఏడాది నికరంగా 4,700 మెగావాట్ల డిమాండ్ వచ్చే అవకాశముందన్నారు. దీనికి తగినట్లు ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది నుంచి 3 టీఎంసీల నీరు ఎత్తిపోయాలని నిర్ణయించినందున మరో 2,160 మెగావాట్లు అదనంగా అవసరం అవుతుందన్నారు. దీనికోసం ఇప్పటినుంచే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు 7,152 మెగావాట్ల విద్యుత్ అందించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రూ.2,890 కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 15 డెడికేటెడ్ సబ్ స్టేషన్లు నిర్మించామని, వివిధ కేటగిరీల్లో 80 పంపులు బిగించామని చెప్పారు. గతంలో కేవలం 30 మెగావాట్ల విద్యుత్ పంపులు వాడిన చరిత్ర మాత్రమే తెలంగాణలో ఉందని, కానీ సముద్ర మట్టానికి 618 మీటర్లకు పైగా ఎత్తుకు నీటిని పంపింగ్ చేసి, తెలంగాణ బీళ్లకు నదుల నీళ్లను మళ్ళించే బృహత్ కార్యానికి విద్యుత్ సంస్థలు పూనుకున్నాయని ప్రభాకర్‌రావు చెప్పారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించే అతి పెద్ద క్రతువులో విద్యుత్ శాఖది కీలక పాత్ర అని, దీన్ని విజయవంతం చేయడానికి ఉద్యోగులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కోటికి పైగా ఎకరాలకు సాగునీరు అందించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని, ఈ ప్రాజెక్టుల ద్వారా అనుకున్న విధంగా నీటిని ఎత్తిపోసే బాధ్యత విద్యుత్ ఉద్యోగులపై ఉందని ఆయన అన్నారు. నిర్ణీ త గడువులోగా విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసిన స్ఫూర్తితోనే, లిఫ్టులను కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించి సమర్థతను చాటుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ లక్ష్యం నెరవేర్చాలని, రైతుల రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు.



### విద్యుత్ శాఖ చేసిన పనులు

| లోడ్ (మెగా వాట్లు) | పంపులు |
|---|---|
| 4992.47 | 100 |

| మొత్తం సబ్ స్టేషన్లు 17 | |
|---|---|
| 400 కె.వి సబ్‌స్టేషన్లు: | 6 |
| 220 కె.వి సబ్‌స్టేషన్లు: | 9 |
| 132 కె.వి సబ్‌స్టేషన్లు: | 2 |

| మొత్తం లైన్ పొడవు | 1025.3 |
|---|---|
| 400 కె.వి లైన్ పొడవు: | 521.08 కి.మీ |
| 220 కె.వి లైన్ పొడవు: | 461.05 కి.మీ |
| 132 కె.వి లైన్ పొడవు: | 43.2 కి.మీ |

## ఏపీ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా ఇద్దరు కొత్త న్యాయమూర్తులు వస్తున్నారు. జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ మటం వెంకట రమణల నియామకానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీరి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 13కు చేరుకుంది. వీరిద్దరూ న్యాయాధికారుల కోటా నుంచి హైకోర్టు న్యాయమూర్తులయ్యారు. సోమవారం వీరు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. హైకోర్టులో మరో 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## 'ధాన్యం కొనుగోళ్లు నాలుగింతలు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు గడిచిన ఐదేళ్లలో 4 రెట్లు పెరిగాయి. కనీస మద్దతు ధరలకు జరుగుతున్న కొనుగోళ్లు, మార్కెట్ వ్యవస్థ బలోపేతం, సాగునీటి వనరుల వృద్ధితో పంటల విస్తీర్ణం పెరగడం, వీటికి అనుగుణంగా సేకరణను ఆ శాఖ విస్తరించడంతో ధాన్యం కొనుగోళ్లు కొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి. 2014–15లో ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో కలిపి మొత్తంగా 24.29 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయగా, రూ.3,392 కోట్లను రైతులకు చెల్లించారు. అది 2016–17, 2017–18 నాటికి 53.90 లక్షల టన్నులకు చేరగా, అదే 2018–19 నాటికి 73.02 లక్షల టన్నులకు చేరింది. ఈ సేకరించిన ధాన్యం విలువ రూ.12,906 కోట్లుగా ఉంది. అది ప్రస్తుత 2019–20 నాటికి 80 లక్షల టన్నులను దాటే అవకాశం ఉంది. ఇప్పటికే 77.07 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించి గతంలో ఎన్నడూలేని రికార్డులు నెలకొల్పింది. గడిచిన ఐదేళ్లలో పౌర సరఫరాల శాఖ పరిధిలో చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలకు సంబంధించి 'పౌర సరఫరాల శాఖ వార్షిక నివేదిక 2018–19'ని పౌర సరఫరాల శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు.

## ఉద్యోగుల సమస్యలను తీర్చండి: హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్‌సీ లేదా ఐఆర్ ప్రకటించాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని కోరారు.

# బీజేపీ.. ఆపరేషన్ ఆకర్ష్ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ కీలక నేతలు రాంమాధవ్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది.

**2023నే లక్ష్యంగా..:** కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో పాగ వేయడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. దీనిలో భాగంగా 4 లోక్‌సభ స్థానాలను అనూహ్యంగా గెలుచుకున్న తెలంగాణలో పార్టీని విస్తరించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వాన్ని అప్రమత్తం చేయడంతోపాటు వివిధ రాజకీయ పార్టీల్లో అసంతృప్తులుగా ఉన్న నేతలను పార్టీలోకి తీసుకొచ్చే బాధ్యతను రాంమాధవ్‌కు అప్పగించారు. దీనిలో భాగంగానే రాంమాధవ్ ప్రాథమికంగా కొందరు నేతలను ఆకర్షించే వ్యూహంతో బుధవారం హైదరాబాద్ వచ్చారు. ఆయనతో తెలంగాణలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు సమావేశం అయ్యేలా స్థానిక నాయకత్వం ఏర్పాట్లు చేసింది. బుధవారం మధ్యాహ్నం తర్వాత రాంమాధవ్ పలు పార్టీల నేతలను కలిశారు. వీరిలో కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ, టీజేఎస్ నేతలు ఉన్నట్లు తెలిసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో 2023 కల్లా రాష్ట్రంలో కనీసం సగం కంటే ఎక్కువ పార్లమెంట్ స్థానాలు గెలుచుకునే వ్యూహంతో రాంమాధవ్ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. బుధవారం పలువురి నేతలను కలసిన ఆయన గురువారం కూడా హైదరాబాద్‌లోనే ఉండి మరికొందరిని కలువనున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. రాంమాధవ్‌ను కలసిన నేతలంతా దాదాపు బీజేపీలో చేరుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే బీజేపీలో పలువురు నేతల చేరిక కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం మీద ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా ఒక్కరిద్దరు కాంగ్రెస్ ఎంపీలు కూడా రాంమాధవ్‌తో టచ్‌లోకి వెళ్లారని బీజేపీ వర్గాలు చెబుతున్నప్పటికీ ఆ ఎంపీలు, టీపీసీసీ వర్గాలు ఖండిస్తున్నాయి. రాంమాధవ్ నేతృత్వంలో ఎవరెవరు చేరతారనేది ఒకటెండ్రు రోజుల్లో తేలనుంది. రాంమాధవ్ వ్యూహం ఫలిస్తే.. 2020 చివరినాటికి బీజేపీ బలమైన శక్తిగా ఎదిగి 2023 ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొంటామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.


## ఇదండీ జగత్



మా పిల్లలేదో నీ సొమ్మంతాలాక్కునట్లు అలా ముఖం పెట్టావే! వెళ్లు.. నీ దిక్కున్న చోట చెప్పుకో!

# ఏపీలో కొలువుదీరిన కొత్త సభ

- 173 మంది సభ్యుల ప్రమాణం
- తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం
- ఆ తర్వాత చంద్రబాబు, ఎమ్మెల్యేలు
- ముకుళిత హస్తాలతో సభలోకి ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్
- వేద పండితుల ఆశీర్వచనాల నడుమ చాంబర్‌లోకి ప్రవేశం
- ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉల్లాసంగా నూతన ఎమ్మెల్యేలు
- గోపిరెడ్డి మినహా అందరూ హాజరు

తొలి రోజు శాసనసభకు హాజరైన ఎమ్మెల్యేలు, ప్రమాణం చేస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు

**సాక్షి, అమరావతి:** కొంగొత్తగా కొలువుదీరిన ఆంధ్రప్రదేశ్ 15వ శాసనసభలో 173 మంది శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా పూర్తయింది. వైఎస్సార్ సీపీ సభ్యులంతా పార్టీ కండువాలు ధరించి సభకు రాగా టీడీపీ సభ్యుల్లో ఇద్దరు మినహా మిగతావారంతా పచ్చ చొక్కాలతో సభకు వచ్చారు. ఎన్నికైన సభ్యులంతా సభకు వచ్చిన వెంటనే పరస్పరం అభినందించుకున్నారు. మంత్రులు చాలా మంది శాసనసభ్యుల స్థానాల వద్దకు వెళ్లి అభినందనలు తెలపగా అధికార పక్ష సభ్యులు మంత్రుల వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తాజాగా ఎన్నికైన 175 మంది శాసనసభ్యుల్లో ప్రొటెం స్పీకర్‌తో కలిపి 174 మంది సభకు హాజరయ్యారు. శంబంగి చిన వెంకట అప్పల నాయుడు ఈనెల 8వ తేదీన గవర్నరు ఎదుట ఎమ్మెల్యేగా, ప్రొటెం స్పీకరుగా ప్రమాణ స్వీకారం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం 149 మంది వైఎస్సార్ సీపీ సభ్యులతోపాటు 23 మంది టీడీపీ సభ్యులు, జనసేన నుంచి ఒక్క సభ్యుడు ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన మాతృమూర్తి పెద్ద కర్మ ఉన్నందున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తయిన వెంటనే శాసనసభ గురువారానికి వాయిదా పడింది.

### హర్షధ్వానాల మధ్య సభలోకి సీఎం జగన్

సరిగ్గా ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఉదయం 11.05 గంటలకు అధికార పక్ష సభ్యుల హర్షధ్వానాల మధ్య సభా నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభలోకి ప్రవేశించారు. ముకుళిత హస్తాలతో రెండు చేతులూ జోడించి అందరికీ నమస్కరిస్తూ వైఎస్ జగన్ సభలోకి ప్రవేశించారు. జై జగనన్నా, జయహో జగనన్నా, జోహార్ వైఎస్సార్ అంటూ అధికార పక్ష సభ్యులంతా నినదించారు. ఆ వెంటనే ప్రొటెం స్పీకర్ శంబంగి చిన వెంకట అప్పలనాయుడు సభలోకి ప్రవేశించడంతో అందరూ గౌరవసూచికంగా లేచి నిలబడి ఆయనకు నమస్కరించారు.

### జాతీయ గీతాలాపనతో ప్రారంభం

ఉదయం 11.06 గంటలకు జాతీయ గీతాలాపనతో సభ ఆరంభమైంది. ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే ప్రొటెం స్పీకర్ శంబంగి చిన వెంకట అప్పల నాయుడు సభ్యులందరి చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి కృష్ణమాచార్యులు ప్రకటించారు. రాజ్యాంగంలోని 188 ఆర్టికల్ ప్రకారం సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేయాలని ప్రొటెం స్పీకరు ప్రకటించారు. ప్రమాణ స్వీకారం అనంతరం శాసన సభ్యులుగా బాధ్యతలు స్వీకరించినట్లు సంతకాలు చేయాలని ప్రొటెం స్పీకరు సూచించారు. ఆ ప్రకారం ప్రొటెం స్పీకర్ పేర్లు చదవగా పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ముఖ్యమంత్రి, సభా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలుత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత అక్షర క్రమంలో మొదట అంజాద్ బాషా (కడప శాసన సభ్యుడు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి) ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి అక్షర క్రమంలో శాసనసభ కార్యదర్శి ఒక్కొక్కరి పేరును చదవగా స్పీకర్ ఎదుట పోడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బల్ల వద్ద 173 మందితో శాసన సభ్యులుగా ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రులు పాముల పుష్ప శ్రీవాణి, ఆళ్ల నాని, అంజాద్ బాషా, కె.నారాయణస్వామితో పాటు మంత్రులు మేకతోటి సుచరిత, బొత్స సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేకపాటి గౌతం రెడ్డి, కురసాల కన్నబాబు, తానేటి వనిత, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ యాదవ్, పినిపే విశ్వరూప్, శ్రీరంగనాథరాజు, పేర్ని నాని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన కృష్ణదాస్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, గుమ్మనూరు జయరాం, బాలినేని శ్రీనివాసరెడ్డి, శంకర నారాయణలతోపాటు జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, ఇతర శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

### ముగ్గురు నానీలు.. ఇద్దరు శ్రీదేవిలు

తాజా శాససభలో కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని), పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆళ్ల వంశీకృష్ణ శ్రీనివాస్ (నాని) ముగ్గురూ తమ పేర్లతో పాటు 'నాని'అని కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ముగ్గురు సభ్యుల నిక్ నేమ్స్ 'నాని'కావడం, వారు ప్రమాణ స్వీకారంలో 'నాని'అని పేర్కొనటం విశేషం. అలాగే ఇంటి పేర్లు వేరైనప్పటికీ సభలో ఇద్దరు శ్రీనివాసరావులు (ముత్తంశెట్టి , వెలంపల్లి), ఇద్దరు రామచంద్రారెడ్డిలు (కాపు, పెద్దిరెడ్డి) ఉండటం ఆసక్తికరమైన అంశం. ఇంటి పేర్లు వేరైనప్పటికీ ఇద్దరు శ్రీదేవిలు (ఉండవల్లి, కంగాటి) కూడా ఉన్నారు.

### సీఎం హోదాలో తొలిసారి సభకు వైఎస్ జగన్

ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తొలిసారిగా శాసనసభకు వచ్చారు. ప్రతిపక్ష నేతగా ఉండగా శాసనసభ ఎడమ వైపు ద్వారం నుంచి వచ్చిన వైఎస్ జగన్ ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కుడి ద్వారం నుంచి ప్రధాన గేటు ద్వారా కాన్వాయ్‌తో సభా ప్రాంగణంలోకి చేరుకున్నారు. ఉదయం 10.45 గంటలకు ఆయన సభ వద్దకు చేరుకోగానే ముఖద్వారం వద్ద శాసనసభ కార్యదర్శి (ఇన్‌చార్జి) పి.బాలకృష్ణమాచార్యులు పుష్పగుచ్ఛాన్ని అందచేసి స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహనం నుంచి దిగగానే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , పినిపె విశ్వరూప్, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనాల నడుమ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి తోడ్కొని వెళ్లారు. జగన్ అందరికీ వినమ్రంగా నమస్కరిస్తూ, పలకరిస్తూ ముందుకు సాగారు. ఆయన తన కుర్చీలో కూర్చోగానే గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో కలసి ఫొటో దిగారు. మరికొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సీఎం వైఎస్ జగన్‌తో కలసి ఫోటోలు తీయించుకున్నారు. పాస్టర్ ఒకరు కుటుంబ సమేతంగా వచ్చి వైఎస్ జగన్‌ను దీవించారు.

### నిరాడంబరంగా తొలి సమావేశం

బుధవారం 15వ శాసనసభ తొలి సమావేశం నిరాడంబరంగా ప్రారంభమైంది. నూతన ముఖ్యమంత్రి సభలోకి ప్రవేశించే తొలిరోజు అయినప్పటికీ ఎక్కడా హంగామా, ఆర్భాటం లేకుండా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిరాడంబరంగా జరిపించారు. శాసనసభ ప్రధాన ద్వారం, ముఖ్యమంత్రి ప్రవేశ ద్వారాలకు మాత్రమే సంప్రదాయబద్ధంగా పూలమాలలు వేశారు. అంతకుమించి అలంకరణలు చేయలేదు.

## స్పీకర్‌గా తమ్మినేని ఎన్నిక ఏకగ్రీవం!



### అధికారికంగా నేడు ప్రకటన

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ 15వ శాసనసభ స్పీకర్‌గా శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం ఏకగ్రీవంగా ఎన్నిక కాబోతున్నారు. స్పీకర్ పదవికి బుధవారం ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో గురువారం ఆయన ఎన్నికను లాంఛనంగా ప్రకటించనున్నారు. 15వ శాసనసభ తొలిరోజు ఎమ్మెల్యేల పదవీ ప్రమాణస్వీకారం జరిగింది. ఇదే రోజున స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. సాయంత్రం ఐదు గంటలలోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉండగా తమ్మినేని నామినేషన్ ఒక్కటే దాఖలైంది. తమ్మినేని అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పలువురు మంత్రులతో సహా 30 మంది ఎమ్మెల్యేలు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు స్పీకర్‌గా తమ్మినేని ఎన్నికైనట్లు ప్రకటిస్తారు.

## మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు కన్నుమూత



**హైదరాబాద్:** గద్వాల్ మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు(65) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. షుగర్, హైపర్ టెన్షన్, మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న గట్టు భీముడు 10 రోజుల క్రితం చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స అందిస్తున్నప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందినట్లు నిమ్స్ వైద్యులు చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావుపై ఉన్న అభిమానంతో గట్టు భీముడు తెలుగుదేశం పార్టీలో చేరారు. గద్వాల్ నియోజక వర్గం నుంచి 1999లో తొలిసారి గెలుపొంది ఎమ్మెల్యేగా 2004 వరకూ కొనసాగారు. ఆయన స్వగ్రామం గట్టు మండలంలోని బల్గెరలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. నడిగడ్డ రాజకీయాల్లో బీసీ నేతగా గట్టు భీముడు ఎదుగుతూ వచ్చారు. పట్వారీగా పనిచేస్తూనే 1980లో గట్టు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఒకప్పుడు గట్టు మండలంలోని బల్గెర గ్రామం అంటేనే ఫ్యాక్షన్ గుర్తుకొచ్చేది.

### సీఎం కేసీఆర్ సంతాపం

గట్టు భీముడు మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. భీముడు మృతి పట్ల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. బల్గెరలో జరిగే భీముడు అంత్యక్రియల్లో కేటీఆర్ పాల్గొంటారు.

# డెంగీ హైరిస్క్ జిల్లాలు 14

- 5 జిల్లాల్లో మలేరియా అత్యధికంగా నమోదు
- సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించిన సర్కారు
- రేపు పలు జిల్లాల కలెక్టర్లతో వైద్య ఆరోగ్య మంత్రి ఈటల సమీక్ష
- డెంగీ, మలేరియా నివారణకు గిరిజన ప్రాంత అధికారులతో భేటీ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 14 డెంగీ హైరిస్క్ జిల్లాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అలాగే మలేరియా హైరిస్క్ జిల్లాలను ఐదింటిని నిర్ధారించింది. ఆదిలాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్ రూరల్, కరీంనగర్, భూపాలపల్లి, రంగారెడ్డి, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, మేడ్చల్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా డెంగీ హైరిస్క్‌గా ఉన్నట్లు నిర్ధారించారు. ఇక మలేరియా హైరిస్క్ జిల్లాల్లో జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, ఆసిఫాబాద్, మహబూబాబాద్ ఉన్నాయి. ఏడాదికేడాది డెంగీ కేసులు రాష్ట్రంలో అత్యధికంగా నమోదవుతున్నాయి. 2012లో 962 డెంగీ కేసులు నమోదు కాగా, 2018లో ఏకంగా 6,362 కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఈ ఏడాది మే నెల వరకు సీజన్ లేని సమయంలోనే 756 కేసులు నమోదయ్యాయి. అయితే మలేరియా కేసులు మాత్రం తగ్గుముఖం పడుతున్నాయని సర్కారు నివేదిక తెలిపింది. 2015లో 11,880 మలేరియా కేసులు నమోదు కాగా, గతేడాది కేవలం 1,792 కేసులే నమోదయ్యాయి. చికున్‌గున్యా కేసులు 2012లో 94 కేసులు నమోదు కాగా, గతేడాది ఏకంగా 1,063 నమోదు కావడం గమనార్హం.

### రేపు కలెక్టర్లతో మంత్రి సమీక్ష...

వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలం ప్రబలే సీజనల్ వ్యాధులపై కేంద్రీకరించింది. ప్రధానంగా పది ఏజెన్సీ జిల్లాల్లో మలేరియా, డెంగీతో పాటు సీజనల్ వ్యాధులను పూర్తిస్థాయిలో అదుపులో ఉంచేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. శుక్రవారం సీజనల్ వ్యాధులు తీవ్రంగా ఉండే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, నాగర్‌కర్నూలు, ములుగు జిల్లా కలెక్టర్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఐటీడీఏ అధికారులు, జిల్లా వైద్యాధికారులతో వైద్య ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ సమావేశం కానున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా చేపట్టాల్సిన ప్రణాళికపై జిల్లా కలెక్టర్లకు మంత్రి దిశానిర్దేశం చేస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ముందుగా దోమల నివారణకు పంచాయతీరాజ్, విద్య, ఇరిగేషన్, మైనింగ్, ఐసీడీఎస్, మత్స్యశాఖ అధికార యంత్రాంగంతో సమన్వయ పరిచి చర్యలు తీసుకోనున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టనున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే వేక్టర్ బోర్న్ (రక్తం పీల్చే వాటి వల్లే వచ్చే) వ్యాధులైన చికెన్ గున్యా, యెల్లో ఫీవర్, డెంగీ, జికా, ఫైలేరియా లాంటి కేసుల వివరాలను కూడా ఈసారి సేకరించి, అవి ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే ఇటువంటి వ్యాధుల కేసుల రక్త నమూనాలను కూడా సేకరించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎలీసా పరీక్షలు నిర్వహించి నిర్ధారించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో దోమతెరలను పంపిణీ చేసి, వాటిని వాడుతున్నారో లేదో వైద్య సిబ్బంది ద్వారా పర్యవేక్షించనున్నారు. మలేరియా తీవ్రతపై వారం వారం క్షేత్రస్థాయిలో సమీక్షించుకొని తక్కువ ప్రభావం ఉన్న ప్రాంతాల నుంచి ఎక్కువ ప్రభావం ఉన్న ప్రాంతాలకు వైద్య సిబ్బందిని వెంటనే పంపనున్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు మెడికల్ క్యాంపులను నిర్వహించనున్నారు. ఇళ్లలో కూడా దోమల నివారణ కోసం ఎప్పటికప్పుడు మందుల పిచికారీ చేస్తారు. జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక డెంగీ వార్డులను కూడా ఏర్పాటు చేయనున్నారు. వెక్టర్ బోర్నే డిసీజ్‌తో సంభవించిన మరణాల గణాంకాలను సేకరించేందుకు ఆడిట్ కమిటీ ఆధ్వర్యంలో ఓ వైద్యుల బృందాన్ని పంపి వీటిపై విచారణ జరపనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పరీక్షల నిర్వహణ, చికిత్సపై పెద్దయెత్తున అవగాహన కల్పించనున్నారు. రెండు మూడేళ్లగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అప్పట్లో గత వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పలు మార్లు గిరిజన జిల్లాల్లో పర్యటించి నిరంతరం పర్యవేక్షించారు. ఈసారి కూడా అటువంటి కార్యక్రమాలను కూడా చేపట్టే అవకాశముంది.




**రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం**
ఆర్‌జియుకెటి-నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు & శ్రీకాకుళం ప్రాంగణములు
వి.ఆర్. మాన్షన్, కుంచనపల్లి, తాడేపల్లి, గుంటూరు జిల్లా-522 501, ఆంధ్రప్రదేశ్

6-సంవత్సరాల సమీకృత బి.టెక్. డిగ్రీ విద్యా కార్యక్రమం 2019-20 విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రకటన

No.1/RGUKT-AP/B.Tech/Admissions-2019 Date: 13-06-2019

| | | |
|---|---|---|
| ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు ప్రారంభ తేది | : | 13-06-2019 |
| ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది | : | 01-07-2019 |

మరిన్ని వివరాలకు www.rgukt.in చూడండి.

ఆర్‌జియుకెటి-ఆంధ్రప్రదేశ్ సం/- కన్వీనర్

## గాంధీ ఆస్పత్రికి వరాల జల్లు

- మౌలిక వసతుల కల్పనకు హామీ
- కార్యాచరణ సిద్ధం చేస్తామన్న మంత్రి ఈటల

**హైదరాబాద్:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. దీనికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తామని వెల్లడించారు. గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగం, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈటల వరాల జల్లు కురిపించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లతోపాటు అవసరమైన మ్యాన్‌పవర్‌ను కాంట్రాక్టు పద్ధతిన తీసుకోవాలని దీనికి అవసరమైన జీవోలను రూపొందిస్తామని హామీ ఇచ్చారు. వెంటిలేటర్లు, మోనిటర్లు, వీల్‌చైర్లు, స్ట్రెచర్లను కొనుగోలు చేయాలని టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మారై, సీటీ, క్యాత్‌ల్యాబ్‌తోపాటు పలు వైద్య పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈటల సూచించారు. గాంధీ ఆస్పత్రిలో ప్రధానమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ముంబైకు చెందిన నిపుణుల కమిటీతో అధ్యయనం చేయిస్తానని హామీ ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో పడకల సంఖ్యను 2 వేలకు పెంచాలని ఆస్పత్రి యంత్రాంగం కోరింది.

## '108' వాహనాలకు డీజిల్ కరువు

- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 70 వాహనాలు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శల వెల్లువ

**సాక్షి, హైదరాబాద్:** '108'సేవలకు డీజిల్ పోసే దిక్కు కూడా లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. సాంకేతికంగా నిధుల కొరత చూపిస్తూ వాహనాలకు డీజిల్ పోయడం లేదు. దీంతో రాష్ట్రంలో పలు చోట్ల 108 వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా అత్యవసర వైద్య సేవల కోసం వాటిని ఆశ్రయించే రోగులు సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో మొత్తం 358 అంబులెన్స్‌లు(108) ఉన్నాయి. ఇందులో కనీసం 330 వాహనాలు ప్రతి రోజూ నడుస్తూ ఉండాలి. ఏకంగా 70 వాహనాలకు డీజిల్ పోసే పరిస్థితి లేకపోవడంతో అవన్నీ మూలనపెట్టేశారు. దీంతో ప్రమాదంలో ఉన్నవారిని ఆస్పత్రికి చేర్చే పరిస్థితి లేకుండా పోయింది. రెండు నెలలుగా నిధుల విడుదల ఆగిపోవడంతో బంకుల వద్ద అప్పు పెరిగిందంటున్నారు. డబ్బులు చెల్లించకపోవడంతో డీజిల్ కొట్టేందుకు బంక్ నిర్వాహకులు ఒప్పుకోవడం లేదని 108 డ్రైవర్లు చెబుతున్నారు. ఇదేమైనా వందల కోట్ల వ్యవహారమా అంటే అదీ కాదు. కేవలం రూ.14 కోట్లు బకాయిలు ఉన్నాయని అంటున్నారు. వీటిని సాకుగా చూపిస్తూ కీలకమైన అత్యవసర సర్వీసు సేవలను నిలిపి ఉంచడం ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకేనని పలువురు వాపోతున్నారు.

# వైద్య పథకాల అమలులో భేష్

- తెలంగాణను ప్రశంసించిన నీతి ఆయోగ్
- వివిధ రాష్ట్రాలతో పోలిస్తే పురోగతి ఉంది
- వివరాలు వెల్లడించిన నీతి ఆయోగ్



**సాక్షి, హైదరాబాద్:** వైద్య ఆరోగ్య పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. ఈ మేరకు తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 117 జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖపరంగా చేపట్టాల్సిన వివిధ అంశాలను ఆధారంగా చేసుకొని ప్రత్యేకంగా కేంద్రీకరించింది. వీటిపై ప్రధానమంత్రి మోదీ ప్రత్యేకంగా సమీక్షిస్తారు. ప్రధానంగా ఆసుపత్రుల్లో ప్రసవాలు, తల్లిపాల ప్రాధాన్యం, ప్రజారోగ్య వ్యవస్థలో స్పెషలిస్టు వైద్య సేవలు, డయేరియా నివారణ, తక్కువ బరువుతో పిల్లలు పుట్టకుండా ముందస్తు చర్యలు తదితర ఎనిమిది అంశాలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాలను యాస్పిరేషనల్ జిల్లాలుగా గుర్తించింది. ఆ సర్వేల్లో ఒక్క అంశంలో మినహా మిగిలిన అన్నింటిలోనూ తెలంగాణలోని ఆ 3 జిల్లాలు మరింత పురోగతిలో ఉన్నాయని నీతిఆయోగ్ నిర్ధారించింది. ఈ మేరకు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం పంపింది. మిగిలిన జిల్లాల్లోనూ పథకాలు అమలవుతున్నట్లు నీతి ఆయోగ్ పరిశీలకులు భావిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు

కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టాక రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 1,03,827 మంది శిశువులు జన్మించారు. మొత్తం ప్రసవాల్లో 59 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో, 41 శాతం ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగాయి. కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వం గర్భిణీలకు రూ. 12 వేలు /రూ.13 వేలు ప్రోత్సాహకం అందిస్తున్న సంగతి తెలిసిందే. దీంతోపాటు బిడ్డ పుట్టాక కేసీఆర్ కిట్ పేరుతో వివిధ రకాల వస్తువులను అందిస్తుంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. దేశంలోని 117 జిల్లాల్లో 17 జిల్లాల్లో పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని నివేదికలో పేర్కొంది. అందులో తెలంగాణ జిల్లాలు లేకపోవడం గమనార్హం. గర్భిణీలకు ముందస్తు చెకప్‌ల్లో కూడా తెలంగాణ ముందు వరుసలో ఉంది. ఇక జిల్లా ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్య వసతులు కల్పించడంలోనూ తెలంగాణలోని ఆ మూడు జిల్లాలు మంచి పురోగతి సాధించాయి. దేశంలో 20 జిల్లాలు వెనుకబడి ఉన్నాయి.

### తల్లిపాలు ఇవ్వడంలో వెనుకబాటు..

పుట్టిన గంటలోపే నవజాత శిశువుకు తల్లిపాలు పట్టించాల్సిన అవసరం ఉంది. అప్పుడే శిశువు ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ తెలంగాణలోని ఆసిఫాబాద్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు మాత్రం ఈ రెండు సర్వేల్లో వెనుకబడి ఉన్నాయని నీతి ఆయోగ్ పేర్కొంది. మొదటి సర్వే కంటే రెండో సర్వే వచ్చే సరికి పరిస్థితి మరింత దిగజారిందని తెలిపింది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది. గంటలోపు శిశువులకు తల్లిపాలు ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం మన రాష్ట్రంలో అత్యధికంగా సిజేరియన్ ద్వారా బిడ్డను బయటకు తీయడమే. సిజేరియన్ చేసిన వెంటనే తల్లులు శిశువులకు గంటలోపు పాలు ఇవ్వడం అసాధ్యమైన విషయం. అదే ప్రధాన కారణంగా పలువురు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఈ ఏడాది మొదటి మూడు నెలల నివేదిక ప్రకారం ఆ మూడు నెలల్లో 1,03,827 ప్రసవాలు జరగ్గా, అందులో 62,591 మంది అంటే 60 శాతం సిజేరియన్ ద్వారానే జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 28,790, ప్రైవేటు ఆసుపత్రుల్లో 33,801 ప్రసవాలు సిజేరియన్ ద్వారా జరిగినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైతేనే సిజేరియన్ చేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.



## రేపు ఢిల్లీకి సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ నెల 15న ఢిల్లీలో జరగనున్న ఐదో నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం పాల్గొననున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి నీతి ఆయోగ్ సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి హాజరు కావాలని అన్ని రాష్ట్రాల సీఎంలను కేంద్రం ఆహ్వానించింది. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం శుక్రవారం రాత్రి రాష్ట్రానికి తిరిగి రానున్నారు. కాగా, ఈ నెల 20న ఢిల్లీలో జీఎస్టీ మండలి సమావేశం జరగనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి హోదాలో హాజరయ్యేందుకు మరోసారి కేసీఆర్ ఢిల్లీకి వెళ్లే అవకాశముంది.

## అధికారం కోసం బీజేపీ అర్రులు చాస్తోంది: కర్నె



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతాపార్టీ తెలంగాణలో అధికారం కోసం అర్రులు చాస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. బుధవారం ఆయన టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్రాన్ని అస్థిర పరచాలనుకుంటోందని, ఇక్కడ వారి ఆటలు సాగనివ్వబోమని కర్నె హెచ్చరించారు. కాషాయ కుట్రలకు ఆదిలోనే బ్రేకులు వేస్తామని చెప్పారు. మత కల్లోలాలు ప్రేరేపించి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ నేతలు చూస్తున్నారని, దీన్ని తెలంగాణ సమాజం ఆమోదించదన్నారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగబద్ధంగా టీఆర్ఎస్‌లో చేరితే, ఏది పడితే అది మాట్లాడుతూ హస్తం నేతలు పరువు తీసుకుంటున్నారన్నారు. గతంలో పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.

## నిమ్స్ నుంచి భట్టి డిశ్చార్జ్



హైదరాబాద్: ప్రతిపక్ష కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క నిమ్స్ ఆస్పత్రి నుంచి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ భట్టి చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆయన్ను నిమ్స్ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. 3 రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం పూర్తిగా మెరుగవడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి గీతారెడ్డి, మల్లురవి తదితరులు భట్టిని ఆస్పత్రిలో పరామర్శించారు.

## రాజీనామాలు చేసి పోటీ చేయండి: వంశీచందర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సరిగా లేదని పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు బీ ఫారాలిచ్చి గెలిపించింది ఇదే నాయకత్వమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారినట్లు ఆ ఎమ్మెల్యేలు చెపుతున్నారని, పార్టీ మారకపోతే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయనని కేసీఆర్ వారితో చెప్పారా అని ప్రశ్నించారు. పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలు రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆ ఎమ్మెల్యేలకు నిజంగా ప్రజా మద్దతు ఉందని భావిస్తే వెంటనే రాజీనామాలు చేసి ఎన్నికలకు సిద్ధపడాలన్నారు. రాజకీయ ఫిరాయింపులపై కేసీఆర్ స్పందించాలని వంశీ డిమాండ్ చేశారు.

## టీడీపీకి లంకల గుడ్‌బై

హైదరాబాద్: టీటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకల దీపక్‌రెడ్డి టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో బుధవారం తన రాజీనామా లేఖను అందజేశారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను త్వరలో ప్రకటిస్తానని వెల్లడించారు. ఎన్నో ఏళ్ళుగా టీడీపీకి సేవలందిస్తున్న దీపక్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఏపీలో టీడీపీ దారుణ ఓటమి చవి చూడటం, తెలంగాణలో పూర్తిగా కనుమరుగు కావడంతో ఇక లాభం లేదని పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

## బీజేపీలో చేరిన వివిధ పార్టీల నేతలు

సాక్షి, హైదరాబాద్: పలు జిల్లాలకు చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరారు. తాండూరు, కోరుట్ల నుంచి తరలివచ్చిన వారందరికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నేతృత్వంలో కోరుట్ల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి సాంబార్ ప్రభాకర్ కూడా లక్ష్మణ్ నేతృత్వంలో పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బెక్కరి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో తాండూరుకు చెందిన టీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సెలర్లు సింధూజ, నరేందర్‌గౌడ్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కూడా చేరారు.

## వివేక్‌ను కలిసిన రేవంత్

సాక్షి, హైదరాబాద్: మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి బుధవారం మాజీ ఎంపీ వివేక్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని వివేక్ నివాసంలో ఆయన్ను కలిసిన రేవంత్.. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరాలని వివేక్‌ను ఆహ్వానించినట్లు సమాచారం.

# పొల్యూషన్.. సిగ్నల్‌లో కన్ఫ్యూజన్

### మెట్రో రూట్లలో ఆన్ అవుతున్న రెడ్ సిగ్నల్స్

- తరచూ నిలిచిపోతున్న మెట్రో రైళ్లు..
- 25 కేఎంపీహెచ్‌కు పడిపోతున్న రైళ్ల వేగం..
- హైదరాబాద్‌కు సరిపడని సీబీటీసీ టెక్నాలజీ
- సాంకేతికతలో మార్పుల చేర్పులు చేయాలని థేల్స్‌సంస్థకు హెచ్ఎంఆర్ మొర

సాక్షి, హైదరాబాద్: డ్రైవర్ అవసరం లేని సాంకేతికత.. ఉప్పల్‌లోని ఆపరేషన్ కంట్రోల్ రూమ్ నుంచే రెండు ప్రధాన రూట్లలో మెట్రో రైళ్ల రాకపోకల నియంత్రణ.. కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ (సీబీటీసీ) వ్యవస్థకు ఇప్పటివరకున్న మంచిపేరు. ఫ్రాన్స్.. లండన్.. సింగపూర్ వంటి విశ్వనగరాల్లో అమల్లో ఉన్న ఈ సాంకేతికత ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్‌లో మన మెట్రో రైళ్లకు తరచూ బ్రేకులు వేస్తోంది. ట్రాఫిక్ రద్దీ పెరిగి వాతావరణంలో దుమ్ము, ధూళికాలుష్యం పెరగడంతో ఒక్కసారిగా మెట్రో రైళ్లు దూసుకెళ్లే రూట్లలో రెడ్‌లైట్లు ఆన్ అవుతున్నాయి. దీంతో కొన్ని సార్లు మెట్రో రైళ్లు ఉన్న ఫళంగా నిలిచిపోతున్నాయి. అంతేకాదు గంటకు 60 కేఎంపీహెచ్ వేగంతో దూసుకెళ్లే రైళ్ల వేగం కాస్తా.. 25 కిలోమీటర్లకు పడిపోతోంది. తాజాగా మంగళవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్యన ఎల్బీనగర్–మియాపూర్ రూట్‌లో ఇదే దుస్థితి తలెత్తింది. ఈ రూట్‌లో 25 రెడ్‌సిగ్నల్స్ ఒకేసారి ఆన్ అయ్యాయి. ఈ పరిణామంతో పలు స్టేషన్ల వద్ద రైళ్లు నిలిచిపోగా.. రైళ్ల వేగం 25 కేఎంపీహెచ్‌కు పడిపోయింది. దీంతో రంగంలోకి దిగిన మెట్రో సిబ్బంది ఈ రెడ్‌లైట్‌లను మ్యాన్యువల్‌గా ఆఫ్ చేయాల్సి వచ్చింది.



### సాంకేతిక సమస్య ఇలా..

వాతావరణ మార్పులతో పాటు.. ట్రాఫిక్ రద్దీలో కొన్ని రోజుల్లో దుమ్ము, ధూళి కాలుష్యం ఘనపు మీటరు గాల్లో 100 మైక్రోగ్రాములను మించుతోంది. ఈ స్థాయిలో కాలుష్యం నమోదైన ప్రతిసారి మెట్రో రూట్లలో ఏర్పాటుచేసిన రెడ్‌సిగ్నల్స్ ఆన్ అవుతున్నాయి. సాధారణంగా ఘనపు మీటరు గాలిలో ధూళి కాలుష్యం వంద మైక్రోగ్రాముల లోపల ఉంటేనే సీబీటీసీ సాంకేతికత పనిచేసేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే వాయు కాలుష్యం పెరిగిన ప్రతిసారీ రెడ్‌లైట్లు ఆన్ అవుతుండటంతో మెట్రో రైలు రిస్ట్రిక్టెడ్ మోడ్ (నియంత్రిత స్థాయి)కు వస్తోంది. దీంతో కొన్నిసార్లు రైళ్లు నిలపాల్సి రావడం.. చాలాసార్లు రైళ్ల వేగం 60 నుంచి 25 కేఎంపీహెచ్‌కు పడిపోతోంది. సీబీటీసీ సాంకేతికత అత్యాధునికమైనదేకాదు.. ఇది అత్యంత భద్రమైనదని మెట్రో అధికారులు చెబుతున్నా.. హైదరాబాద్‌లో వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని హెచ్ఎంఆర్ అధికారులు ఈ సాంకేతికతను తయారు చేసిన థేల్స్(ఫ్రాన్స్)కంపెనీకి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం గమనార్హం.



రెడ్ సిగ్నల్ పడి మెట్రో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికుల పడిగాపులు

### మెట్రో జర్నీలో సాంకేతిక ఇబ్బందులివే..

- టికెట్ వెండింగ్ యంత్రాలు నూతన రూ.50, రూ.100, రూ.10 నోట్లను స్వీకరించట్లేదు.
- 4 పాత కరెన్సీ నోట్లతో కలిపి ఒక కొత్త నోటును యంత్రంలో పెడితే పాతనోట్లు కూడా యంత్రంలోనే ఉండిపోతున్నాయి.
- స్టేషన్ మధ్యభాగంలో ఆటోమేటిక్ ఫెయిర్ కలెక్షన్ యంత్రాలుండే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద స్మార్ట్ కార్డులను స్వైప్‌చేస్తే కొన్ని సార్లు యంత్రాలు మొరాయిస్తున్నాయి.
- ప్లాట్‌ఫాంపైకి వెళ్లే సమయంలో సెక్యూరిటీ చెక్ వద్ద మొబైల్‌ను కూడా స్కానింగ్ చేసిన తర్వాతే అనుమతిస్తుండటంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మెట్రో అధికారులు రైళ్ల ఫ్రీక్వెన్సీ ప్రతీ రూట్లో ప్రతి 6 నిమిషాలకో రైలు అని ప్రకటించినా సమయం కొన్ని సార్లు 10–12 నిమిషాలకు పైగా పడుతోంది.
- పార్కింగ్ లాట్ వద్ద బైక్‌లకు నెలవారీ పాస్ వెల రూ.250 వసూలు చేస్తున్నారు. ఈ రుసుము అధికంగా ఉండటంతో సిటీజన్లు మెట్రో పార్కింగ్ లాట్‌లకు దూరంగా ఉంటున్నారు.
- మెట్రో కారిడార్‌లో పిల్లర్లకు లైటింగ్ లేకపోవడంతో ఈ రూట్లలో రాత్రి వేళల్లో కారుచీకట్లు కమ్ముకుంటున్నాయి.
- మెట్రో గమనంలో సడెన్‌బ్రేక్‌లు వేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



# నేడు టీఆర్ఎస్‌పీపీ భేటీ

### టీఆర్ఎస్ లోక్‌సభ నేత ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ (టీఆర్ఎస్‌పీపీ) సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనుంది. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో జరగనున్న ఈ సమావేశంలో అధికార పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు హాజరుకానున్నారు. ఈ నెల 17 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో టీఆర్ఎస్ ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేతను ఈ సమావేశంలోనే ఎన్నుకోనున్నారు. టీఆర్ఎస్ కీలక నేతలు లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన నేపథ్యంలో ఆ పార్టీ లోక్‌సభపక్ష నేతగా ఎవరు ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. గత లోక్‌సభలో టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేతగా ఉన్న ఏపీ జితేందర్‌రెడ్డికి ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. గత సభలో సభ్యులుగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్, కల్వకుంట్ల కవిత, గోడం నగేశ్, బూర నర్సయ్యగౌడ్ ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రస్తుతం టీఆర్ఎస్ తరపున గెలిచిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యుల్లో బి.బి.పాటిల్ (జహీరాబాద్), కొత్త ప్రభాకర్‌రెడ్డి (మెదక్), పసునూరి దయాకర్ (వరంగల్), నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం) రెండోసారి ఎన్నికయ్యారు. నామా నాగేశ్వర్‌రావు 2009 నుంచి 2014 వరకు టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా వ్యవహరించారు. పోతుగంటి రాములు (నాగర్‌కర్నూలు) గతంలో రాష్ట్ర మంత్రిగా, మాలోతు కవిత (మహబూబాబాద్) గతంలో ఎమ్మెల్యేగా పని చేశారు. మిగిలిన ముగ్గురు వెంకటేశ్‌నేత (పెద్దపల్లి), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), గడ్డం రంజిత్‌రెడ్డి (చేవెళ్ల) చట్టసభకు తొలిసారి ఎన్నికయ్యారు.

**ఈ ముగ్గురిలో ఒకరికి అవకాశం..**

సీనియర్ ఎంపీలుగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, పసునూరి దయాకర్‌లో ఒకరికి టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేతగా అవకాశం దక్కనుంది. గతంలో టీడీపీ లోక్‌సభా పక్షనేతగా వ్యవహరించిన నామా నాగేశ్వర్‌రావు ఇప్పుడు టీఆర్ఎస్ తరపున ఖమ్మం ఎంపీగా గెలిచారు. కమ్మ సామాజికవర్గానికి రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవి ఇచ్చే పరిస్థితి లేకుంటే నామా నాగేశ్వర్‌రావుకే ఈ పదవి ఇస్తారని తెలుస్తోంది. కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ సభ్యులలో కొత్తగా ఎన్నికైన వారే ఎక్కువగా ఉండటంతో ఈ పదవిలో ఎలాంటి మార్పులు ఉండే అవకాశం లేదు.

## అవకాశమిస్తే పార్టీని బలోపేతం చేస్తా: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధిష్టానం తనకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశమిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తనకు పదవి ముఖ్యమేమీ కాదని, కానీ హోదా ఇవ్వడం ద్వారా తనకు పార్టీ కేడర్‌ను కలిసే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక నుంచి పార్టీ అభివృద్ధి కోసమే పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పార్టీని వీడి వెళ్లిన వారి గురించి తాను స్పందించనని, కానీ పార్టీలో ఉండి సారంగాలు తవ్వుతున్న వారిపై నాయకత్వం దృష్టి సారించాలని ఆయన సూచించారు.

# సీఎల్పీ విలీనంపై స్పీకర్‌కు నోటీసులు

### ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన తాజా వ్యాజ్యంలో రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్ అధిపతిగా వ్యవహరించే శాసనసభ స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, టీఆర్ఎస్ పార్టీలోకి ఫిరాయించిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ ఫిరాయించిన పైలట్ రోహిత్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, డి.సుధీర్‌రెడ్డి, హరిప్రియ, సబితా ఇంద్రారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగ కాంతారావు, ఆత్రం సక్కు, వనమా వెంకటేశ్వరరావు, జె.సురేందర్, చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు ఇచ్చింది. గతంలో ఇదే తరహాలో దాఖలైన మరో రెండు వ్యాజ్యాలతో కలిపి ఈ వ్యాజ్యాన్ని విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. శాసనమండలిలో కాంగ్రెస్ పక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేయడం చట్ట వ్యతిరేకంగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఇప్పటికే రిట్ దాఖలు చేశారు. ఈ కేసులో పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ట్రిబ్యునల్‌గా వ్యవహరించే మండలి చైర్మన్‌కు, ఇతర ప్రతివాదులకు హైకోర్టు మంగళవారం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలిలో మాదిరిగా అసెంబ్లీలోనూ చేయనున్నారంటూ గత ఏప్రిల్ 29న కాంగ్రెస్ నాయకులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క దాఖలు చేసిన కేసులోనూ అదే తరహా నోటీసులు శాసనసభ స్పీకర్, ఇతరులకు జారీ అయ్యాయి. బుధవారం జరిగిన తాజా రిట్‌ను కూడా ఉత్తమ్, భట్టిలే దాఖలు చేశారు. ఈ కేసులన్నింటినీ కలిపి విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.

# ఎన్నికలా.. ప్రత్యేకాధికారులా?

- మున్సిపోల్స్‌పై వారంలోగా వైఖరి తెలియజేయండి
- సర్కార్‌ను ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గడువులోగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా? అనే విషయంపై వారంలోగా సమాధానమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు జూలై 2తో ముగుస్తుందని, వాటికి వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు తగిన ప్రక్రియ చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల



శ్రీనివాస్‌గౌడ్ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాల్ని మంగళవారం హైకోర్టు విచారించింది.

**సమయం కావాలి..**

ప్రభుత్వ వైఖరిని తెలిపేందుకు సమయం కావాలని కోర్టును అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు కోరారు. ప్రభుత్వ వైఖరిని తెలుసుకోవాల్సి ఉందని, వారం గడువిస్తే కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, ఉన్న మున్సిపాలిటీల్లో సమీపంలోని గ్రామాల విలీనం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని, ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల ఓటర్ల జాబితాల తయారీకి సమయం పడుతుందన్నారు. వారం రోజుల గడువు ఇస్తే మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం ఉందని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వార్డు విభజన, రిజర్వేషన్ల ఖరారు, ప్రత్యేకాధికారుల నియామకం, గడువులోగా (జూలై 2లోగా) ఎన్నికలు నిర్వహిస్తారా? వంటి అంశాలపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. వార్డుల విభజన, రిజర్వేషన్ల వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతూ మార్చి 14, మే 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా ఫలితం లేకపోవడంతో ఎస్ఈసీ గతంలోనే వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. అవసరమైన చోట్ల వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై 2 వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీ వేసిన కేసులో హైకోర్టు గతంలో ఆదేశించింది.

# చదువు 'కొనేలా' మార్చిన ఘనత కేసీఆర్‌దే

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వస్తే కామన్ స్కూల్ విద్యావిధానం తీసుకొస్తానని సీఎం కేసీఆర్ ప్రగల్భాలు పలికారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. తన మనుమడు, తన డ్రైవర్ కొడుకు ఒకే పాఠశాలలో చదివే విద్యావిధానం తెస్తానన్న కేసీఆర్ ఇప్పుడేం చేస్తున్నారని, ఆయన చెప్పిన కామన్ స్కూల్ విధానం ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని, కార్పొరేట్ విద్యా విధానానికి పెద్దపీట వేశారని ఆరోపించారు. 'చదువుకుందాం'నినాదాన్ని కాస్తా 'చదువుకొందాం'గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఫీజుల కలెక్షన్ విషయంలో దేశంలో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందన్నారు. 2007 నుంచి ఇప్పటివరకు దాదాపు 400 శాతం ఫీజు పెరిగిందని చెప్పారు. విద్యాసంస్థలు 5 శాతం కన్నా ఎక్కువ లాభాల్లో ఉండకూడదన్న నియమాన్ని అతిక్రమించి దాదాపు 70 శాతం లాభాలతో నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఫీజుల కోసం విద్యార్థులను డీటెయిన్ చేస్తున్నారన్నారు. మూడేళ్ల పిల్లలకు బ్యాగు బరువు తప్పడం లేదని, విద్యార్థుల బరువు కంటే వారి బ్యాగే ఎక్కువ బరువుంటోందని అన్నారు. రాష్ట్రంలో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల వివరాలను తమ యువజన విభాగం సేకరించిందని చెప్పారు. వారంలోగా ఆయా విద్యాసంస్థలు తగిన చర్యలు తీసుకోకపోతే వారి పనిపడతామని లక్ష్మణ్ హెచ్చరించారు.

**మజ్లిస్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే పోరాటం..**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక అక్షరాస్యత ఒక్క శాతం కూడా పెరగలేదని లక్ష్మణ్ ఆరోపించారు. గత పాలకులు 60 ఏళ్లలో చేసిన అప్పులని కేసీఆర్ ఆరేళ్లలోనే చేశారన్నారు. మజ్లిస్ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తే తమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## నేడు, రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల భేటీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుల సమావేశం ఈ నెల 13, 14 తేదీల్లో ఢిల్లీలో జరగనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అధ్యక్షతన ఢిల్లీలో ఈ సమావేశాలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో పార్టీ విస్తరణ, ప్రజల్లోకి మరింత తీసుకెళ్లే విషయంపై చర్చించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమిత్‌షా రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో పార్టీ బలోపేతంపై చర్చ జరిగే అవకాశం ఉందన్నారు. బీజేపీ బలోపేతానికి అవకాశం ఉన్న ప్రాంతం తెలంగాణ అని, అందుకే జాతీయ పార్టీ, అమిత్‌షా ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితులు, పార్టీ ఓటు బ్యాంకు పెంపు వంటి అంశాలపై జాతీయ పార్టీకి నివేదిక అందిస్తానని తెలిపారు. మరోవైపు అమిత్‌షా కేంద్ర హోంశాఖ మంత్రిగా నియమితులైన నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవిని జేపీ నడ్డాకు అప్పగిస్తారనే ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడి నియామకంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తెలంగాణలోనూ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ మూడేళ్ల పదవీ కాలం ఇప్పటికే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడి నియామకంపై ఆసక్తి నెలకొంది. ఈ సమావేశాల్లో దీనిపై చర్చించే అవకాశం ఉండకపోవచ్చన్న భావనను బీజేపీ వర్గాలు వ్యక్తం చేశాయి.

# విలీనం రాజ్యాంగ హక్కు

- అమ్ముడుపోవడానికి మేం బర్రెలం, గొర్రెలం కాదు
- కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు
- అనవసర ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తాం
- టీఆర్ఎస్‌లో విలీనమైన ఎమ్మెల్యేలు



మీడియాతో మాట్లాడుతున్న రేగా. చిత్రంలో సుధీర్‌రెడ్డి, ఆత్రం సక్కు, సబిత, గండ్ర, వనమా, చిరుమర్తి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. విలీనం రాజ్యాంగపరంగా వచ్చిన హక్కు అని చెప్పారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో విలీనమైన 12 మంది ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీలోని టీఆర్ఎస్ శాసనసభ పక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రేగ కాంతారావు మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీని విభేదించి టీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాం. మేం కాంగ్రెస్‌ను వీడటానికి అనేక కారణాలు ఉన్నాయి. మా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా స్పష్టంగా వివరించాం. అవసరమైతే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామని లేఖలో చెప్పాం. కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలు, నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోంది. భవిష్యత్‌పై భరోసా లేకే పార్టీ మారాం. అవసరమైతే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం. రాజ్యాంగబద్ధంగా మాకున్న హక్కుతోనే విలీనం చేయాలని స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చాం. స్పీకర్ విలీనానికి అంగీకరించారు. కాంగ్రెస్ అనవసరంగా రాద్ధాంతం చేస్తోంది. చట్ట ప్రకారం విలీనం జరిగినా ఇప్పటివరకు టీఆర్ఎస్ కండువా కప్పుకోలేదు. పదవుల కోసం చిల్లర మల్లరగా తిడితే పరువు నష్టం దావా వేస్తాం. మేం కూడా సుప్రీంకోర్టుకు వెళ్తాం. శాసనసభ్యుల విలీనంపై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో స్పష్టంగా ఉంది. కాంగ్రెస్ నేతలు అది చదువుకుంటే మంచిది'అని అన్నారు.

**ఉత్తమ్ వ్యవహారశైలి మారడం లేదు..**

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. 'నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల ఆకాంక్ష మేరకే మేం పార్టీ మారాం. 2014 నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ఓడుతున్నా.. కాంగ్రెస్ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవడంలేదు. ఎంతో మంది నేతలు ఆ పార్టీని వీడుతున్నా ఉత్తమ్ వ్యవహారశైలి మారడం లేదు. మాపై అనవసర విమర్శలు చేస్తే కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేస్తాం. మొన్నటి వరకు ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. రాజ్యాంగం పదో షెడ్యూల్ ప్రకారమే మేం టీఆర్ఎస్‌లో చేరాం. ప్రలోభాలకు లొంగిపోవడానికి, అమ్ముడుపోవడానికి మేం గొర్రెలం, బర్రెలం కాదు. మేం రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాం. మా రాజీనామాలు అవసరం లేదు. అవసరమని భావిస్తే రాజీనామా చేయడానికి వెనకాడం. అభివృద్ధి, రాష్ట్ర సంక్షేమమే మా ప్రాధమ్యాలు' అని అన్నారు.

## దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి: కుంతియా



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల మీద గెలిచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దమ్ముంటే పదవులకు రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా సవాల్ విసిరారు. వ్యక్తిగత స్వార్థంతోనే ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని ఆయన విమర్శించారు. కుంతియా బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లతో, కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రచారం ద్వారా, కాంగ్రెస్ పార్టీ చేసిన ఆర్థిక సహాయం ద్వారా ఎన్నికల్లో గెలిచిన సభ్యులు ఇప్పుడు పార్టీ ఫిరాయించడం అవకాశవాదమన్నారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని చెబుతున్న ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఈ విషయం ఎన్నికల ముందు టిక్కెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు తెలియదా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందిగా గవర్నర్‌కు, స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఇప్పటికే హైకోర్టులో కేసులు దాఖలు చేశామని, వారిపై అనర్హత వేటు పడే వరకు పోరాడతామని కుంతియా తెలిపారు.

# చార్‌సౌ సాల్ కాదు.. వేల ఏళ్ల వైభవం

భాగ్యనగరం అనగానే కులీ కుతుబ్‌షా 1591లో నిర్మించిన పట్టణం... అని చరిత్ర చెబుతుంది. మరి అంతకు పూర్వం సంగతేంటి? చరిత్ర పుటలు తిరగేస్తే 1518లో కుతుబ్‌షాహీ పాలన ఆరంభం కాకముందు ఢిల్లీ సుల్తానులు, అంతకు పూర్వం కాకతీయులు, వారికంటే ముందు చాళుక్యుల పాలన.. ఇలా కనిపిస్తాయి. కాకతీయుల కాలం కంటే పూర్వమే గోల్కొండ పట్టణం ఉండేదన్న సంగతిని చరిత్ర చెబుతుంది, కానీ ఎక్కడా ఆధారాలు కనిపించవు. దాదాపు మూడు వేల ఏళ్ల క్రితమే ఈ నగర ప్రాంతంలో మానవ సంచారం ఉందనడానికి ఇప్పుడు ఆధారాలు లభించాయి. రాతి యుగానికి సంబంధించి చాలా ప్రాంతాల్లో ఆధారాలు వెలుగు చూడటం సహజమే. కానీ హైదరాబాద్ మహానగరంలో వాటి జాడలు దొరకడం అరుదు. నగరం మధ్య గుండా సాగుతున్న మూసీ నదిలో మూడు వేల ఏళ్ల క్రితం కొత్తరాతి యుగం జాడలు, దాని ఒడ్డున దాదాపు 1,500 ఏళ్ల క్రితం విష్ణుకుండినుల కాలం నాటి బౌద్ధ ఉద్దేశిక స్తూపాలు వెలుగు చూశాయి. హైదరాబాద్ చరిత్ర కొత్త పుటను పరిచయం చేస్తున్న ఈ ఉదంతం ఇప్పుడు ఆసక్తి రేపుతోంది.

-సాక్షి, హైదరాబాద్



- మూసీ మధ్యలో 3 వేల ఏళ్లనాటి చిత్రాలున్న బండరాయి
- తీరంలో విష్ణుకుండినుల నాటి బౌద్ధ ఉద్దేశిక స్తూపాలు
- తాజా అధ్యయనంలో గుర్తించిన బుద్ధవనం ప్రాజెక్టు ప్రతినిధులు.. ఆసక్తిరేపుతున్న కొత్త ఆధారాలు

బౌద్ధానికి తెలంగాణ నేలతో ఉన్న అనుబంధం అసాధారణం. బుద్ధుడి బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ఆయన బతికున్న కాలంలోనే ప్రచారం మొదలైంది తెలంగాణ నుంచే అన్న విషయం ఇప్పుడిప్పుడే ఆధార సహితంగా రూఢీ అవుతోంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో బౌద్ధ ఉద్దేశిక స్తూపాలెన్నో విస్తరించి ఉన్నాయి. వీటికి ప్రభుత్వం ప్రాచుర్యం కల్పించకపోవటంతో మరుగున పడిపోయాయి. ఇప్పుడు బుద్ధవనం ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాల్లో కొత్త అన్వేషణ సాగుతుండటం కొంతలో కొంత శుభపరిణామం. ఇప్పుడు ఈ ప్రాజెక్టు అన్వేషణలోనే హైదరాబాద్ చరిత్రలో పురాతన కోణం వెలుగుచూడటం విశేషం. ఆ ప్రాజెక్టు కన్సల్టెంట్ ఎం.ఎ.శ్రీనివాసన్, బుద్ధవనం అధికారి శ్యాంసుందర్ మూసీ తీరంలో రెండు రోజుల క్రితం జరిపిన అన్వేషణలో ఆధారాలు వెలుగు చూశాయి. దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని చైతన్యపురిలో ఉన్న కొసగుండ్ల నరసింహస్వామి దేవాలయంలో బౌద్ధం జాడలున్నాయన్న సంగతిని దాదాపు 4 దశాబ్దాల క్రితమే పురావస్తుశాఖ అధికారి పరబ్రహ్మచారి గుర్తించారు. ఇక్కడ దాదాపు ఐదో శతాబ్దం నాటి శాసనాన్ని ఆయన కనుగొన్నారు. ఆ తర్వాత అన్వేషణ ముందుకు సాగలేదు. తాజాగా బుద్ధవనం తరపున ఈ ఇద్దరు ఆ దేవాలయం గుట్టపై అన్వేషించే క్రమంలో ఆసక్తికర విషయాలు గుర్తించారు. పెద్దగుండుపై విష్ణుకుండిల కాలానికి చెందిన గోవిందరాజ వర్మ ఏర్పాటు చేసిన శాసనాన్ని గుర్తించారు. ఇదే ప్రాంతంలో రెండు బౌద్ధ ఉద్దేశిక స్తూపాలను గుర్తించారు.

సాధారణంగా బౌద్ధ స్తూపాల్లో బుద్ధుడి ధాతువు ఉంటుంది. కానీ ఉద్దేశిక స్తూపాలను నాటి ముఖ్యమైన బౌద్ధ సన్యాసుల స్మారకంగా నిర్మిస్తారు. ఇక్కడ తదనంతర కాలంలో ఏర్పాటు చేసిన ఓ శివలింగంతో కూడిన రాయి దిగువన ఉద్దేశిక స్తూపం ఉన్నట్టు గుర్తించారు. గుట్టకు ఆనుకుని వెనక వైపు ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలంలో భూమిలో కూరుకుపోయి ఉన్న మరో ఉద్దేశిక స్తూపాన్ని గుర్తించారు. చెట్ల పొదలు, కొంత మట్టిని పక్కకు జరపగా వృత్తాకారంలో ఉన్న ఈ స్తూపం కనిపించింది. దాని చుట్టూ మట్టిని తొలగిస్తే ఆ స్తూపం పూర్తి ఆకృతి వెలుగు చూస్తుంది. నగరం నడిబొడ్డున బౌద్ధానికి చెందిన ఉద్దేశిక స్తూపం వెలుగుచూడటం ఇదే తొలిసారి.

## మూసీ మధ్యలో కొత్తరాతియుగం చిత్రాలు...

చైతన్యపురికి సమీపంలోనే ఉన్న మూసీ నది మధ్యలో ఉన్న ఓ భారీ బండరాయి మూడు వేల ఏళ్ల నాటి కొత్తరాతియుగం మానవ సంచారానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఆ బండరాయిపై నాటి మానవులు గీసిన ఎరుపు వర్ణం చిత్రం కనిపించింది. దాదాపు మూడు అడుగుల పొడవుతో ఉన్న ఈ చిత్రంలో పశువుల బొమ్మలు కనిపిస్తున్నాయి. రాతియుగంలో మానవులు సమూహంగా ఉంటూ ఆవాసయోగ్యంగా చేసుకున్న ప్రాంతాల్లో ఇలా చిత్రాలు గీయటం సహజం. నగరంలో కూడా ఇలా ఆవాసాలు ఎన్నో ఉండేవని చరిత్రకారులు చెబుతున్నారు. పట్టణీకరణ క్రమంలో చాలా గుట్టలను క్వారీలతో మాయం చేయటంతో ఈ ఆధారాలు నాశనమయ్యాయి. గండిపేట సమీపంలోని కోకాపేటలో ఓ గుట్టపై ఇప్పటికీ అద్భుతమైన చిత్రాలున్నాయి. ఆ గుట్టలన్నీ క్వారీల పేరుతో కనుమరుగు కాగా, స్థానికుల చొరవతో ఈ చిత్రాలున్న ఒక్క గుండును మాత్రం వదిలేశారు. అది తప్ప రాక్ పెయింటింగ్స్ నగరంలో పెద్దగా కనిపించలేదు. ఇప్పుడు మూసీ మధ్యలో పెద్ద గుండుపై కనిపించటం ఆసక్తిరేపుతోంది. ఆ చుట్టుపక్కన ఉన్న రాళ్లను జల్లెడ పడితే మరిన్ని చిత్రాలు కనిపించే అవకాశం ఉందని శ్రీనివాసన్ అంటున్నారు. ప్రత్యేక పద్ధతిలో ఆ చిత్రాలు మరింత స్పష్టంగా కనిపించేలా చేయాల్సి ఉంది. నాటి మానవులు ఆయుధాలను నూరుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రూవ్స్ కూడా బండలపై ఉన్నాయి.



మూడు వేల ఏళ్ల నాటిదిగా భావిస్తున్న చిత్రాలు



భూమిలో కూరుకుపోయిన ఉద్దేశిక స్తూపం పై భాగం



మూసీ నది మధ్యలో ఉన్న ఈ రాళ్లలోని ఆ చిత్రాలు వెలుగులోకి ..

### వెలికితీసి పరిరక్షించాలని మంత్రికి వినతి

ఇప్పుడు గుర్తించిన ఉద్దేశిక స్తూపాలను వెంటనే వెలికి తీసి పరిరక్షించాలంటూ బుద్ధవనం పక్షాన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండురోజుల క్రితం గుర్తించిన ఆధారాల వివరాలను హెరిటేజ్ తెలంగాణ విభాగం అధికారులకు, మంత్రి శ్రీనివాసగౌడ్‌కు అందజేశారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపి స్తూపాలను పూర్తిగా వెలికి తీయాలని కోరారు. తవ్వకాలు జరిపితే మరిన్ని ఆధారాలు వెలుగు చూస్తాయని శ్రీనివాసన్ అంటున్నారు. ఇది హైదరాబాద్ చరిత్రకు సంబంధించిన విషయం అయినందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

## రిజర్వేషన్లు తేలేవరకు మున్సి'పోల్స్' నిలిపివేయాలి

### బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశం తేలేవరకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల జరిగిన పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయారని, ఇదే తరహాలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తే వెనుకబడిన తరగతులు రాజకీయంగా మరింత వెనుకబడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై తీర్పు వెలువడే వరకు ఎన్నికలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బీసీ భవన్లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నీట్ కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల

- జూన్ 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- జూన్ 27న తొలి విడత సీట్ల కేటాయింపు
- రెండో విడత కౌన్సెలింగ్ జూలై 6 నుంచి 9 వరకు.. 12న సీట్ల కేటాయింపు
- ఆగస్టు 13 నుంచి 18 వరకు చివరి విడత కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: నీట్–2019 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ షెడ్యూలును మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) బుధవారం (జూన్ 12) విడుదల చేసింది. ఈ కౌన్సెలింగ్ ద్వారా 15 శాతం ఆలిండియా కోటా/ డీమ్డ్/సెంట్రల్ యూనివర్సిటీలు/ ఈఎస్ఐ, ఏఎఫ్ఎంఎస్ (ఎంబీబీఎస్/ బీడీఎస్) సీట్లను భర్తీ చేయనున్నారు. ఎంసీసీ ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకారం

### మొదటి విడత కౌన్సెలింగ్

జూన్ 19 నుంచి మొదటి విడత దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. జూన్ 25న మధ్యాహ్నం 2 గంటల్లోగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ 24 వరకు కొనసాగనుంది. అనంతరం జూన్ 25న ఛాయిస్ ఫిల్లింగ్, 26న సీట్ల కేటాయింపు చేపడతారు. జూన్ 27న మొదటి విడత సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటించనున్నారు. ఆగస్టు 20–26 మధ్యలో సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాలి. సీట్లు పొందినవారు జూన్ 28 నుంచి జూలై 3లోగా కాలేజీలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

### రెండో విడత కౌన్సెలింగ్...

ఇక రెండో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై 6 నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థుల నుంచి జూలై 6 – 9 మధ్య దరఖాస్తులు స్వీకరిస్తారు. 9న మధ్యాహ్నం 12 గంటల్లోగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. అభ్యర్థులు అదేరోజు ఛాయిస్ ఫిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం జూలై 10, 11 తేదీల్లో సీట్లు కేటాయించి.. 12న సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటించనున్నారు. సీట్లు పొందినవారు జూలై 13 – 22 మధ్యలో సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

### చివరి విడత కౌన్సెలింగ్

చివరి విడతగా సెంట్రల్/ డీమ్డ్/ ఈఎస్ఐసీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 16 వరకు ఫీజు చెల్లించాలి. అనంతరం అదేరోజు సాయంత్రం 5 గంటల్లోగా చాయిస్ ఫిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 17న సీట్లను కేటాయిస్తారు. 18న సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటిస్తారు. ఆగస్టు 20 నుంచి 26 మధ్యలో సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

## టీచర్లు లేని చోట విద్యా వలంటీర్లు

### 15,661 మంది నియామకానికి చర్యలు

### ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థులు ఉండీ టీచర్లు సరిపడ లేని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో విద్యా వలంటీర్లు రానున్నారు. గతేడాది మంజూరు చేసిన 15,661 మంది విద్యా వలంటీర్లను ఈ విద్యా సంవత్సరం కోసం ఎంగేజ్ చేయాలని విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్పష్టం చేసిన ఆయన బుధవారం విద్యా వలంటీర్లను నియమించేందుకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల్లో అవసరమైన పాఠశాలల్లో వారి సేవలను వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. దీంతో జిల్లాల్లో అందుకు అవసరమైన చర్యలపై డీఈవోలు దృష్టి సారించారు. అయితే గతేడాది పని చేసిన విద్యా వలంటీర్లనే కొనసాగించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

## 3 నెలల్లో స్మార్ట్ విలేజ్‌గా యాదాద్రి

### ప్రణాళిక రూపొందించుకోవాలి: సీఎస్ ఎస్కే జోషి



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి పట్టణాన్ని స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేయడానికి అవసరమైన పనులను 3 నెలల్లోగా పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం జరిగింది. యాదాద్రి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కేబుల్స్, స్ట్రీట్ లైట్స్, సెంట్రల్ లైటింగ్ స్ట్రాం వాటర్ డ్రైన్స్, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కులు తదితర అభివృద్ధి పనులన్ని త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. వేద పాఠశాల నిర్మాణానికి 16 ఎకరాల దేవాదాయ భూమిని కేటాయించినందున, పాఠశాల నిర్మాణానికి సంబంధించి నివేదికను సమర్పించాలని కోరారు. బస్వాపూర్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయగిరి, గండిచెరువు, పెద్దచెరువు, మల్లాపూర్ చెరువు, సైదాపూర్ చెరువుల అభివృద్ధి పనులను సమీక్షించారు. శిల్పకళ శిక్షణ సంస్థలో విద్యను అభ్యసిస్తున్న స్థపతుల సేవలు వినియోగించుకోవాలన్నారు. టెంపుల్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.20లక్షల ఖర్చు

### సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1.20లక్షలు ఖర్చు చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోందని, అత్యుత్తమ విద్యాలయాలుగా వాటిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులు, ఉద్యోగులదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శులు, అధికారులతో తన నివాసంలో ఆయన సమావేశం నిర్వహించారు. గురుకులాల్లో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సౌకర్యాలను కల్పిస్తూ మెరుగైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధిస్తుండడంతో విద్యార్థులు గురుకులాల పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీ గురుకులాల్లో 5వ తరగతిలో 14,640 సీట్లుంటే ఇప్పటివరకు 13,444 మంది అడ్మిషన్లు తీసుకున్నారన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 17,904 సీట్లకుగాను ఇప్పటివరకు 16,347 మంది, గిరిజన గురుకులాల్లో 5,707 సీట్లకుగాను ఇప్పటి వరకు 5,037 మంది విద్యార్థులు చేరినట్లు సంబంధిత అధికారులు మంత్రికి తెలిపారు. బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లు 19,781 ఉండగా, 16,416 మంది చేరారన్నారు. వంద శాతం విద్యార్థులు అడ్మిషన్లు పొందే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం వైపు యువత: నిరంజన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం వైపు యువత మళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఐదేళ్లుగా వ్యవసాయ రంగ అభివృద్ధికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని, నిరాశలో ఉన్న రైతాంగానికి బాసటగా అనేక పథకాలను ప్రవేశపెట్టి వారిలో ఆత్మస్థైర్యం నింపిందని తెలిపారు. ఆఫ్రికా దేశం రువాండ మాజీ వ్యవసాయ మంత్రి టోని సంగనిరా హైదరాబాద్ పర్యటన సందర్భంగా నిరంజన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణ స్వరూపమే మారబోతోందని, వ్యవసాయం లాభసాటిగా మార్చడం, యువత ఈ రంగంలోనే ఉపాధి చూసుకుని ఆత్మవిశ్వాసంతో జీవించే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

## ఆ కలెక్టర్లు కోర్టుకు హాజరు కావాలి

- కోర్టు ధిక్కార కేసులో హైకోర్టు ఆదేశం
- మరో ముగ్గురికి కూడా నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఉత్తర్వుల్ని ధిక్కారించారనే ఆరోపణల కేసులో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న జరిగే విచారణకు స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు వెంకట్రామిరెడ్డి, కృష్ణ భాస్కర్, సిద్దిపేట జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లు స్వయంగా హాజరుకావాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ జిల్లాకు చెందిన కె.రవీందర్ మరో ఏడుగురు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని విచారించిన న్యాయమూర్తి ప్రతివాదులు స్వయంగా కోర్టు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. సిద్దిపేటకు సమీపంలోని లింగారెడ్డిపల్లిలో నాలుగు ఎకరాలను కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు తీసుకుని కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని పిటిషనర్లు రిట్ దాఖలు చేశారు. ఎస్సైన్డ్ భూమిలో ఉన్నారని చెప్పి తమను భూమి నుంచి బలవంతంగా బయటకు పంపిచేందుకు రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోసం కనీసం ఒక్క ఎకరమైనా ఇవ్వాలని పట్టుబడుతున్నారని వారి తరపు న్యాయవాది వీవీఎన్ నారాయణరావు వాదించారు. 2015లో హైకోర్టు భూముల నుంచి రైతుల్ని బయటకు పంపవద్దని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులు భూముల్లోకి వచ్చి మామిడి చెట్లను కూడా నరికేశారని చెప్పారు. వాదనల అనంతరం ఇద్దరు కలెక్టర్లతోపాటు సిద్దిపేట జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లు 22న జరిగే విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

## వ్యవసాయ సమస్యలు పరిష్కరించాలి

### వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ ఎత్తున చేపట్టిన సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సవాళ్లను వ్యవసాయ వర్సిటీ పరిష్కరించాల్సిన అవసరముందని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు అన్నారు. సమర్థ నీటి యాజమాన్యం, భూసార నాణ్యతని సంరక్షించడం, ఉత్పాదకతల మధ్య అంతరాలను తగ్గించడం, కూలీల లభ్యత తగ్గుదల, యాంత్రీకరణను విస్తృతం చేయడం వంటి అంశాలపై వర్సిటీ ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ ఇంగ్లాండ్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ కారోలిన్ గ్రాస్, విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వీసీ ప్రవీణ్ రావు, ఇతర ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతు సమాజ అభ్యున్నతి కోసం అనేకరకాల పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం కోసం ఫ్లోరిడా విశ్వవిద్యాలయం, కార్నెల్ విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ తదితరాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. జర్మనీతో కలసి పనిచేస్తున్నట్లు వివరించారు. సహజవనరుల యాజమాన్యం, ఫుడ్ టెక్నాలజీ, బోధన సిబ్బంది పరస్పర మార్పిడి అంశాల్లో కలసి పనిచేయాలని సమావేశంలో తీర్మానించారు. అందుకు సంబంధించి సాధ్యమైనంత త్వరలో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రవీణ్‌రావు, కారోలిన్ గ్రాస్ నిర్ణయించారు.

## సింగరేణి పల్లెలకు రూ.1844 కోట్ల నిధులు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) నిధులను వినియోగించాలని ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు కోరారు. ట్రస్ట్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం ఆయన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్టు కార్యక్రమం కింద సమీప గ్రామాల అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ 2015 నుండి ఇప్పటి వరకు రూ.1,844 కోట్ల నిధులను కేటాయించింది. సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల కలెక్టర్ల వద్ద ఈ నిధులను డిపాజిట్ చేసింది. ఈ నిధులను ఏ పనులకు ఖర్చు చేయాలన్న విషయంపై సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేల నుంచి సూచనలు స్వీకరించారు. సింగరేణి పరిసర గ్రామాలు, పట్టణాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు వినియోగించాలని ఈ సమావేశంలో నిర్ణయిం చారు.

## సెప్టెంబర్ 15 నాటికి బతుకమ్మ చీరలు

- ఈ ఏడాది 6.30 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి లక్ష్యం
- గత అనుభవాల నేపథ్యంలో ఫిబ్రవరిలోనే ఆర్డర్లు
- 50 రకాల డిజైన్లను రూపొందించిన 'నిఫ్ట్'నిపుణులు
- ఈ ఏడాది టెస్కో ద్వారా రూ.450 విలువైన ఆర్డర్లు

సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ చీరల పంపిణీలో గతంలో తలెత్తిన అవాంతరాలను దృష్టిలో పెట్టుకుని.. ఈ ఏడాది చీరల తయారీని సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. 6.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి జరగాల్సి ఉండటంతో.. ఫిబ్రవరిలోనే చేనేత సహకార సంఘాలకు చీరల తయారీకి చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆర్డర్ ఇచ్చింది. గతంతో పోలిస్తే రంగులు, డిజైన్ల ఎంపికలోనూ వైవిధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ వివిధ రంగుల్లో 50 రకాలైన చీరలను ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలో 2017 నుంచి అర్హులైన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చీరలు పంపిణీ చేస్తోంది. రెండేళ్లుగా సుమారు 90లక్షల మందికి పైగా ఉచితంగా చీరలు పంపిణీ చేసిన ప్రభుత్వం.. ఈ ఏడాది 95లక్షల చీరల పంపిణీని లక్ష్యంగా నిర్దేశించింది. చీరల తయారీ బాధ్యతను సిరిసిల్లలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు అప్పగించారు. బతుకమ్మ చీరల పంపిణీకి సంబంధించి తొలి ఏడాది.. అనగా 2017లో ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడంతో.. సిరిసిల్ల చేనేత సహకార సంఘాలు సకాలంలో చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించలేక పోయాయి. దీంతో 3.75కోట్ల మీటర్ల వస్త్రాన్ని సిరిసిల్ల మరమగ్గాల మీద సిద్ధం చేయగా, మరో 2.36కోట్ల మీటర్ల వస్త్రాన్ని గుజరాత్‌లోని సూరత్ నుంచి దిగుమతి చేసుకున్నారు. సూరత్ నుంచి దిగుమతి చేసుకున్న వస్త్రం నాణ్యతపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో 2018 బతుకమ్మ చీరల తయారీకి సంబంధించిన ఆర్డర్‌ను పూర్తిగా సిరిసిల్ల నేత కార్మికులే స్థానికంగా మరమగ్గాలపై సిద్ధం చేశారు. సుమారు 6 కోట్ల మీటర్ల వస్త్రాన్ని సకాలంలో సిద్ధం చేసినా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బతుకమ్మ చీరల పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. దీంతో ఎన్నికలు ముగిసిన తర్వాత గత ఏడాది డిసెంబర్ మూడో వారంలో ఈ చీరల పంపిణీ ప్రారంభించి..ఈ ఏడాది జనవరి వరకు పంపిణీ ప్రక్రియ కొనసాగించారు.

### 20 వేల మందికి ఉపాధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బతుకమ్మ చీరల పంపిణీకి రెండేళ్లుగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ ఏడాది సెప్టెంబర్ మూడో వారంలో లబ్ధిదారులకు చీరలు అందేలా చేనేత శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముదురు రంగులతో కూడిన 50 రకాలైన డిజైన్లను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నిపుణులు రూపొందించారు. చీర అంచులు, కొంగు డిజైన్లలో వైవిధ్యం ఉండేలా రూపొందించడంతో



పాటు, చీరతో పాటు రవిక బట్టను కూడా అందిస్తారు. ఈ ఏడాది సుమారు 6.30 కోట్ల మీటర్ల వస్త్రం ఉత్పత్తి చేయాలని సిరిసిల్ల చేనేత సహకార సంఘాలకు ఆర్డర్ ఇవ్వగా.. 95లక్షల మందికి చీరలు పంపిణీ చేయనున్నారు. వీటి తయారీ ద్వారా సిరిసిల్లలో 22వేలకు పైగా మరమగ్గాలపై ఆధారపడిన 20వేల మంది చేనేత కార్మికులకు సుమారు ఆరు నెలల పాటు ఉపాధి దక్కనుంది. గతంలో సగటున నెలకు రూ.6 వేల నుంచి రూ.8వేల వరకు వేతనం పొందిన కార్మికులు.. ప్రస్తుత ఆర్డర్లతో సుమారు రూ.20వేల వరకు ఆర్జిస్తున్నారు.

### టెస్కో ద్వారా రూ.450 కోట్ల ఆర్డర్లు

తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ (టెస్కో) ద్వారా రాష్ట్రంలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఈ ఏడాది సుమారు రూ.450 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కాయి. ఈ ఏడాది రూ.280 కోట్లు బతుకమ్మ చీరల రూపంలో సిరిసిల్ల చేనేత సహకార సంఘాలకు ఆర్డర్ లభించింది. వీటితో పాటు రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పంపిణీ చేసే వస్త్రాల ఉత్పత్తి ఆర్డర్ కూడా ఈ సంఘాలకే దక్కింది. కేసీఆర్ కిట్ల ద్వారా బాలింతలకు ఇచ్చే చీరలతో పాటు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలకు సంబంధించి దుప్పట్లు, కార్పెట్ల తయారీ ఆర్డర్లను సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్ జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు అప్పగించారు. ఇదిలా ఉంటే బతుకమ్మ చీరల ద్వారా ఉపాధి పొందుతున్న సిరిసిల్ల చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి బకాయిలు సకాలంలో విడుదల కావడం లేదు. గత ఏడాది బతుకమ్మ చీరలు, రంజాన్ వస్త్రాల తయారీకి సంబంధించి రూ.25 కోట్ల మేర రావాల్సి ఉంది.

సాక్షి
గురువారం, జూన్, 13

# దౌత్యంలో కొత్త దారులు

మిత్ర, శత్రు దేశాలన్న తేడా లేకుండా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అందరినీ టారిఫ్‌ల యుద్ధంతో ఠారెత్తిస్తున్న వర్తమాన వాతావరణంలో కిర్గిజిస్తాన్‌లోని బిష్కెక్‌లో గురు, శుక్రవారాల్లో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. గత ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను బుట్టదాఖలు చేసి, కొత్త షరతులు విధిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్న ట్రంప్ ధోరణి వల్ల ఇబ్బంది పడని దేశమంటూ లేదు. అమెరికాకు ఎంతో సన్నిహితంగా ఉండే యూరప్ దేశాలు సైతం ఈ దూకుడును సహించలేకపోతున్నాయి. అందుకే ఎస్‌సీఓ తీరుతెన్నులు ఇక ముందెలా ఉండబోతున్నాయన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. అది తీసుకోబోయే నిర్ణయాలు అంతర్జాతీయ సంబంధాలపై రానున్న రోజుల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశమున్నదని అంచనా వేస్తున్నవారూ ఉన్నారు. తమ తమ ప్రాంతాల్లో అమెరికా ప్రభావాన్ని పరిమితం చేయడం ఎలాగన్నది ఇప్పుడు రష్యా, చైనాలను వేధిస్తున్న ప్రశ్న. ఇందుకోసం తమ మధ్య ఉన్న వైరుధ్యాలను పక్కనబెట్టి సమష్టిగా కలిసి కదలాలని అవి రెండూ భావిస్తున్నాయి. పూర్వపు సోవియెట్ యూనియన్‌లో భాగంగా ఉన్న దేశాల్లో అమెరికా ప్రభావం క్రమేపీ పెరగడం రష్యాను కలవరపెడుతుంటే... పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో దాని తీరుతెన్నులపై చైనాకు అభ్యంతరాలున్నాయి. రష్యా, చైనాలు కూటమిగా ఏర్పడటం అసాధ్యమని ఇన్నాళ్లూ అమెరికా భావిస్తూ వస్తోంది. కానీ ఈ ఏడాది మొదట్లో అమెరికా నిఘా సంస్థ సెనేట్‌కు సమర్పించిన ఒక నివేదిక చైనా, రష్యాల మధ్య విస్తరిస్తున్న సహకారాన్ని ప్రత్యేకించి ప్రస్తావించింది. అవి పరస్పరం స్నేహసంబంధాలను పెంపొందించుకోవడంతోపాటు అంతర్జాతీయ సంస్థల ద్వారా వాటికి అనువైన కొత్త నిబంధనలు, ప్రమాణాలు ఏర్పరచడానికి ప్రయత్నిస్తున్నాయని ఆ నిఘా నివేదిక వివరించింది. అంతకుముందు సోవియెట్ యూనియన్, చైనాల మధ్య సంబంధాల మాటెలా ఉన్నా, 80వ దశకం చివరి నుంచి అవి క్రమేపీ మెరుగుపడుతూ వచ్చాయి. సోవియెట్ కుప్పకూలి రష్యా ఏర్పడ్డాక రెండింటిమధ్యా మిత్రత్వమే కొనసాగుతోంది.

వలసలను కట్టడి చేయకపోతే అమెరికాకు చేసే ఎగుమతులపై మరో 5 శాతం టారిఫ్‌లు విధించి దాన్ని 25శాతానికి తీసుకెళ్తానని డోనాల్డ్ ట్రంప్ పక్షం రోజులక్రితం మెక్సికోను హెచ్చరించారు. ఆ మర్నాడు మన దేశంపై విరుచుకుపడ్డారు. భారత్‌కు ఇప్పటివరకూ ఇస్తున్న సాధారణ ప్రాధాన్యతల వ్యవస్థ(జీపీఎస్)ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీనివల్ల 560 కోట్ల డాలర్లమేర భారత్‌కున్న వెసులుబాట్లు పోతాయని అమెరికా అంచనా వేస్తుండగా, అది 19 కోట్ల డాలర్లు మించదని మన దేశం చెబుతోంది. భారత్ మార్కెట్లలో అమెరికాకు సమాన ప్రతిపత్తి కల్పించనప్పుడు మేమెందుకు దాన్ని కొనసాగించాలన్నది ట్రంప్ వాదన. అలాగే నిరుడు చైనాపైనా, 28 దేశాల కూటమి యూరప్ యూనియన్(ఈయూ)పైనా ఆయన భారీయెత్తున సుంకాలు విధించగా అటు చైనా, ఇటు ఈయూ సైతం అమెరికా ఉత్పత్తులపై తాము కూడా సుంకాలు పెంచుతున్నట్టు ప్రకటించాయి. ఎవరికి వారు అమెరికా సాగిస్తున్న ఈ టారిఫ్‌ల యుద్ధం వల్ల నష్టపోతున్న తరుణంలో ఆ దేశాలన్నీ ఏదో మేర ఏకం కావాలని చూడటం అసహజమేమీ కాదు.

పద్దెనిమిదేళ్లక్రితం ఆవిర్భవించిన ఎస్‌సీఓలో మన దేశానికి 2017లో సభ్యత్వం లభించింది. అయితే అది కీలకమైన సంస్థగా రూపుదిద్దుకోబోతున్నదని అప్పట్లో ఎవరూ ఊహించలేదు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకంగా ఏర్పడింది కాదని, ఇందులో భద్రత, అభివృద్ధిపైనే దృష్టి సారించి, వాటికి సంబంధించిన వివిధ అంశాలను చర్చిస్తామని ఇప్పటికే చైనా ఉప విదేశాంగమంత్రి ఝాంగ్ హాన్ హ్యూ వివరణనిచ్చారు. అలా అంటూనే వాణిజ్యపరమైన ఆత్మరక్షణ విధానాలు, ఏకపక్ష విధానాలు వగైరాలపై కూడా పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటామని ఆయన అనడాన్నిబట్టి అమెరికా వ్యవహారశైలి, దాన్ని ఎదుర్కొనడానికి అనుసరించాల్సిన వ్యూహం వగైరాలు కూడా శిఖరాగ్ర సదస్సులో ప్రస్తావనకు రాకమానవని అర్థమవుతోంది. ఎస్‌సీఓలో సభ్య దేశాలుగా ఉన్న భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉన్న విభేదాలు, తనకు భారత్‌తో ఉన్న వివాదాలు పరిష్కారమైతే సంస్థ మరింత పటిష్టమవుతుందన్న అభిప్రాయం చైనాకుంది. అదే సమయంలో అమెరికా పోకడల విషయంలో భారత్, చైనాలు రెండింటికీ అభ్యంతరాలున్నాయి. ఇవే తమ మధ్య మరింత సహకారాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని చైనా విశ్వసిస్తోంది. ప్రధాని మోదీ ఈ సదస్సులో ఉగ్రవాదం అంశాన్ని లేవనెత్తినా, నేరుగా పాక్ పేరెత్తి దాన్ని విమర్శించబోరని చైనా ఆశిస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోదీ, పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ల మధ్య భేటీ జరగబోదని ఇప్పటికే తేటతెల్లమైంది.

అమెరికా అనుసరిస్తున్న ధోరణులు ఆ దేశానికి సన్నిహితంగా ఉండే సింగపూర్, మలేసియా వంటి దేశాలకు కూడా రుచించడం లేదు. ఎదుగుతున్న చైనాను, దాని ఆకాంక్షలను గుర్తించి అందుకు అనుగుణమైన సర్దుబాట్లు చేసుకోవాలని ఈ నెల 2న ముగిసిన ఆసియా ప్రాంత దేశాల రక్షణ సదస్సు 'షాంగ్రీలా డైలాగ్'లో సింగపూర్ ప్రధాని లీ షెన్ లూంగ్ అమెరికాకు హితవు పలికారు. చైనాతో వాణిజ్య, భద్రతా అంశాల్లో తగవుపడుతున్న అమెరికా తీరును మలేసియా ప్రధాని మహతీర్ మహమ్మద్ విమర్శించారు. ఇలా సన్నిహిత దేశాలకే అమెరికా అనుసరిస్తున్న ధోరణి నచ్చని స్థితిలో, దాని బాధిత దేశాలకు ఇంకెంత ఆగ్రహావేశాలుంటాయో అర్థం చేసుకోవచ్చు. ట్రంప్ విధానాల వల్ల చైనా, రష్యాలు సన్నిహితమవుతున్నాయని, ఈ పరిణామం ముందూ మునుపూ అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని ఆ దేశ పౌరులు ఆందోళన పడుతున్నారు. ఏదేమైనా శరవేగంగా మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో మన దేశానికి గరిష్టంగా ప్రయోజనాలు రాబట్టే దిశగా మన దౌత్య వ్యూహాలను పదునుపెట్టుకోవాల్సి ఉంటుంది.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
జ్యేష్ఠ మాసం, తిథి శు.ఏకాదశి సా.5.31 వరకు, తదుపరి ద్వాదశి
నక్షత్రం చిత్త ప.12.04 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం సా.5.25
నుంచి 7.01 వరకు, దుర్ముహూర్తం ఉ.9.48 నుంచి 10.40 వరకు
తదుపరి ప.3.01 నుంచి 3.54 వరకు
అమృతఘడియలు... ఉ.6.01 నుంచి 7.29 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# నయవంచన వీడని 'నారా'గణం

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అఖండ ప్రజాతీర్పు పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీని కలిసి తన ప్రమాణ స్వీకారోత్సవానికి రావలసిందిగా మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంలోనే ఏపీ ప్రజలు అత్యవసరంగా భావిస్తున్న ప్రత్యేక హోదాతోపాటు విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన తదితర హామీలు, కేంద్రం నెరవేర్చాల్సిన బాధ్యత ఆవశ్యకతపై దాదాపు గంటపాటు వివరించి, వినతిపత్రం కూడా అందచేశారు. తర్వాత ఢిల్లీలోనే జాతీయ మీడియాతో భేటీలో తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. 'మన దురదృష్టం కొద్దీ కేంద్రంలో మనం కోరుకున్నట్లు ఎన్డీఏ 250 స్థానాలకు పరిమితం కాకుండా బీజేపీ కూటమికి 300 స్థానాలకు పైగా వచ్చాయి. మన అవసరం కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి లేదు. అయినా ఏపీకి ప్రత్యేక హోదా, తదితర హక్కుల సాధన కోసం మన కృషిని సాగిస్తాం. నేను మోదీజీని కలిసిన ప్రతిసారీ ఆ విషయమై ప్రస్తావిస్తూనే ఉంటాను' అని జగన్ చెప్పారు. ఒక మార్క్సిస్టుగా నా దృష్టిలో దేశం విషయంలో ప్రస్తుత ప్రధాన వైరుధ్యం కేంద్రంలో బీజేపీ కూటమికి ప్రజలకు మధ్యనే! నావంటివారికి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ జాతీయ మీడియా ముందు, ఇంకా ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే 'మన దురదృష్టం కొద్దీ మోదీ ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ వచ్చింది' అని చెప్పడం ఒక సాహసమే అనిపించింది. ఏపీ ప్రజల ప్రయోజనాల పట్ల మొహమాటపడకుండా తన నిబద్ధతను, కర్తవ్యాన్ని స్పష్టంగా చెప్పడం అవసరమనే భావించి, అలా చెప్పారనిపించింది!

ఇంకేం! వెన్నుపోట్ల పార్టీ అయిన చంద్రబాబు టీడీపీ అనుకూల మీడియా చానల్ ఒకటి 'ప్రత్యేక హోదాపై జగన్ చేతులెత్తేసినట్లేనా? మన ఖర్మ అనుకోవలసిందేనా?' అనే రీతిలో చర్చపెట్టింది. ఇంకో చానల్ మోదీని ఢీకొనేది ఎవరు? అది జగనా, చంద్రబాబా అన్న రీతిలో వారిరువురి ఫొటోలతో మరో ప్రోగ్రాం నిర్వహించింది. ఎన్నికల్లో చంద్రబాబు పార్టీ అస్తిత్వమే ప్రశ్నార్థకం అవనున్నదన్న రీతిలో, తనకూ, తన పాలనకూ ప్రజలు కనీవినీ ఎరుగని ఘోరపరాజయం కట్టబెట్టారు. ఆ ఆత్మన్యూనతా భావన నుంచి ఇంకా బాబు తేరుకోలేదు. మీడియా ముందుకు వచ్చి రాజకీయ కామెంట్ స్పష్టంగా ఇంతవరకూ చెప్పిందీ లేదు. ఇక ఆయన మోదీని ఢీకొనే ప్రశ్న ఎక్కడిది? అయినా ఢీకొనగల శక్తి ఏమి మిగిలింది కనుక? ఆయన పార్టీకి లోక్‌సభలో వచ్చిన స్థానాలే ముచ్చటగా మూడంటే మూడే. అందులోనూ గుంటూరునుంచి ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించిన గల్లా జయదేవ్ సీటు ఐదేళ్లూ పూర్తి కాకుండానే ఎన్నడైనా గల్లంతయ్యే అవకాశం ఉంది. ఆ పార్లమెంటరీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు పదివేలు ఉండగా, వాటిని లెక్కించకుండానే అయిదువేల మెజారిటీతో జయదేవ్ జయించినట్లు చట్టవ్యతిరేకంగా ఆ నియోజకవర్గ ఎన్నికల అధికారి ఒకవైపు తాను వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రకటించారన్న అంశంపై రుజువులతోసహా అక్కడ పోటీచేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోర్టుకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. విజయవాడ నుంచి చంద్రబాబు టీడీపీ తరపున వాస్తవంగా గెలిచిన కేశినేని నాని వంటి సాపేక్షికంగా అనుభవజ్ఞుడు ఉండగా ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా గల్లా జయదేవ్‌నే చంద్రబాబు ప్రకటించారు. సహజంగానే ధర్మాగ్రహంతోనే తాను అవమానానికి గురైనట్లుగా భావించిన కేశినేని ట్విట్టర్‌లో చంద్రబాబుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అయితే చంద్రబాబు, పుండుమీద కారం చల్లినట్లు ఆ జయదేవ్‌నే కేశినేని వద్దకు రాయబారం పంపారు. అయినా కేశినేని లొంగలేదు. పైగా పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస బంధనాలు తప్ప అంటూ ట్వీట్ చేశారు. ఎవరిమీద పోరాటమో వేరే చెప్పాలా? ఇకపై ఆయన ఎలా వ్యవహరిస్తారో చూడాలి. ఇలాంటి స్థితిలో ఉన్న తన పార్టీ తరపున చంద్రబాబు మోదీని ఢీకొట్టడమా? ఆ ఛానల్ వారిది ఎంత కమ్మని కల?

ఇలాంటి మీడియాలే జగన్‌కి, బీజేపీకి లోపాయికారీ ఒప్పందం ఉందని ప్రచారం చేశాయి. చేస్తున్నాయి. కనుకనే ఢిల్లీ పత్రికాగోష్టిలో అలా మెత్తగా మాట్లాడారట జగన్. మోదీతో సమరశీల పోరాటం చేస్తామని జగన్ చెప్పాలని అనుకుంటున్నాయి కాబోలు. నాలుగేళ్ల నిర్లజ్జగా మోదీతో సహజీవనం చేసిన చంద్రబాబు విషయం వారెత్తరు. అయినా తన ప్రమాణ స్వీకారోత్సవానికి రమ్మని మోదీని ఆహ్వానించేందుకు వెళ్లిన జగన్ పెళ్లికి వెళ్లి తద్దినం మంత్రాలు చదివినట్లు అప్పుడే శరభ శరభ దశ్శరభశరభా అంటూ బాలకృష్ణ వలే తొడగొట్టాలా? ఇలా కుంటి సవాళ్లు విసిరే చానళ్లకు కొంచమైనా ఇంగితజ్ఞానం ఉండాలి!

ఇంతెందుకు, తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తూ చేసిన ప్రసంగంలో ఒక్కసారైనా ప్రశంసాపూర్వకంగా అన్న సంగతి అటుంచి, మామూలుగానైనా మోదీ ప్రస్తావనను జగన్ తెచ్చారా? పైగా వైఎస్ జగన్ ఆదినుంచి తన వైఎస్సార్‌సీపీని తెలుగు ప్రజల ప్రయోజనాలు, పురోగమనం, శ్రేయస్సు ఇవే ధ్యేయంగా దిశానిర్దేశన చేస్తూ వచ్చారు. జగన్ సర్వమత సమానత్వానికి చిహ్నంగా తన ప్రమాణ స్వీకరణ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వాదం బహిరంగ వేదికపై స్వీకరించారు. ఒక సందర్భంలో తాను రోజూ బైబిల్ చదువుతాననీ చెప్పారు. కడపలో దర్గాకు వెళ్లారు. బీజేపీ వారు ఆనందించి, అభినందించే చర్యలేనా ఇవి? ముస్లిం మైనారిటీల పట్ల, దళితుల పట్ల,



మహిళల పట్ల, వెనుకబడిన కులాలవారి పట్ల తనకున్న గౌరవాదరాభిమానాలు ప్రజలకు స్పష్టంగా తెలియాలనే వారిలో 5 గురికి ఉపముఖ్యమంత్రి పదవులిచ్చారు. తన మంత్రి వర్గంలో సైతం వారికి దాదాపు 60 శాతం మేరకు అమాత్య పదవులనిచ్చి ఆదరించారు. భారతదేశ వైవిధ్యాన్ని వివిధ జాతుల సముదాయంగా అంగీకరించలేని ఆరెస్సెస్, బీజేపీ వారికి జగన్ పాటిస్తున్న సర్వమత సమభావం, సామాజిక న్యాయం, సౌమ్యత నచ్చుతాయా? ఒకవేళ, మన తెలుగు జాతి మన సంస్కృతి మన సాంప్రదాయాలను మన మాతృభాష తెలుగును రోడ్డు రోలరుతో, అఖండభారత్ పేరిట చదును చేయాలని, మతతత్వ శక్తులు యత్నిస్తే, జగన్ మన జాతి ప్రజల తరపున పోరాడనని చెప్పాడా? పైగా ఈ మోదీ ప్రభుత్వంపైనే అవిశ్వాస తీర్మానం పెట్టిన చరిత్ర వైఎస్సార్ సీపీకి ఉంది. ఇలా కాకుండా తమ నేత బాబులానే మనపార్టీ విజయం నూటికి వెయ్యిసార్లు నిజమని ఉత్తర కుమార ప్రతినలు చేయాలా?

'సామాజిక న్యాయం పాటించారు మంచిదే కానీ ఆయా మంత్రిత్వ శాఖలను నిర్వహించే అనుభవమూ, సామర్థ్యమూ వారికి ఉండాలి కదా' అని వెన్నుపోట్ల పార్టీ విశ్లేషకులు కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అయ్యా, తమ నేత 40 ఏళ్ల అనుభవం, అంతకుతగ్గ సామర్థ్యం ఉందని తామంతా భజన చేసిన వారే కదా! ఆయనగారి నిర్వాకం వల్లే కదా.. గత 55 ఏళ్ల పాలనలోనే ఆంధ్రప్రదేశ్ ఎన్నడూ ఎరుగనంతటి అవినీతిని, ఆశ్రితపక్షపాతాన్ని పాలక పార్టీ నేతల అహంకారాన్ని, నయవంచనను చవిచూసి అధోగతి పాలైంది. చివరకు అనుభవం, సామర్థ్యం అనే పదాలు వినగానే చంద్రబాబు ప్రగల్భాలు గుర్తుకొచ్చి జనాలు భయపడిపోతున్నారు!

మరోవైపున అంబటి రాంబాబు, భూమన కరుణాకరరెడ్డి, రోజా, ఆళ్ల రామకృష్ణారెడ్డి వంటి పార్టీ ముఖ్యులకు మంత్రిపదవులు దక్కనందుకు చాలా మథనపడుతూ ఒక చానల్‌లో వెన్నుపోట్ల పార్టీ నేత ఒకరు మహా ఆవేదన చెందుతున్నారు? వారు పదవులు ఆశించేవారే అయితే ఆ స్థాయికి ఎదిగేవారు కాదు. ఇప్పుడున్న మంత్రివర్గంలో 90 శాతం మందిని రెండున్నర సంవత్సరాల తర్వాత మార్చి, పార్టీని పటిష్టపరిచే పనికి పంపుతానని జగన్ చేసిన ప్రకటనను కూడా ఈ చానల్స్ వక్రీకరించి, 2024 ఎన్నికలలో అవసరాల రీత్యా పైన పేర్కొన్నటువంటివారిని అప్పటి మంత్రివర్గంలోకి జగన్ తీసుకుంటారని వ్యాఖ్యానిస్తున్నాయి. నిజానికి, మంత్రివర్గం ఏర్పర్చే సమయంలోనే తమకున్న పదవీకాలమెంతో చెప్పి పదవి అనేది గతంలోవలే వ్యక్తిగత అనుభవానికి కాదు, ప్రజలకు సేవ చేసి వారికి చేరువయ్యేందుకు మాత్రమేనని స్పష్టం చేసిన సీఎం వైఎస్ జగన్ తప్ప మరెవరైనా ఉన్నారా? అయినా అంబటి, భూమన, రోజా, ఆర్కే వంటివారి ప్రతిభ గురించి జగన్ కంటే ఈ చానల్స్‌కే ఎక్కువ తెలుసా? ఇలాంటి అసత్య ప్రచారాలతోటే మీడియా శివాజీ వంటి వృద్ధిలోకి రావలసిన సినీనటుడిని భ్రష్టుపట్టించింది. లగడపాటివంటి చంద్రబాబు నిగూఢ మిత్రులను గొప్ప మేధావులని పైకెత్తేసి ఆ క్రమంలో తమ అనుకూల పార్టీవారినే ముంచేశారు. ఇది ఏ స్థాయికి చేరిందంటే, చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రయి, మిగిలిన రాజధాని, పోలవరం, పారిశ్రామిక ప్రగతి కొనసాగించేందుకు తగిన సమర్థులు అని ప్రజలు డిసైడ్ అయిపోయారని చెప్పించే చెప్పి బాబునే మునగచెట్టు ఎక్కించేశారు. చివరకు ఆ మునగ కొమ్మ విరిగిపడిన ఫలితంగా ఆ పార్టీ కూసాలే కదిలిపోయాయి. అంతకుమించి చంద్రబాబు ఇంతవరకు జనాలకు ముఖం చూపించలేకపోతున్నారు.

కమ్యూనిస్టులు వాస్తవాన్ని దాచేందుకు అంగీకరించని చందాన, సాక్షి పత్రిక తాను వైఎస్సార్ ఆశయసాధనకు కృషి చేస్తానని స్పష్టం చేస్తూ, ఆ దివంగత నేత ఫోటోను తొలిపేజీలోనే ముద్రిస్తూనే, ప్రాముఖ్యమైన ఇతర వార్తలనూ అందిస్తోంది. మిగతా చానళ్లు కూడా అలా స్పష్టం చేస్తే బాగుంటుంది కదా! ఒకప్పుడు ప్రజాశక్తి పత్రికపై సుత్తీకొడవలి గుర్తు ఉండేది. అందువల్ల పత్రిక సర్క్యులేషన్ తగ్గుతోందని తర్వాత ఆ గుర్తును తీసేశారు. కానీ వైఎస్సార్ ఫోటోతో ప్రచురితమయ్యే సాక్షికి ప్రజాదరణ తగ్గిందా? పైగా పెరిగింది కూడా! ఇలాంటి పైపై మార్పులపై పార్టీల, పత్రికల పాఠకుల సంఖ్య, ప్రతిష్ట ఉండదు. ప్రజల మనోభావాలకు దూరంగా, స్వీయమానసిక దృక్పథంతో వ్యవహరిస్తే, ఏ పార్టీ అయినా ఏ సంస్థ అయినా క్రమేపీ ప్రజలకు దూరమై కనుమరుగవుతుంది. మార్క్సిజాన్ని అన్వయించడం అప్పటి భౌతిక వాస్తవికతకు అనువుగా ఉండాలి. మార్క్స్ చెప్పిందీ అదే.

మన రాష్ట్ర పరిస్థితిలో చంద్రబాబు నయవంచక పాలనను ఓడించడం.. అలాగే కేంద్రంలో జాతీయోన్మాద, మతతత్వ పార్టీ రాకుండా నిరోధించే యత్నం చేయడం.. ఇదే మార్క్సిస్టుల దిశగా ఉండాలి. ప్రజానుకూల, సామాజిక న్యాయసాధనా దిశగా పురోగమించే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ప్రజల్లో ఎన్నో ఆశలు, తమ భవిష్యత్తు మెరుగ్గా ఉంటున్న భరోసా ఉంది. కావలసింది మన కమ్యూనిస్టులం ఐక్యమై ఆ భరోసా నిలబడేటట్లు, ఆ పురోగమనం దిశ మార్చుకోకుండా, తిరోగమనం చెందకుండా ప్రజలకు అన్నివేళలా, అండగా నిలబడటం! వర్గ దృష్టితోపాటు సామాజిక న్యాయాన్ని నిలబెట్టాలి. చివరగా మన ఏపీ ప్రజానీకానికి వారు చూపించిన చైతన్యానికి, వైఎస్ జగన్ రూపంలో వారు ప్రస్తుతం సాధించిన అద్భుత విజయానికి కృతజ్ఞతాభివందనలు.


వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు | మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### బురద



"మన దేశపు జీడీపీ పెరుగుదల మధ్యస్థంగా ఉందని, డేటా బోగస్ అని చెప్పిన ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌పై అందరూ ఎందుకు బురదజల్లుతారు. 2013లో ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సగటు మనిషి అనీ, గుజరాత్ మోడల్ బోగస్ అనీ రాశాడు. 2014లో ప్రభుత్వం అతడిని ఆర్థిక సలహాదారుగా నియమించింది. అందువల్ల మీరు తిరిగి ఆయనకు రివార్డు ఇవ్వాలని అనుకుంటున్నారేమో"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

### బాలకార్మికులు



"బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం ముగింపుకొచ్చింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ నాయకత్వంలో మన దేశం వేసిన ముందడుగు గురించి చెప్పాలనుకుంటున్నా. 2017లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కొత్త విధానం ప్రకారం తగినంత ప్రగతి సాధించిన 14 దేశాలలో భారత దేశం కూడా ఒకటి"

– స్మృతి జె ఇరానీ, కేంద్ర మంత్రి


### శాంతి



"జమ్మూ కశ్మీర్‌లోని అనంత్ నాగ్‌లో మన జవాన్‌లపై పాశవికంగా దాడి చేయడం బాధను, షాక్‌ను కలిగించింది. శాంతి ఇప్పుడు చాలా అవసరం. ఈ భయంకరమైన హింసలోంచి శాంతి కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అమరులైన జవాన్ల కుటుంబాలకు మనోబలాన్నివ్వాలని ఆ భగవంతుడిని కోరుతున్నా"

– నగ్మా, హీరోయిన్


### చెత్త ప్రకటనలు



"వన్డే ప్రపంచకప్‌లో భాగంగా భారత్–పాక్ క్రికెట్ జట్ల మధ్య జూన్ 16న జరుగనున్న మ్యాచ్ సందర్భంగా సరిహద్దుకి అటు.. ఇటు.. ఇరు ప్రాంతాల్లో చిరాకు తెప్పించే ప్రకటనలు వస్తున్నాయి. సీరియస్‌గా చెబుతున్నాను. చెత్త పనులతో ఈ మ్యాచ్‌కు మీరు మరింత ప్రచారం కలిగించాల్సిన అవసరం లేదు... ఏమీ చేయక్కర్లేకుండానే తగినంత ప్రచారం మ్యాచ్‌కు లభించింది. ఇంతాచేసి అది కేవలం క్రికెట్ మాత్రమే. అంతకుమించి ఇంకేమైనా ఉందనుకుంటే ఆ క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోడానికి సిద్ధం పడండి. అనవసర విషయాలపై శ్రద్ధ పెట్టకండి"

– సానియా మిర్జా, క్రీడాకారిణి

### విచారణ



"ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా ఎన్నికైన మొట్ట మొదటి మహిళ దార్వేష్ యాదవ్‌ను కోర్టు ఆవరణలో కాల్చి చంపడం దారుణం. కోర్టులలో మహిళలు సురక్షితంగా పనిచేసుకునే అవకాశాలు కల్పించాలి"

– ఇందిరా జైసింగ్, న్యాయవాది

# ఆలోచన మంచిదే.. అమలో..?

దేశంలో మూడేళ్ళ వయసు నుండి పద్దెనిమిదేళ్ల వయసు వరకూ పిల్లలకు విద్యాహక్కు చట్టం వర్తింప జెయ్యాలని నూతన విద్యా విధానం ప్రతిపాదిస్తోంది. కాన్వెంటు స్థాయి నుండి నిర్బంధ ఉచిత విద్య అందజేయడం ఇకనుంచి కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా, విద్య పొందడం చిన్నారుల హక్కుగా ఉండడం మంచి పరిణామమౌతుంది. కాన్వెంటు చదువు అంటే వందశాతం ప్రయివేట్ చదువే. బళ్ళో విద్యార్థి చేరేటప్పటికి కాన్వెంటు విద్యార్థి రైమ్స్ చెప్తుంటే, డైరెక్ట్‌గా చేరిన విద్యార్థి అఆలు దిద్దాల్సిన పరిస్థితి. అక్కడే వీరిలో అసలైన వెనకబాటు మొదలౌతుంది. ఆ పరిస్థితిని తప్పించడానికి తలిదండ్రులు పేదవారైనా వేలకువేలు పోసి కాన్వెంటులో చేర్పించడం తప్పనిసరిగా మారింది. పైగా ఆ కాన్వెంటులో కూడా ముక్కునపట్టి నేర్చుకొనే విద్యనే నిజమైన విద్యగా చలామణి అవుతోంది. వాటిలో కూడా పోటాపోటీలతో పుస్తకాలమీద పుస్తకాలు కొనిపించి చదువంటేనే విద్యార్థి భయపడేలా, స్కూల్ అంటేనే వెనకడుగు వేసేలా పరిస్థితి తయారైంది. పెద్దలకు ఆర్థిక భారం, పిల్లలకు మోత భారంగా తయారైన ఈ విధానాన్ని మార్చడం అత్యవసరం. నూతన విద్యావిధానం ప్రతిపాదిస్తున్నట్టు కాన్వెంటు విద్యని ఫార్మల్ విద్యగా గుర్తిస్తూ సంస్కరించాలి. ప్రాథమిక స్థాయిలోనే విద్య పట్ల అనురక్తికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి బీజం పడాలి. అందుకు తగ్గ అవకాశాల్ని, నిధుల్ని, ఉపాధ్యాయుల్ని ప్రభుత్వం సమకూర్చాలి.

పిల్లలను 24 గంటలపాటు చేపల బండ కేసి తోముతూ వారి మెదళ్లను మొద్దుబార చేసే పద్ధతికి భిన్నంగా వారికి ఆటపాటలు, వ్యాయామం నేర్పిస్తూ, పౌష్టికాహారం అందిస్తూ చదువు నేర్చుకొనేలా పాఠశాలల్ని తీర్చిదిద్దాలి. గత ప్రభుత్వం రేషనలైజేషన్ సాకుతో వేలాది బడుల్ని మూసివేసింది. అలాంటి చర్యలు విద్యావ్యాప్తికి పూర్తిగా భంగకరం. ప్రతీ ఆవాసంలో ప్రాథమిక పాఠశాల ఉండాలి. డ్రాప్ అవుట్ రేట్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు గైకొనాలి. రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్న అమ్మఒడి పథకాలు వంటి ప్రోత్సాహకాలు నేరుగా విద్యార్థుల ఆరోగ్యం, చదువుకే వినియోగపడేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

డీవీజీ శంకర్రావు, పార్వతీపురం

గమనిక : బుధవారం (12-6-2019) నాటి 'సాక్షి'లో 'లక్షమంది బీసీలకు గురుకులాల విద్య' అనే వ్యాసంలోని రెండో పేరాలో విద్యామంత్రి పేరును పీవీ నరసింహారావుగా చదువుకోవాలి.

# కనీస మద్దతు ధర ఒక భ్రమ

సందర్భం



యలమంచిలి శివాజీ

రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెండింతలు చేయాలని నిర్ణయించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి హృదయపూర్వక అభినందనలు. దేశంలోని ఎక్కువ మంది గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వారిలో చాలా మంది వ్యవసాయాధారిత పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామీణుల జీవన ప్రమాణాలను పెంచకుండా మనం నిజమైన అభివృద్ధిని, ప్రగతిని సాధించినట్టు కాదు. ఈ నేపథ్యంలో రైతుల ఆదాయాన్ని రానున్న మూడేళ్లలో రెట్టింపు చేయాలని నిర్ణయించడం ప్రశంసనీయం.

రైతులను ఆదుకోవడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కనీస మద్దతు ధరలను ప్రకటిస్తున్నాయి. మార్కెట్ ధరలు కనీస మద్దతు ధరల కంటే దిగువకు పడిపోయినప్పుడు ఆ పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుంది. అయితే, కనీస మద్దతు ధర అనేది ఒక భ్రమ అని నేను గట్టిగా చెప్పదల్చుకున్నా. మన రైతులు వందలాది పంటలు పండిస్తుండగా కనీస మద్దతు ధరను 23 పంటలకు మాత్రమే అందిస్తున్నారు. ఇది గిట్టుబాటు ధర మాత్రం కాదు. జరిగిన నష్టాన్ని పూరించేది కాదు. పైగా.. వరి, గోధుమలకు తప్ప వేరే వాటికి మద్దతు ధర అందించడానికి ఎటువంటి వ్యవస్థా లేదు. కనీస మద్దతు ధర గురించీ, ప్రభుత్వం ఆ పద్ధతిలో పంటలు సేకరించే విధానం గురించీ చాలా మంది రైతులకు అవగాహన లేదు. ఫలితంగా రైతులు తమ పంటలను ఏజెంట్ల ద్వారా స్థానిక మిల్లర్లకు కనీస మద్దతు ధరకంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ), కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలు వరి, పత్తి పంటలను రైతుల నుంచి నేరుగా సేకరించకుండా, మధ్యవర్తుల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. గతంలో ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ధాన్యం సేకరణ విధానాన్ని పరిశీలించాను. అక్కడ ఖరీఫ్‌లో వరి కోత కోయడం, నూర్పడం యంత్రాలతోనే చేస్తున్నారు. అంతేకాదు, ఆ ధాన్యాన్ని బస్తాలకు కూడా ఎత్తకుండా ట్రాక్టర్లలో ఇసుక తీసుకొచ్చినట్టు తెచ్చి కొనుగోలు కేంద్రాల్లో గుమ్మరిస్తారు. అటువంటి కేంద్రాలు ప్రతి ఐదారు కిలోమీటర్లకు ఒకటి ఉంటుంది. వాటిలో భారత ఆహార సంస్థతోపాటు రాష్ట్ర, ఆహార శాఖ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల కార్పొరేషన్, ఆగ్రో ఇండస్ట్రీస్, రాష్ట్ర వాణిజ్య సంస్థ వంటి విభాగాలన్నీ పోటీపడి ధాన్యం కొనుగోలు చేస్తాయి. దాంతో అక్కడి ప్రైవేట్ మిల్లర్లకు ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి 5 శాతం సరుకు కూడా చిక్కదు. ఖరీఫ్‌లో వరి కోతలయ్యాక మూడు, నాలుగు వారాల్లో రాష్ట్రంలో ఒక్క వడ్ల గింజ కూడా మిగలదు.

ఇక మన రాష్ట్రం విషయానికి వస్తే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కొన్న సరుకు తూకం వేసి బియ్యం మిల్లులకు రవాణా చేయడం, అందుకు అవసరమైన గిడ్డంగులు, నార సంచులు, పురికొసలు వంటివి పోగు చేసుకుని, రవాణా సౌకర్యాలు సిద్ధం చేసుకుని మరపట్టిన బియ్యాన్ని భారత ఆహార సంస్థకు అందించడం అతి పెద్ద రైతాంగ సంక్షేమ కార్యక్రమం. చట్ట ప్రకారం రైతుల నుండి నేరుగా ధాన్యం కొనుగోలు చేయవలసిన బాధ్యత భారత ఆహార సంస్థదే అయినా, దాన్ని ఆ సంస్థే నీరుగారుస్తోంది. మన రాష్ట్రంలో రైతులు ఎవరైనా ధాన్యాన్ని అమ్మాలనుకుంటే కుంటిసాకులతో దానిని తిరస్కరించడమే కాదు, కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలంటేనే రైతాంగం బెదిరిపోయే వాతావరణం నెలకొని ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వ సివిల్ సప్లయిస్ శాఖ వారు కూడా బియ్యం మిల్లులవారి సేవలోనే పునీతమవుతున్నారు. దీంతో మినిమం సపోర్ట్ ప్రైస్ అనేది మిల్లర్ సపోర్ట్ ప్రైస్‌గా మారిపోయింది. దేశంలోని అన్ని పంటలకు వ్యవసాయ ధరల కమిషన్ ఒకే విధమైన కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన ఉత్పత్తి ఖర్చుల డేటాపైనే కమిషన్ ఆధారపడుతుంది.

పంటలను సేకరించే సందర్భంలో కనీస మద్దతు ధరకు, ఉత్పత్తి ధరకు మధ్య నుండే వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించాల్సి ఉంది. వాస్తవమైన ఉత్పత్తి ధరను నిర్ణయించడానికి రాష్ట్రాల స్థాయిలో వ్యవసాయ ధరల కమిషన్‌లను రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి. కనీస మద్దతు ధరలను వాస్తవికంగా నిర్ణయించి అమలు చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం చేరుకుంటుందని ఆశిస్తున్నా.

(బడ్జెట్‌కు ముందు చర్చల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పంపిన ఆహ్వానానికి స్పందిస్తూ రచయిత పంపిన నోట్స్ సారాంశం)

వ్యాసకర్త గౌరవాధ్యక్షుడు, కిసాన్ ఫౌండేషన్ | 98663 76735

# తప్పుదిద్దుకున్న ద్రౌపది

కృష్ణుడికి వెన్నంటే ఎంతో ఇష్టం. అది ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కానీ నచ్చనిది గర్వం. ద్రౌపది అంటే కృష్ణుడికి ఎంతగా కావలసినదో భారతం చదివిన వారికీ భారత కథలు విన్న వారికీ తెలుసు. కౌరవ సభలో దౌపది వస్త్రాపహరణం అప్పుడు కృష్ణుడు తన మాయశక్తితో చీరలిచ్చి ఆమె గౌరవాన్ని కాపాడిన సంగతి తెలిసిందే కదా. ఇలా ఇంకే సందర్భంలోనూ కృష్ణుడు అభిమాన గౌరవాన్ని కాపాడలేదని ద్రౌపదికి మనసులో ఒకింత గర్వంకూడా.

ఇలా ఉండగా, పాండవులు దేశాన్ని విడిచిపెట్టి అడవులు పట్టుకు తిరుగుతున్న సమయమది. ఓరోజు కృష్ణుడు పాండవులు ఉన్న చోటు తెలుసుకుని వారిని కలవడానికి బయలుదేరాడు. కృష్ణుడిని చూడటంతోనే సాదర స్వాగతం పలికిన ద్రౌపది, "కృష్ణా, చాలా దూరం నుంచి నడిచి వస్తున్నట్టున్నావు. కాళ్ళు నొప్పెట్టడం లేదూ.. స్నానం చేయడానికి వేన్నీళ్ళు పెడతాను" అన్నది. ద్రౌపది మాటలకు కృష్ణుడు సరేనన్నాడు.

జ్యోతిర్మయం

పాండవులలో ఒకడైన భీముడు ఓ పెద్ద పాత్రలో నీరు నింపి తీసుకొచ్చి పొయ్యి మీద పెట్టాడు. ద్రౌపది నిప్పు వెలిగించింది. గంటా రెండు గంటలైంది కానీ నీరు వేడెక్కలేదు. మంట సరిపోలేదేమోనని ఎండిపోయిన ఓ భారీ చెట్టునే పెకిలించి పట్టుకొచ్చి ద్రౌపదికి ఇచ్చాడు భీముడు. దానిని పొయ్యిలో పెట్టడంతోనే మంట ఎక్కువైంది. కానీ నీరు వేడెక్కలేదు.

"కృష్ణా, ఇదేంటీ ఆశ్చర్యంగా ఉందే. మంట పెద్దగానే ఉంది. చాలా సేపటి నుంచి పొయ్యి మీదే ఉన్నప్పటికీ నీరు వేడెక్కలేదేంటీ..." అంటూ కారణం ఏమై ఉంటుందీ అని అడిగింది ద్రౌపది అమాయకంగా.

అప్పుడు కృష్ణుడు, "నీటిలో ఓ కప్ప ఉంది. ఆ కప్ప తనను కాపాడమని కోరింది. నువ్వు పెట్టిన మంట ఎక్కువైనట్టు కనిపించిందే తప్ప ఆ మంటకు వేడి లేకుండా చేశాను. లేకుంటే నువ్వు పెట్టిన మంటకు నీటిలోని కప్ప చనిపోదూ....అందుకే నువ్వెంత మంట పెరిగేలా చేసినా పాత్రే కాదు నీరూ వేడెక్కకుండా చేశాను. కప్ప కూడా మనలాగే ఓ జీవి కదా...శరణు వేడిన ఎవరినైనాసరే వారిని ఆదుకోవడం నా బాధ్యత" అన్నాడు కృష్ణుడు.

అప్పటికి గానీ ద్రౌపది కళ్ళు తెరచుకోలేదు. తనను మాత్రమే కృష్ణుడు కరుణించాడనే అహంకారంతో అప్పటిదాకా ఉన్న ద్రౌపది అల్పజీవి అనుకున్న కప్పను సైతం కృష్ణుడు కాపాడాడన్న ఉదంతంతో పరమాత్మకు అందరూ ఒక్కటే అని తెలుసుకుని తనలోని అహాన్ని సరిదిద్దుకుంది.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



**మంచి విషయం**


## మహిళా సారథ్యం



● వి.వనిత

**భా**రతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' ఈ నెల 15 తెల్లవారు జామున 2.51 గంటలకు శ్రీహరికోట నుంచి చంద్రుడిపైకి 'చంద్రయాన్ 2' ఉపగ్రహాన్ని పంపుతోంది. 3.8 టన్నుల బరువైన ఈ ఉపగ్రహం ఈ ఏడాది సెప్టెంబర్ 6 నాటికి చంద్రుడిపై వాలుతుంది. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో అత్యంత సంక్లిష్టమైన సాంకేతికతతో రూపొందిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నేతృత్వం వహించినదెవరో తెలుసా? ఒక మహిళా సైంటిస్ట్. ఇస్రోలో డిజైన్ ఇంజనీరుగా పనిచేస్తున్న వి.వనిత మొదటి నుంచి చివరి వరకు ఈ ప్రాజెక్టుకు డైరెక్టరుగా వ్యవహరించారు. ఆమె పర్యవేక్షణలోనే ఎల్లుండి ఈ ప్రయోగం జరుగనుంది.

## చిన్న మార్పు



● ఎంట్రీ రీచార్జ్

**తా**జ్‌మహల్ లోపలికి వెళ్లి అంతా కలియతిరగాలంటే ఒకరికి ఫీజు 200 రూపాయలు. (విదేశీయులకు 1100 రూపాయలు). ఒక టోకెన్ ఇస్తారు. ఆ టోకెన్‌తో మూడు గంటల సేపు మహల్ లోపల ఉండొచ్చు. పదిహేనేళ్ల లోపు వాళ్లకు ఉచితం. ఇప్పుడొక చిన్న మార్పు చేశారు. టోకెన్ తీసుకున్న వాళ్లు మూడు గంటల వ్యవధి అయిపోయినప్పటికీ, ఇంకా కొంత సేపు లోపలే గడపాలనుకుంటే బయటి ద్వారం వైపు దగ్గర ఉండే కౌంటర్‌కి వెళ్లి టోకెన్‌ని రీచార్జ్ చేయించుకోవాలి. అలాగే, అనధికారిక ప్రవేశాలను నివారించేందుకు ముఖ ద్వారం దగ్గర టర్న్‌స్టెయిల్ గేట్‌లను అమర్చారు. టోకెన్ ఉంటేనే కాని ఆ గేట్‌లు తెరుచుకోవు.

## వెబ్ సిరీస్



● మిషన్ ఓవర్ మార్స్ పోస్టర్

**ఇ**టీవలే జూన్ 7న ఏక్తా కపూర్ బర్త్‌డే అయింది. ఆ సందర్భంగా ఆమె త్వరలో స్ట్రీమ్ అవబోతున్న తమ కొత్త వెబ్ సీరీస్ 'ఎం.ఓ.ఎం. – మిషన్ ఓవర్ మార్స్' పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే ఆ పోస్టర్‌లో చూపించినది ఇస్రో రాకెట్ కాదని నెటిజన్‌లు ఆమె దృష్టికి తేవడంతో ఏక్తా వివరణ ఇచ్చారు. 'ఇస్రో రాకెట్‌లను ఉపయోగించడానికి న్యాయపరమైన అవరోధాలు ఉన్నాయి. అందుకే మంగల్యాణ్ మిషన్‌లో ప్రయోగించిన పి.ఎస్.ఎల్. వి. సి25 కి ప్రతీకాత్మకంగా వేరే రాకెట్‌ను పోస్టర్‌లో డిజైన్ చేసినట్లు ఏక్తా తెలిపారు. మంగల్యాణ్‌కి పని చేసిన నలుగురు మహిళా సైంటిస్టు పాత్రలతో ఈ వెబ్ సిరీస్ తయారైంది.

## పరీక్షా సమయం



● అల్‌మాజ్ దరెసె

**అ**ల్‌మాజ్ దెరెసె అనే 21 ఏళ్ల యువతి ప్రసవం అయిన అరగంటకే డిగ్రీ పరీక్షలు రాయడం విశేషం అయింది. పరీక్షలు జరుగుతుండగా సోమవారం ఆమె స్థానిక ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించింది. ఆ వెంటనే స్వల్ప విరామంతో ఇంగ్లిష్ పరీక్ష, రెండోరోజు ఆమ్‌హారిక్ (ఇథోపియా జాతీయ భాష), మూడో రోజు మేథమేటిక్స్ రాసింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి మిగతా పరీక్షలు రాయబోతోంది. డిగ్రీ కోసం ఇంకో ఏడాది వరకు నిరీక్షించడం తనకు ఇష్టం లేదని, అందుకే పట్టుపట్టి చివరి సంవత్సరం పరీక్షలు రాశానని అల్‌మాజ్ వెల్లడించింది!

**చెట్టు నీడ**

# అందని బిందె



**అ**తనో నిరుపేద. కానీ బోలెడంత సంపాదించాలని, సౌకల సౌకర్యాలతో ఉల్లాసంగా బతకాలన్న ఆశ. అందుకోసం అతను ఓ సాధువును కలిశాడు. ''స్వామీ, నాకు ఒక లంకె బిందె దొరకాలి. అందుకు నన్ను దీవించండి'' అని కోరుకున్నాడు.

''నువ్వు కోరుకున్నట్టే ఓ పెద్ద లంకె బిందె దొరికేలా చేస్తాను. రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా నువ్వు ఇక్కడికి రా'' చెప్పాడు సాధువు.

''అలాగే'' అంటూ మహదానందంగా ఇంటికి చేరుకున్నాడు. మరుసటి రోజు ఉదయం ఓ అయిదు నిముషాలు ముందుగానే అతను సాధువు దగ్గరకు చేరాడు.

''నీ నీడ నీకు కనిపిస్తోందా?'' అడిగాడు సాధువు. ''ఓ.. బాగా కనిపిస్తోంది స్వామీ'' అన్నాడతను. ''ఆ నీడలో శిరస్సు వైపే లంకెబిందె ఉంది. అక్కడ తవ్వడం మొదలుపెట్టు'' అన్నాడు సాధువు.

''ధన్యవాదాలు స్వామీ'' అని నీడ శిరస్సు భాగానికి పరుగులు తీశాడు. ఇప్పుడు అది మరింత దూరంగా పోయింది. నీడ శిరస్సును అందుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ నీడ అంతకంతకు దూరమవుతూనే ఉంది. అతను ఆ భాగాన్ని అందుకోలేకపోతున్నాడు.

ఉదయం పది గంటలైంది. పదిన్నరైంది. పదకొండు అయింది. పదకొండున్నర అయింది. మిట్టమధ్యాహ్నం అయింది.

నీడ ముడుచుకుపోతూ చివరికి అతనిలోనే ఇమిడిపోయింది. నీడ తాలూకూ శిరస్సు భాగాన్ని అందుకోలేకపోతున్నాడు. అతని ప్రయత్నం ఫలించడం లేదు. విషయం బోధపడింది. లంకెబిందె తనలోనే ఉంది. దాన్ని బయట వెతకడం వల్ల లాభం లేదు అని గ్రహించాడు. సాధువుకు నమస్కరించి ఆత్మవిశ్వాసంతో, రేపటి మీద భరోసాతో ఇంటికి దారితీశాడతను.

– యామిజాల జగదీశ్

**జీవితం... తాడు మీద నడక. బంధాలు... వెదురుగడలా ఆ నడకను బ్యాలెన్స్ చేయడానికి ఉపయోగపడాలే తప్ప, కత్తిలా మారి తాడును తెగ్గొట్టేలా ఉండకూడదు. కుటుంబంలో అన్ని గదులకూ స్పేస్ ఉన్నట్టే బంధాల మధ్య కూడా స్పేస్ ఉండాలి. ఒక గదిలో మరో గది దూరితే అసౌకర్యం చికాకు రేపుతుంది. ఆ చికాకును దూరం చేసే కథనమే ఇది.**

# అమ్మా! బంధానికి గదులుండాలి...

**చే**యాల్సినంత సేపు వంట చేశాక ఆడవాళ్లు కిచెన్‌లో నుంచి బయటకు వస్తారు.

కాని ఇంట్లో ఎక్కడ ఉన్నా కాపురంలో సెగ తగులుతూ ఉంటే?

పొయ్యిలో నుంచి పెనం మీదకు, పెనం మీద నుంచి పొయ్యిలోకి జీవితం సాగుతూ ఉంటే?

***

ఆమె విడాకులు తీసుకుంది.

డిప్రెషన్ వచ్చింది.

మళ్లీ పెళ్లి చేసుకుంది.

డిప్రెషన్ వచ్చింది.

కొడుకు ఆమెను ప్రాణంలా చూసుకున్నాడు.

కాని కొడుకు వల్లే ఆమె ప్రాణం పోయేలా ఉంది.

***

'నేనొక దురదృష్టవంతురాలిని డాక్టర్' అందామె సైకియాట్రిస్ట్ దగ్గరకు వచ్చి.

నలభై అయిదేళ్లు ఉంటాయి. చక్కగా హుందాగా ఉన్న స్త్రీ. చూస్తే ఒక సమర్థురాలైన స్త్రీగా కూడా అనిపిస్తుంది. లేత రంగు ఉన్న చీర కొంగును ఎడమ చేత గుప్పిట పట్టి మాట్లాడుతూ ఉంది.

'పదిహేడేళ్లకు నా పెళ్లి చేశారు. అతడు ఆఫీసర్. మరో సంవత్సరానికి నాకు కొడుకు పుట్టాడు. జీవితానికి ఇంకేం కావాలి అనుకున్నాను. కాని అతనికి వ్యసనం ఉంది. తాగుడు వ్యసనం ఉంటే డబ్బు ఖర్చు అవుతుంది. కాని అనుమానపు వ్యసనం ఉంటే ఇంట్లో అందరి మనశ్శాంతి కరువవుతుంది. కిచెన్‌లో వంట చేస్తున్నా, బాత్‌రూమ్‌లో రెండు నిమిషాలు ఎక్కువ సేపు ఉన్నా, టెర్రస్ మీదకెళ్లి బట్టలు ఆరేస్తున్నా, ఫోన్ మాట్లాడినా అనుమానం. ఆడవాళ్లు మగవాళ్లను తిరిగి కొట్టకూడదనే నియమం ఒకటి సమాజంలో ఉంది అన్న ధైర్యంతో మగవాళ్లు ఆడవాళ్లను కొడుతుంటారు. అతడు నన్ను కొట్టేవాడు. తిట్టేవాడు. ఇంత డబ్బు పోసి కొనుక్కుంది ఇందుకా అనిపించింది. నా కొడుక్కి ఎనిమిదేళ్లు వచ్చే వరకు ఈ నరకం అనుభవించాను. వాడికి ఊహ తెలిశాక వాడు మాట్లాడిన మొదటి మాట– నాన్న మనకు వద్దమ్మా అని. వాడు నాకు ధైర్యం ఇచ్చాడు. వాడే నాకు వెలుతురు ఇచ్చాడు. వెంటనే ఆ కాపురం నుంచి బయటకు వచ్చాను. విడాకులు తీసుకున్నాను'...

సైకియాట్రిస్ట్ నోట్ చేసుకుంటూ ఉన్నాడు.

'నేను చదువుకున్నాను. మా పుట్టింటి నుంచి ఆర్థికంగా సపోర్ట్ ఉంది. ఉద్యోగం చేయగలను. చేశాను. కొడుకును చూసుకున్నాను. నిజానికి వాడే నన్ను చూసుకున్నాడు. నాకు వాడు వాడికి నేను ఇలా జీవితం గడిచింది. మాకు మూడో మనిషి తెలియదు. మేమే ఒక లోకంగా ఉన్నాం. వాడికి ఎప్పుడు ఆకలేస్తుందో ఎప్పుడు నిద్ర పడుతుందో ఎప్పుడు సినిమాకెళ్లబుద్ధవుతుందో ఏ సబ్జెక్ట్ ఇష్టమో ఏ రంగు బట్టలు కోరుతాడో అన్నీ నాకు తెలుసు. నా మూడ్ ఎప్పుడు మారుతుందో, ఎప్పుడు నవ్వుతానో, ఎప్పుడు డల్ అవుతానో, ఎప్పుడు వాడు నా ఎదురుగా కూచుని కబుర్లు చెప్పాలో అన్నీ వాడికి తెలుసు. ఒక్కమాట చెప్పాలంటే వాణ్ణి ఒక సర్కస్ బంతిని చేసుకొని అందులో నేను మోటార్ సైకిల్ ఎక్కి గిర్రున రౌండ్లు కొట్టేదాన్నిలా తయారయ్యాను. అంతా బాగుంది. సంతోషంగా ఉంది. అయితే వాడికి ఇప్పుడు 18 ఏళ్లు వచ్చాయి. వాడు లక్షన్నర పెట్టి బైక్ కొన్నాడు. మొన్నటి దాకా తప్పకుండా మణికట్టు మీద కట్టుకుంటూ ఉండిన వాచ్‌ను పక్కన పడేశాడు. వాడికిప్పుడు టైమే తెలియదు. ఇల్లు తెలియదు. అమ్మ తెలియదు. ఫ్రెండ్స్ లోకం. వాడికి రెక్కలొచ్చాయని అర్థమైంది. కాని వాడు ఎగిరిపోతే గూడులో నేనొక్కదాన్నే ఎలా ఉండాలి. అందుకే డిప్రెషన్. మూడు నెలలుగా సరిగ్గా లేను. బాగా చిరాగ్గా ఉంది. వాడే గమనించి మీదగ్గరకు వెళ్లమని పంపాడు' అందామె.

సైకియాట్రిస్ట్ ఒక టాబ్లెట్ రాసి 'ఇది పదిరోజులు వాడి రండి. ముందు కొంచెం మీరు తెప్పరిల్లాక కౌన్సిలింగ్ మొదలెడదాం' అన్నాడు.

ఆమె తల ఊపి వెళ్లిపోయింది. పదిరోజులు గడిచిపోయాయి. ఆమె రాలేదు. సైకియాట్రిస్ట్‌కు తెలుసు– ఆమె తిరిగి రావడం ముఖ్యమని. కాని ఆమె ఆరు నెలల తర్వాత వచ్చింది. అదే డిప్రెషన్‌తో.

***

'ఏమయ్యారు మీరు?' అడిగాడు సైకియాట్రిస్ట్.

'సారీ డాక్టర్. బిజీ వల్ల రాలేకపోయాను. మళ్లీ పెళ్లి చేసుకున్నాను' అందామె.

'అవునా... మంచి ఆలోచనే. కాని అందుకు అవసరమైన ప్రీ కౌన్సెలింగ్ తీసుకుని ఉంటే బాగుండేది' అన్నాడు సైకియాట్రిస్ట్.

'అదే తప్పయ్యింది. ఇంకా డిప్రెషన్‌లోకి వెళ్లాను' అందామె.

ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పింది.

'మీ దగ్గరి నుంచి వెళ్లాక మా అబ్బాయే నా గురించి ఎక్కువ ఆలోచించాడు. అమ్మా... నువ్వు నా విషయంలో ఇన్‌సెక్యూర్ అవుతున్నావు. నేను బీటెక్ చేశాక యు.ఎస్ వెళ్లాలనుకుంటున్నాను. అప్పుడైనా ఇబ్బందే. నువ్వు పెళ్లి చేసుకో. మనిద్దరికీ నచ్చిన వ్యక్తినే వెతుకుదాం. నేను యు.ఎస్ వెళ్లేలోపు ఒకటి రెండేళ్లలో నువ్వు కూడా నీ లైఫ్‌ను ఆర్గనైజ్ చేసుకో వచ్చు అన్నాడు. బంధువులకు ఈ విషయం చెప్తే డైవోర్సీ అయిన ఒకతన్ని చూపించారు. మాకు నచ్చాడు. చేసుకున్నాను. ఎప్పుడైతే పెళ్లి చేసుకున్నానో ఆ క్షణం నుంచి సడన్‌గా నాకు కొత్త భయం వచ్చింది. ఒక్కదాన్నే ఉన్నప్పుడు నా కొడుకు నన్ను కొద్దిగా అయినా పట్టించుకునేవాడు. ఇప్పుడు తన బాధ్యత తీరింది కాబట్టి అసలు పట్టించుకోడా అని వాణ్ణి ఇంకా అంటిపెట్టుకోవడం మొదలుపెట్టాను. ఇది నా భర్తను ఎక్కువ ఇరిటేట్ చేసింది. ఇటు భర్త తన వైపు లాక్కోవాలనుకోవడం, అటు కొడుకు మెల్లగా వదలించుకునే ధోరణిలోకి దిగడంతో సతమతమవుతూ వేదన అనుభవిస్తున్నాను. అసలు ఇంట్లో మా ముగ్గురికీ కూడా టెన్షన్ పెరిగిపోతుంది. ముగ్గురం ట్రాక్ తప్పాం. మాకు గైడెన్స్ కావాలి' అందామె.

ఆడవాళ్ల జీవితం ఎన్ని భౌతిక మానసిక బంధనాల్లో కూరుకుపోయిందో ఆమెను చూస్తే అర్థమైంది సైకియాట్రిస్ట్‌కు. ఆ మరుసటి రోజు ఆమెను, ఆమె భర్తను, కొడుకును ఒకేసారి కూచోబెట్టాడు.

'చూడండి... మీ ముగ్గురు మీపాత్రలను పోషించాల్సిన సమయాన్ని దాటి పాత్రలుగా మారిపోయారు. అంటే డైరెక్టర్ పేకప్ చెప్పాక కూడా నటులు అవే పాత్రల్లో ఉండిపోతే ఎంత నరకంగా ఉంటుందో అంత నరకాన్ని తెచ్చుకున్నారు. మీ ముగ్గురూ మొదట వ్యక్తులు. సొంత జీవితం, ఆలోచనలు, మీ ఇష్టాలు అయిష్టాలు, అభిరుచులు, కెరీర్, సంపాదన, సౌఖ్యం... ఇవన్నీ పట్టించుకోవాల్సిన వ్యక్తులు. ఈ ప్రాధాన్యం తర్వాత మీకు కొన్ని పాత్రలు ఉన్నాయి. ఈమెకు తల్లి పాత్ర ఉంది. భార్య పాత్ర ఉంది. ఈ రెండు పాత్రలనూ ఇరవైనాలుగ్గంటలూ పోషించకూడదు. ఈమె అయితే భార్య పాత్రను కూడా వదిలిపెట్టి తల్లిపాత్రనే పట్టుకుని పెనుగులాడటంతో కష్టం వస్తోంది. ఇక భర్తగా వచ్చిన మీరు మీ భార్యను తల్లి నుంచి భార్యగా మార్చుకోవడం కోసం తొందరపడి ఆమెను టెన్షన్ పెడుతున్నారు. మీ ఇంటిపెద్ద పాత్రను వదిలి కేవలం భర్త పాత్రనే పోషిస్తున్నారు. కొడుకైన ఈ అబ్బాయి స్టూడెంట్ పాత్రలో పూర్తిగా ట్రాన్స్‌ఫర్ అయ్యి కొడుగ్గా, ఇంటి సభ్యుడిగా ఉండే పాత్రలను లైట్‌గా తీసుకుంటున్నాడు. ముందు మీరు మీ వ్యక్తిగత జీవితాన్ని నిర్ధారణ చేసుకోండి. కుటుంబ జీవితాన్ని నిర్ధారణ చేసుకోండి. ఒకరితో మరొకరితో ఉండాల్సిన బంధాన్ని ఇవ్వాల్సిన స్పేస్‌ను డిఫైన్ చేసుకోండి. డ్రాయింగ్ రూమ్‌లో సోఫాసెట్ కూడా ఒన్ ప్లస్ ఒన్ ప్లస్ త్రీ సీటర్‌గా డివైడ్ అయి ఉంటుంది. అంతే తప్ప ఫైవ్ సీటర్‌గా ఉండదు. ఆ విభజన అర్థం చేసుకుంటే మీ ముగ్గురు అభద్రతను, గందరగోళాన్ని వదిలి వాస్తవికంగా జీవించడం మొదలు పెడతారు' అన్నాడతను.


ఆ ముగ్గురూ కొంచెం అర్థమైనట్టే వెళ్లారు.

ఆ తర్వాత భర్త ఇంటి టైమ్ ఆఫీస్ టైమ్, భార్య ఇల్లాలి టైమ్, తల్లి టైమ్, అబ్బాయి స్టూడెంట్ టైమ్, కొడుకు టైమ్ అంటే ఏమిటో బోధ పరుచుకున్నారు.

కాపురం సెట్ అయ్యింది. రేపో మాపో ఆమె సంతోషంగా అబ్బాయిని అమెరికా పంపనుంది. ఆ మర్నాడే భర్తతో పదిరోజుల పాటు హాలిడే ట్రిప్‌ను కూడా ప్లాన్ చేసుకుంటోంది.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి,** సైకియాట్రిస్ట్



**ముందు మీరు మీ వ్యక్తిగత జీవితాన్ని నిర్ధారణ చేసుకోండి. కుటుంబ జీవితాన్ని నిర్ధారణ చేసుకోండి. ఒకరితో మరొకరితో ఉండాల్సిన బంధాన్ని, ఇవ్వాల్సిన స్పేస్‌ను డిఫైన్ చేసుకోండి. డ్రాయింగ్ రూమ్‌లో సోఫాసెట్ కూడా ఒన్ ప్లస్ ఒన్ ప్లస్ త్రీ సీటర్‌గా డివైడ్ అయి ఉంటుంది. అంతే తప్ప ఫైవ్ సీటర్‌గా ఉండదు. ఆ విభజన అర్థం చేసుకుంటే మీ ముగ్గురు అభద్రతను, గందరగోళాన్ని వదిలి వాస్తవికంగా జీవించడం మొదలు పెడతారు' పట్టుకుని పెనుగులాడటంతో కష్టం వస్తోంది. ఇక భర్తగా వచ్చిన మీరు మీ భార్యను తల్లి నుంచి భార్యగా మార్చుకోవడం కోసం తొందరపడి ఆమెను టెన్షన్ పెడుతున్నారు. మీ ఇంటిపెద్ద పాత్రను వదిలి కేవలం భర్త పాత్రనే పోషిస్తున్నారు. కొడుకైన ఈ అబ్బాయి స్టూడెంట్ పాత్రలో పూర్తిగా ట్రాన్స్‌ఫర్ అయ్యి కొడుగ్గా, ఇంటి సభ్యుడిగా ఉండే పాత్రలను లైట్‌గా తీసుకుంటున్నాడు.**

**సర్కారం**

# తడబడింది.. నిలబడింది...

**ఒ**కప్పుడు వందలాది మంది పిల్లలతో వెలిగిన బడులు మూతబడ్డాయి. పిల్లలు రాకుంటే బడి ఎలా నడుస్తుంది. అందుకే బడి మూతపడింది.. ఇందులో వింతేముంది.. ఎన్నో సర్కారు స్కూళ్లు మూతపడ్డాయి. కానీ ఇక్కడ మూతపడింది సర్కారు స్కూళ్లు కాదు.. ప్రైవేటు స్కూళ్లు.. ఒక్కటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 ప్రైవేటుబళ్లు మూతపడ్డాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా చేయి చేయి కలిపి సర్కారు బడిని బతికించుకున్నారు. ఇది కొన ఊపిరితో ఉన్న ఎన్నో సర్కారు స్కూళ్లకు ఆదర్శమైంది.. ఒక్కరు చూపిన చొరవ వందలాది మంది తల్లిదండ్రులకు ప్రైవేటు భారాన్ని తప్పించిన విజయమిదీ..

### బీజం పడింది ఇక్కడే...


ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిరలో ఏడో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఉంది. ఒకప్పుడు ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించిన ఆ బడి ఒక దశలో మూతపడే స్థాయికి చేరింది. కారణం అక్కడ ఓ ప్రైవేటు స్కూల్ ఏర్పాటు కావడం. అందులో కేరళకు చెందిన ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు ఇంగ్లిష్ మీడియం పై ఆసక్తితో తమ పిల్లలను ఆ బడికి పంపించడం ప్రారంభించారు. ఒకరిని చూసి ఒకరు ఇలా ప్రైవేటు బడిలో సంఖ్య పెరుగుతోంది. సర్కారు బడిలో తగ్గుతోంది. ఆ బడిలో చదువుకున్న స్థానికులను ఇది కలచి వేసింది. ఈ విషయాన్ని మండల విద్యాధికారిగా ఉన్న మంకు రాజయ్యకు చెప్పారు. సర్కారు బడిలో ఇంగ్లిష్ మీడియం బోధన చేయలేరా..? అని పదిర గ్రామస్తులు ప్రశ్నించారు. ఎందుకు చేయలేం.. తప్పకుండా చేద్దామని నిర్ణయించుకుని తొలి అడుగు వేశారు. అంతే! ప్రభుత్వ స్కూల్‌లో ఆంగ్ల బోధనకు శ్రీకారం చుట్టారు. దాంతో అక్కడి ప్రైవేటు స్కూల్ మూతపడింది. సర్కారు బడి బతికింది.. అదే స్ఫూర్తితో దుమాల గ్రామంలోనూ సర్కారు బడిలో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. అక్కడా ప్రైవేటు స్కూల్ మూతపడింది. ఇలా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని 17 ప్రైవేటు స్కూళ్లు సర్కారు ఒక్కొక్కటిగా చేతులెత్తేశాయి.

### 'మా బడికి రండి' అంటూ...

'మా బడికి రండి' అంటూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కరపత్రాలను ముద్రించారు. సర్కారు బడిలో ఆంగ్ల మాధ్యమంతో పాటు.. తాము అందించే విద్యాబోధన విధానాలను వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. పిల్లల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి.. వాళ్లకు అర్థమయ్యే రీతిలో చెప్పారు. ఒకటికి రెండుసార్లు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటికి రావడంతో తల్లిదండ్రుల్లోనూ మార్పు వచ్చింది. ప్రైవేటు బడికి పంపకుండా సర్కారు బడికి పంపించడం మొదలు పెట్టారు. ఒకరిని చూసి మరొకరు సర్కారు బడిపై నమ్మకాన్ని పెంచుకున్నారు. ఇలా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని 32 స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేశారు. ఆ స్కూళ్లలో 979 మంది విద్యార్థులు ఉండగా.. ఆంగ్ల మాధ్యమానికి సర్కారు బడిలో శ్రీకారం చుట్టగానే 3905 మందికి చేరింది. పదిరతో మొదలైన మార్పు అటవీ గ్రామాల్లోకి పల్లెలకు సోకింది. సర్కారు బడిలో నాణ్యమైన చదువు దరి చేరడంతో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు బడికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. పిల్లలకు అవసరమైన బూట్లు, బ్యాడ్జీలు, టైలు, కొన్ని గ్రామాల్లో స్కూల్ బస్సులను సైతం సమకూర్చుకుని కార్పోరేట్ స్కూళ్లను మరిపించే విధంగా విద్యాబోధన చేస్తున్నారు. గత ఏడేళ్లలో దాతల సాయంతో రూ.కోటి వరకు విరాళాలు సమకూర్చుకుని సర్కారు స్కూళ్లకు జవసత్వాలు కల్పిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని సర్కారు విద్యాసంస్థల్లో 6753 మంది చదువుతున్నారు. ఇందులో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని 12 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, మరో 32 మంది ప్రజాప్రతినిధులు తమ పిల్లలను స్థానికంగా ఉండే సర్కారు స్కూళ్లలోనే చదివించడం మరో విశేషం. ఇలా మార్పునకు టీచర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు బాటలు వేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కె. తారక రామారావు సైతం ప్రజాప్రతినిధుల, ఉపాధ్యాయుల ఉత్సాహాన్ని చూసి స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్(సీఎస్ఆర్) కింద వివిధ కంపెనీల ద్వారా సర్కారు స్కూళ్లకు ఆధునిక హంగులు కల్పించారు.



కార్పోరేట్ స్కూల్‌ను తలపిస్తున్న ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల





### బాధ్యతలను గుర్తించిన గురువులు...

బడి వేళ దాటితే చాలు.. ఇంటిదారి పట్టే ఉపాధ్యాయులు ఉన్న ఈ రోజుల్లో ఇక్కడి ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారు. వారి పట్టుదల, కృషి ఫలితంగానే సర్కారు బడి నిలబడింది. నూతన విధానానికి శ్రీకారం చుట్టక ముందు ఇక్కడి సర్కారు స్కూళ్లలో 158 మంది ఉపాధ్యాయులు ఉండగా.. పిల్లల సంఖ్య పెరిగి ఇప్పుడు 201కి చేరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్యార్థులు లేక స్కూళ్లు మూత పడి 750 ఉపాధ్యాయ స్థానాలు రద్దయ్యాయి. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో అందుకు భిన్నంగా పిల్లల సంఖ్యతో పాటు టీచర్ల సంఖ్య పెరగడం విశేషం.

### కోటికొక్కరు.. రాజయ్య సారు...

సర్కారు బడిని బతికించడంలో ఓ అధికారి కీలకపాత్రను పోషించారు. ఆయనే ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి మంకు రాజయ్య. ఆయన పట్టుదల, అంకితభావం, నిబద్ధతతో చేసిన కృషి ఫలితంగా మార్పు సాధ్యమైంది. కోనరావుపేట మండలం ధర్మారం సర్కారు బడిలో చదువుకుని ఎంఈవోగా ఉద్యోగం సాధించిన ఆయన కళ్లముందే సర్కారు స్కూళ్లు మరణశయ్యపై ఉండడం చూసి తట్టుకోలేక పోయారు. సమస్య మూలాలను గుర్తించారు. ఈ పరిస్థితిని మార్చాలనుకున్నారు. గ్రామస్థులతో సమావేశాలు, ఉపాధ్యాయులతో సమీక్షలు, ఇంటింటా ప్రచారం 'మన బడి.. మనందరి బాధ్యత' అని కదిలించారు. అద్భుతమైన ఫలితాలను సాధించారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని స్కూళ్లలో విశేషమైన మార్పునకు బాటలు వేశారు. ఇదే స్ఫూర్తితో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మరో 25 స్కూళ్లలోనూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు.

### అందరి సహకారంతో సాధించాం...



అందరి సహకారంతో సర్కారు బడిని సగౌరవంగా నిలబెట్టాం. తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని బోధించాలని నిర్ణయించి సక్సెస్ అయ్యాం. ఇందుకోసం అనేక ఇబ్బందులు పడ్డాం. కానీ అంతిమంగా విజయం సాధించడం సంతోషంగా ఉంది. లోపాలు వెతికే కంటే లోపాలను సవరించడంపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయి. సామాజిక భాగస్వామ్యంతో బడులు బలోపేతం అయ్యాయి.

**- మంకు రాజయ్య, ఎంఈవో,** ఎల్లారెడ్డిపేట.

### జాతీయ స్థాయిలో గుర్తింపు...


రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో వచ్చిన మార్పు జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చింది. ఎల్లారెడ్డిపేట ఎంఈవో మంకు రాజయ్య ప్రతిష్ఠాత్మకమైన అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్రమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని, కేంద్ర మంత్రి స్మృతి ఇరాని చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సర్కారు బడిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను వివరిస్తూ.. ప్రైవేటు బడి కంటే సర్కారు స్కూల్ ఎంతో మేలు అనే సందేశాన్ని ఇచ్చే 'ఇది మా సర్కారు బడి' అనే షార్ట్ ఫిల్మ్‌ను నిర్మించి పల్లెల్లో ప్రదర్శిస్తున్నారు.

**– వూరడి మల్లికార్జున్,**
'సాక్షి' రాజన్న సిరిసిల్ల.

– ఫొటోలు: **నిమ్మ బాల్‌చందర్‌రెడ్డి,**
ఎల్లారెడ్డిపేట.

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ గురువారం
13-6-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్. నేను ఒక అమ్మాయిని ప్రాణంగా ప్రేమించాను. ప్రపోజ్ కూడా చేశాను. కాని ఆ అమ్మాయి నన్ను పట్టించుకోలేదు. ఆ అమ్మాయిని మరచిపోవడం ఎలా సార్..? సలహా ఇవ్వండి ప్లీజ్.

– వెంకటేష్

ఆ అమ్మాయి పేరు మీద లక్షకోటి రాయి బ్రో.

'అవును సార్..! దెబ్బకు పిచ్చ కోపం వచ్చి.. ఆ పేరంటేనే వికారం అనిపించి.. ఫుల్‌గా ఫర్గెట్ అవుతాడు సార్. చిన్న కృశ్చన్‌కి చిన్న ఆన్సర్.. స్వీట్ అండ్ షార్ట్ సార్...' అని నవ్వింది నీలూ.

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?




కట్‌చేయ్...దాచేయ్...

**పల్లవి:**
శ్రుతి నీవు గతి నీవు ఈ నా కృతి నీవు భారతి (2)
ఈ నా కృతి నీవు భారతి (2)
శ్రుతి నీవు గతి నీవు
ఈ నా కృతి నీవు భారతి
ధ్రుతి నీవు ద్యుతి
నీవు శరణాగతి నీవు భారతి (2)
శరణాగతి నీవు భారతి

**చరణం:1**
నీ పదములొత్తిన పదము
ఈ పదము
నిత్యకైవల్య పథము
నీ కొలువు కోరిన తనువు ఈ తనువు
నిగమార్థ నిధులున్న నెలవు
కోరినా మిగిలిన కోరికేమి
నిను కొనియాడు కృతుల పెన్నిధి తప్ప
చేరినా యిక చేరువున్నదేమి
నీ శ్రీచరణ దివ్యసన్నిధి తప్ప
శ్రుతి నీవు గతి నీవు
ఈ నా కృతి నీవు భారతి
ధ్రుతి నీవు ద్యుతి నీవు శరణాగతి నీవు భారతి

**చరణం:2**
శ్రీనాథ కవినాథ శృంగార కవితా తరంగాలు నీ స్ఫూర్తులే
అల అన్నమాచార్య కలవాణి
అలరించు కీర్తనలు నీ కీర్తులే
॥శ్రీనాథ॥
త్యాగయ్య గళసీమ రాజిల్లిన అనంత
రాగాలు నీమూర్తులే
నీ కరుణ నెలకొన్న ప్రతి రచన జననీ
భవతారక మంత్రాక్షరం
శ్రుతి నీవు గతి నీవు
ఈ నా కృతి నీవు భారతి
ధ్రుతి నీవు ద్యుతి నీవు శరణాగతి నీవు
భారతి శ్రుతి నీవు గతి నీవు
ఈ నా కృతి నీవు భారతి

**చిత్రం: స్వాతికిరణం (1991)**
**రచన: డా॥ సి.నారాయణరెడ్డి**
**సంగీతం: కె.వి.మహదేవన్**
**గానం: వాణీజయరాం**



● గోపీచంద్

## చాణక్య అన్వేషణ

చుట్టూ జనం...వారి మధ్యలో తీక్షణమైన చూపులతో దేన్నో వెతుకుతున్నాడు చాణక్య. ఆ వెతుకులాట ఎందుకు? ఎవరి కోసం అంటే ప్రస్తుతానికి సస్పెన్స్. గోపీచంద్ హీరోగా తిరు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'చాణక్య'. బుధవారం గోపీచంద్ పుట్టినరోజు సందర్భంగా 'చాణక్య' సినిమాలోని లుక్‌ను విడుదల చేశారు. ఇక్కడ ఉన్న ఫొటో ఇదే. ఈ చిత్రంలో మెహరీన్, జరీనాఖాన్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ సహ నిర్మాతలు. యాభై శాతం పూర్తయిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని తెలిసింది. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా కాకుండా బిన్ను సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా తెరక్కనున్న సంగతి తెలిసిందే.

## నాయకుడు పనిచేయకపోతే!

ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ముఖ్యమైనది. అటువంటి ఓటు విలువను తెలియజేసేలా రూపొందిన చిత్రం 'ఓటర్'. విష్ణు, సురభి హీరోహీరోయిన్లుగా నటించారు. రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మించిన ఈ సినిమాకు కార్తీక్ దర్శకత్వం వహించారు. సార్థక్ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేయనుంది. ''పదవిలో ఉన్న నాయకుడు సరిగా పని చేయకపోతే అతనితో ఎలా పనులు చేయించుకోవాలో తెలిపే చిత్రం ఇది. ఓటు హక్కు, ఓటర్ విలువను తెలియజేస్తూనే, ఈ చిత్రాన్ని పొలిటికల్ డ్రామాగా కార్తీక్ బాగా తెరకెక్కించాడు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించిన సార్థక్ మూవీ సంస్థ మా సినిమాను విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు నిర్మాత. ఈ చిత్రానికి ఎస్ఎస్. తమన్ స్వరకర్త. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ తనమాల.


● విష్ణు


● కల్యాణ్‌రామ్

## కల్యాణ్ రామ్‌తో ఆదిత్య తొలి అడుగు

ఆదిత్య మ్యూజిక్.. ఈ పేరు తెలియని సంగీత ప్రియులు ఉండరు. మూడు దశాబ్దాలుగా సంగీత రంగంలో తనదైన ముద్రవేసిన ఆదిత్య మ్యూజిక్ నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టింది. నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా తెలుగులో తొలి సినిమా నిర్మించనుంది. 'శతమానం భవతి' ఫేమ్ వేగేశ్న సతీష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. కల్యాణ్‌రామ్‌కి జోడీగా మెహరీన్ నటించనున్నారు. 'జెంటిల్‌మన్, సమ్మోహనం' వంటి హిట్‌చిత్రాలు తీసిన శ్రీదేవి మూవీస్ శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రానికి సమర్పకులుగా ఉన్నారు. 'గీత గోవిందం, మజిలీ' వంటి మ్యూజికల్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న గోపీసుందర్ ఈ సినిమాకి స్వరకర్త. ''అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా వేగేశ్న సతీష్ కథను సిద్ధం చేసుకున్నారు' అని చిత్రనిర్మాత ఉమేష్ గుప్తా తెలిపారు.


● వెంకీ, రాధాకృష్ణ, పీడీవీ ప్రసాద్, నాగవంశీ, నితిన్, రష్మికా మండన్నా

## రొమాంటిక్ భీష్మ

నితిన్, రష్మికా మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'భీష్మ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వెంకీ కుడుముల మాట్లాడుతూ– ''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. సరదా సంఘటనలతో సాగుతుంది. ఈ ప్రాజెక్ట్‌పై చాలా ఆనందంగా ఉన్నాను. ఎందుకంటే స్క్రిప్ట్ బాగా వచ్చినందుకు టీమ్ అంతా వెరీ హ్యాపీ. ప్రతి అబ్బాయి నితిన్‌గారి క్యారెక్టర్‌కి, ప్రతి యువతి రష్మిక పాత్రకి కనెక్ట్ అయ్యేలా స్క్రిప్ట్ రూపొందించాం'' అన్నారు. ''ఈ నెల 20న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. నరేష్, సంపత్, రఘుబాబు, బ్రహ్మాజీ, నర్రా శ్రీనివాస్, కల్యాణి నటరాజన్, రాజశ్రీ నాయర్ తదితరులు నటించనున్న ఈ సినిమాకి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకట రత్నం (వెంకట్), సమర్పణ: పీడీవీ ప్రసాద్.


● తమన్నా

## ఆమె బయోపిక్‌లో నటించాలని ఉంది

నటిగా తమన్నాకు రెండే రెండు కోరికలు ఉన్నాయట. అయితే ఇవి బాలీవుడ్‌కి సంబంధించినవి. ఒకటి ప్రముఖ నటి శ్రీదేవి జీవిత చరిత్రలో నటించాలన్న కోరిక. మరొకటి హిందీలో పూర్తి స్థాయి డ్యాన్స్ బేస్డ్ మూవీలో నటించాలని కోరిక. ఇవి ఎప్పుడు తీరుతాయో చూడాలి. ఆ సంగతలా ఉంచితే.. శ్రీదేవి జీవిత చరిత్రలో తమన్నా ఎందుకు నటించాలనుకుంటున్నారంటే.. చిన్నప్పటి నుంచి ఆమె సినిమాలనూ చూస్తూ పెరిగానని, ఆమె అందం, నటన అద్భుతం అనీ తమన్నా అంటున్నారు. శ్రీదేవి పాత్రలో నటించే అవకాశం వస్తే అంతకన్నా అదృష్టం మరొటి లేదని కూడా పేర్కొన్నారు తమన్నా. అయితే గతంలో శ్రీదేవి నటించిన 'హిమ్మత్‌వాలా' రీమేక్‌లో తమన్నా నటించారు. ఆ సినిమా అపజయం పాలైంది. అది వేరే విషయం. చిన్నప్పటి నుంచి ఆరాధించిన మనిషి తిరిగి రాని లోకాలకు వెళ్లడం చాలా బాధాకరం అని కూడా తెలిపారు. ఇవన్నీ ఓ ఇంటర్వ్యూలో చెప్పారామె. అదే ఇంటర్వ్యూలో ప్రభాస్ గురించిన ప్రస్తావన వచ్చింది. ఈ యంగ్ రెబల్ స్టార్ సరసన తమన్నా 'రెబల్', 'బాహుబలి' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. ఆ ఇంటర్వ్యూలో ప్రభాస్ చాలా సాఫ్ట్ అని, దయాగుణం ఉన్నవాడని తమన్నా చెప్పారు. అది మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా ఎంతో మంది అమ్మాయిలు ప్రభాస్‌ని పెళ్లాడాలనుకుంటున్నారని ఈ మిల్కీబ్యూటీ చెప్పడం విశేషం.

## క్లాప్‌కి ఇళయరాజా క్లాప్


● ఇళయరాజా, ఆది పినిశెట్టి, ఆకాంక్షా సింగ్, క్రిషా కురుప్

విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆది పినిశెట్టి హీరోగా రూపొందనున్న చిత్రం 'క్లాప్'. ఆకాంక్షా సింగ్ కథానాయికగా నటిస్తున్నారు. పృథ్వి ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. రామాంజనేయులు జవ్వాజి సమర్పణలో పృథ్వి బిగ్ ప్రింట్ పిక్చర్స్ అండ్ సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్లపై ఐబి కార్తికేయన్, యం. రాజశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ్ భాషల్లో తెరకెక్కనున్న 'క్లాప్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా క్లాప్ ఇచ్చారు. నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తమిళ వెర్షన్‌కు హీరో నాని క్లాప్ ఇచ్చారు. దర్శకులు బోయపాటి శ్రీను, గోపీచంద్ మలినేని, 'బొమ్మరిల్లు' భాస్కర్ తదితరులు 'క్లాప్' బౌండెడ్ స్క్రిప్ట్‌ని చిత్రబృందానికి అందించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ– ''పృథ్వి ఆదిత్య కథ చెప్పగానే ఇంప్రెస్ అయ్యి వెంటనే ఓకే చెప్పాను. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో ఇప్పటివరకూ వచ్చిన సినిమాలకంటే మా సినిమా చాలా వైవిధ్యంగా ఉంటుంది. రెండు షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తున్నాను'' అన్నారు. ''ఈ కథపై ఏడాది వర్క్ చేశాను. అథ్లెటిక్ స్పోర్ట్స్ నేపథ్యంలో చిత్రకథ సాగుతుంది'' అన్నారు పృథ్వి ఆదిత్య. ''మిత్రుడు రాజశేఖర్ ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పాడు.. కథ విని ఇంప్రెస్ అయి ఈ చిత్రంలో భాగమయ్యాను. ఇళయ రాజాగారి మ్యూజిక్ ఈ చిత్రానికి బిగ్ ఎస్సెట్ కానుంది. ఈ నెల 17నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, మధురైలలో షూటింగ్ జరుపుతాం. నాలుగు షెడ్యూల్స్‌లో ఈ చిత్రాన్ని పూర్తి చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కెమెరా: ప్రవీణ్ కుమార్, సహ నిర్మాతలు: పై.ప్రభ ప్రేమ్, జి.మనోజ్, జి.శ్రీహర్ష.


● నరేంద్ర, అరుణ్ పవార్, సప్తగిరి, జీవీఎన్ రెడ్డి

## అదిరిపోయిందిరా బాబు అంటారు

**– అరుణ్ పవార్**

సప్తగిరి హీరోగా అరుణ్ పవార్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'వజ్ర కవచధర గోవింద'. ఇందులో వైభవీ జోషి కథానాయికగా నటించారు. నరేంద్ర యడ్ల, జీవీఎన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ– ''సినిమా పట్ల బాగా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సినిమాపై చాలా పాజిటివ్ వైబ్ ఉంది. దాదాపు 300 థియేటర్స్‌లో సినిమాను విడుదల చేస్తున్నాం. సినిమా పరిశ్రమలో ప్రొడ్యూసర్స్ దైవ స్థానంలో ఉంటారని అంటారు. ఆ స్థానంలో ఉండి మాకు సహకరించిన నిర్మాతలకు ధన్యవాదాలు. హీరోయిన్‌గా వైభవి జోషి బాగా నటించారు. ఆమెకు మరిన్ని అవకాశాలు రావాలి. అలాగే మా సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చిన శ్రీకాంత్ అన్నకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమాలో కామెడీతోపాటు మంచి ఎమోషన్ అంతకు మించిన బలమైన కథ ఉంది. మంచి క్లైమాక్స్ కుదిరింది. నిర్మాతలు సపోర్ట్ చేశారు. వారికి రెండు రోజుల్లోనే డబ్బులు వస్తాయి. సినిమా చూసిన వారు అదిరిపోయిందిరా బాబు అని అంటారు'' అన్నారు అరుణ్ పవార్. ''కష్టపడి సినిమా చేశాం. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు జీవీఎన్ రెడ్డి. హీరోయిన్ వైభవి జోషి, నిర్మాత నరేంద్ర, నటులు మంజు, రాజేంద్రన్, రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## 1979లో ఏం జరిగింది?

కర్నాటకలో 1979లో జరిగిన వాస్తవ సంఘటనల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'జిందాగ్యాంగ్– ది రియల్ గ్యాంగ్'. దేవరాజ్, మేఘనా రాజ్ హీరో హీరోయిన్‌గా నటించారు. కృష్ణచంద్ర, లోకి, భరత్ రాజ్ తలికోట్, యువరాజ్ కీలక పాత్రలు పోషించారు. మహేష్ దర్శకత్వంలో ఎస్. మంజు నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. దర్శక– నిర్మాతలు మాట్లాడుతూ– ''వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన చిత్రాలకు ఆదరణ ఎక్కువగా ఉంటుంది. మా 'జిందా గ్యాంగ్' స్క్రీన్ ప్లే ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తుంది. నగేష్ వి. ఆచార్య అందించిన విజువల్స్, గ్రాండియర్ విజువల్స్, శ్రీధర్ వి. సంభ్రం మ్యూజిక్ సినిమాకు మరో హైలైట్‌గా నిలుస్తాయి. దేవరాజ్ నటనతో సినిమాను నిలబెట్టారు. మేఘనా రాజ్ అందం, అభినయంతో ఆకట్టుకుంటారు'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బి. చలపతి.


● మేఘన, దేవరాజ్







# స్కిన్నంత తుళ్లింత



**మం**చి ముఖ వర్చస్సును చూస్తున్న కొద్దీ చూడబుద్దేస్తుంది. మెరిసే మేని మిలమిలలను కన్నార్పకుండా చూడాలనిపిస్తుంది. చర్మం నిగారింపుతో ఉండటం కేవలం అందం మాత్రమే కాదు... ఆరోగ్యం కూడా. అందమే ఆనందం అంటాడు కీట్స్. మరి అందమూ... ఆరోగ్యమూ ఈ రెండూ కలిస్తే... అది అనేక రెట్ల సంతోషానందాలకు నెలవు కదా. అందం, ఆరోగ్యం, ఆనంద త్రయాలను పొందడం ఎలాగో తెలుసుకోవడం కోసమే ఈ కథనం.

మన మేనులో మెరుపు తగ్గడానికీ, అది వడలిపోయినట్లుగా కనిపించడానికి అనేక కారణాలుంటాయి. అందులో ముఖ్యమైనవి పెరిగే వయసు, మన దేహంలో జరిగే జీవక్రియల్లో వెలువడే వ్యర్థాలు, వాతావరణ కాలుష్యం, సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాలు లాంటి అనేక అంశాలు కారణం. వీటిలో ప్రధానమైన అంశాలనూ, వాటి నుంచి కాపాడుకోవడం ఎలాగో చూద్దాం.

## పెరిగే వయసు... తరిగే కాంతి

మన చర్మంలో కొలాజెన్ అనే కణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని బిగుతుగా ఉండేలా చూస్తాయి. సాధారణంగా వయసు పైబడుతున్న కొద్దీ ఈ కొలాజెన్ కణాల సంఖ్య తగ్గుతూ ఉంటుంది. వాటి సంఖ్య తగ్గుతున్న కొద్దీ చర్మంలోని బిగుతు తగ్గుతూ పోతుంటుంది. అందుకే వయసు పై బడిన వారి చర్మం తన ఎలాస్టిసిటీని కోల్పోయి అలా సాగి ఉండిపోతుంది. అయితే మంచి సమతులాహారం, తాజా ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు వంటివి తీసుకుంటూ ఉంటే ఈ కొలాజెన్ చాలాకాలం పాటు ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేవారిలో వయసు పెరుగుతున్నప్పటికీ కొలాజెన్ కణాల సంఖ్య తగ్గాల్సినంతగా తగ్గదు. పైగా ఆ తగ్గే ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. అందుకే మంచి మేని మెరుపుతో దీర్ఘకాలం బిగుతైన చర్మాన్ని కోరుకునేవారు మంచి జీవనశైలిని అనుసరించాలి.

## చర్మం మెరుపును తగ్గించే జీవక్రియల వ్యర్థాలు

మన దేహంలో జీవక్రియలు జరిగే క్రమంలో అనేక వ్యర్థపదార్థాలు విడుదల అవుతాయి. వాటిల్లో ఫ్రీ–రాడికల్స్ అని పిలిచే వ్యర్థాలు ఒక రకం. ఈ ఫ్రీ–రాడికల్స్ మన దేహంలోని ఏ కణంపై ప్రభావం చూపితే ఆ కణం ఆయుష్షు తగ్గిపోతుంది. ఆ కణం దెబ్బతింటుంది. కొన్నిసార్లు దాని స్వరూపమే పూర్తిగా మారిపోయి అది క్యాన్సర్ కణంగా రూపొందే ప్రమాదమూ ఉంది. ఈ ఫ్రీ–రాడికల్స్‌ను 'యాంటీ ఆక్సిడెంట్స్' అనే పోషకాలతో సమర్థంగా ఎదుర్కోవచ్చు. ఇవి మనం తీసుకునే మంచి ఆహార పదార్థాల్లో ఉంటాయి. మరికొన్ని ఆహార పదార్థాల్లోని పోషకాలు నేరుగా యాంటీ ఆక్సిడెంట్స్ కాకపోయినా వాటిలోని కొన్ని వృక్ష రసాయనాల (ఫైటో కెమికల్స్)కు యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అవి కూడా యాంటీ ఆక్సిడెంట్స్‌లాగే పనిచేస్తాయి. మనం తినే ఆహారంలోని ఆ పోషకాలు... ఫ్రీ రాడికల్స్‌తో చర్య జరిపి వాటి దుష్ప్రభావాలను తటస్థం (న్యూట్రలైజ్) చేస్తాయి. ఫలితంగా ఆ కణం చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉండటమే కాదు... అది క్యాన్సర్ కణంగా మారడమూ నివారితమవుతుంది.

## కాలుష్యం చర్మాన్ని దెబ్బతీస్తుందిలా...

శరీరంపై ఉండాల్సిన తేమను చర్మం ఎల్లప్పుడూ నియంత్రిస్తూ ఉంటుంది. ఈ ప్రక్రియపై కాలుష్య పదార్థాలు తీవ్రమైన ప్రభావం చూపిస్తాయి. దాంతో చర్మంపై తేమ ఏ మేరకు ఉండాలో నియంత్రించే శక్తిని చర్మం కోల్పోతుంది. ఫలితంగా చర్మం పొడిబారిపోతుంది. అది పొలుసులు (స్కేలీ)గా అయ్యే అవకాశం కూడా ఉంది. ఎగ్జిమా వంటి అలర్జీ సంబంధమైన చర్మవ్యాధులు ఉన్నవారిలో దీని పరిణామం మరింత తీవ్రంగా ఉంటుంది. ఈ కాలుష్యాల వల్ల చర్మం మరింతగా దురదలు పుడుతూ, ఎర్రబారే అవకాశం ఉంది.

వాతావరణంలో వేడి ఎక్కువగా ఉండి తేమ (హ్యూమిడ్) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ (ఒక రకమైన నూనెను స్రవించే) గ్రంథులు ఎక్కువగా పనిచేస్తాయి. చర్మంపై మరింత చెమట, సీబమ్ (సబేషియస్ గ్రంథుల నుంచి స్రవించే నూనె) ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. అయితే ఇలాంటప్పుడు ట్రాఫిక్‌లోని ఆటోమొబైల్ కాలుష్యంలో ఉండే అత్యంత సూక్ష్మమైన కాలుష్య పదార్థాలు చర్మంపై పడి సబేషియస్ గ్లాండ్ నుంచి మరింతగా సీబమ్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దాంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే నగరాల్లోని వాతావరణం కారణంగా చర్మం మరింతగా దుష్ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది.

కాలుష్యం దుష్ప్రభావం వల్ల నిర్ణీత సమయానికి కంటే ముందుగానే వయసు మీద పడటం కూడా జరుగుతుంది. వృద్ధాప్య లక్షణాలైన చర్మం ముడుతలు పడటం, చర్మంపై మచ్చలు రావడం వంటివి పరిణామాలు సంభవిస్తాయని అధ్యయనాల్లో తేలింది. కాలుష్యం... చర్మం కణసముదాయాల్లో (మాలెక్యూల్స్)లో మార్పులు తెచ్చి వయసు పరంగా వచ్చే మార్పులను త్వరగా తెస్తుంది. వాహనాల ఇంధనం మండటం వల్ల గాలిలో కలిసే కర్బన కణాలు, పాలీ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్ వయసు మీద పడటం వల్ల కనిపించే మార్పులను చాలా వేగంగా తెస్తాయి. గాలిలో కార్బన్ సంబంధమైన కాలుష్యాలు ఎంత ఎక్కువగా ఉంటే.... వయసు పెరిగినప్పుడు మనలో కనిపించే మార్పుల్లాంటివే మనలో అంతే వేగంగా జరుగుతాయని ఒక పరిశోధనలో తేలింది. ఈ ఫలితాలు 'జర్నల్ ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ డెర్మటాలజీ' అనే సైన్స్ మ్యాగజైన్‌లో ప్రచురితమయ్యాయి. చర్మంలో ఒక కణం మరొక కణంతో కలిసి ఉండేందుకు కొలాజెన్ తోడ్పడుతుందన్న విషయం తెలిసిందే కదా. కాలుష్యాల వల్ల ఈ కొలాజెన్ బంధాలు బలహీనమవుతాయి. దాంతో వృద్ధాప్యంలో వచ్చే ముడుతలు కాలుష్యం వల్ల కూడా వస్తాయి. ఈ ప్రమాదం నుంచి చర్మాన్ని కాపాడుకోవాలంటే, వీలైనంతవరకు కాలుష్యం బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవాలి.

### చర్మానికి శత్రువు... కాలుష్యం

ఇటీవల మన వాతావరణంలో కాలుష్యం మరింతగా పెరిగింది. విపరీతంగా పెరుగుతూనే ఉంది. కాలుష్యం తొలి ప్రభావం పడేది మన చర్మం మీదనే. నేరుగా సూర్యరశ్మికి గురికావడం వల్ల కూడా ఇటు చర్మం, అటు జుట్టు... ఈ రెండూ ప్రభావితమవుతాయి. అంతేకాదు... మన చుట్టూ ఉండే వాతావరణంలో దుమ్ము, ధూళి, సస్పెండెడ్ పార్టికిల్స్ కూడా పెరుగుతున్నాయి. ఈ కాలుష్యం, దుమ్ము, ధూళి చర్మంపై తీవ్ర దుష్ప్రభావాలకు కారణమవుతుంటాయి.

ట్రాఫిక్ కాలుష్యాల వల్ల ప్రధానంగా చర్మంపై అలర్జీలు వచ్చే అవకాశాలు ఎక్కువ అని పరిశోధనల్లోనూ తేలింది. ఇక చిన్న పిల్లల చర్మంపైనైతే వీటి ప్రభావం మరింత ఎక్కువ.



## చర్మాన్ని దెబ్బతీసే అల్ట్రా వయొలెట్ కిరణాలు

చర్మంపై అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావమూ ఉంటుంది. గాలిలో కలుస్తున్న కాలుష్యాల ప్రభావంతో భూమి వాతావరణంపై ఉండే ఓజోన్ పొర దెబ్బతింటోంది. ఫలితంగా చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం ఎక్కువవుతోంది. దీని ఫలితంగా చర్మం నల్లబారడం (పిగ్మెంటేషన్) వంటి పరిణామాలు ఎక్కువ. దాంతో చర్మం తన నిగారింపునూ, మెరుపునూ కోల్పోతుంది.

## స్వాభావికంగానే మేనికి మెరుపు తెచ్చుకోవడం ఎలా?

కాస్మటిక్ ద్వారా వచ్చే నిగారింపు కాసేపే ఉంటుంది. అదే నేచురల్‌గానే మేనిలో మెరుపు ఉంటే మేకప్‌తో గానీ, కాస్మటిక్స్‌తోగాని పనే ఉండదు. కొన్ని ఆరోగ్యకరమైన ఆహారాలతో చర్మంలో స్వాభావికంగానే మెరుపు వచ్చేలా చేసుకోగలం. ఇందుకు అవసరమైన ఆహార పదార్థాలివి...

**ఆహారం:** తాజా చేపలు, అవిశెలు, బాదం... వీటిల్లో ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ.
**మేలు:** ఇవి చర్మంలోని తేమను బయటకు వెళ్లనివ్వకుండా కాపాడి చర్మం ఎప్పుడూ మెరుస్తూ ఉండేలా చేస్తాయి. కాస్త గరుగ్గా ఉండే చర్మాన్ని నునుపుగా చేసేందుకు దోహదపడతాయి.

**ఆహారం:** ముడిబియ్యం, పొట్టు తీయని ధాన్యాలు, బార్లీ, పొట్టు తీయని గోధుమలతో చేసిన బ్రెడ్స్ వీటిల్లో పీచు పదార్థాలు ఎక్కువ.
**మేలు:** శరీరంలోని విషాలను తొలగించి బయటకు పంపుతాయి. (డీ–టాక్సిఫై చేస్తాయి). ఇందులోని పీచు పదార్థాలు చర్మం బిగుతుదనాన్ని కాపాడతాయి.

**ఆహారం:** వైటమిన్–బి6 ఎక్కువగా ఉండే ఆహారమైన కాలీఫ్లవర్, పొద్దుతిరుగుడు గింజల నూనె, వాల్‌నట్, అవకాడో
**మేలు:** హార్మోన్లలోని అసమతౌల్యత వల్ల వచ్చే మొటిమలను వైటమిన్–బి6 నివారిస్తుంది. హార్మోన్‌ల సమతౌల్యత సక్రమంగా ఉండేలా సహాయపడుతుంది.

**తాజా పండ్లు:** అరటి, నారింజ, జామ వంటి అన్ని రకాల తాజా పండ్లలో అన్ని రకాల విటమిన్లతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి.
**మేలు:** చర్మాన్ని ముడతలు పడేలా చేసే ఫ్రీ–రాడికల్స్‌ను తొలగించడానికి యాంటీఆక్సిడెంట్లు ఉపయోగపడతాయి. అందుకే చర్మం చాలాకాలం పాటు యౌవనంగా ఉండాలంటే తాజా పండ్లు తినాలి.

## మేని మెరుపును హరించే ఆహారాలు

ఇక మేని మెరుపునకు అడ్డంకిగా నిలిచే ఆహారాలూ కొన్ని ఉన్నాయి. వాటి నుంచి దూరంగా ఉండటం వల్ల కూడా మేనికి సహజమైన నిగారింపు వస్తుంది. ఆ ఆహారాల వివరాలివి...


**ఆహారం:** కాఫీ, టీ, శీతలపానీయాలు, కోలా డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్.
**కీడు:** వీటిల్లో కెఫిన్ పాళ్లు ఎక్కువ. ఇది చర్మంలో నుంచి తేమను సంగ్రహించి చర్మం పొడిబారి కనిపించేలా చేస్తుంది. కెఫిన్ ఒంట్లోని నీటిని తొలగిస్తుంది కాబట్టి విషాలు పేరుకుపోయే అవకాశాలు ఎక్కువ.

**ఆహారం :** చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలైన చాక్లెట్లు, సోడా డ్రింక్స్, భోజనం తర్వాత తినే తీపి పదార్థాలు, స్వీట్స్ ఎక్కువగా ఉండే పానియాలు.
**కీడు :** తీపి పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవడం ఇన్‌ఫ్లమేషన్ అవకాశాలను పెంచుతుంది. తీపి ఎక్కువగా ఉండే ఆహారంతో మొటిమలు వస్తాయి. ఆహారం: బేకరీ ఫుడ్స్, బర్గర్స్, నిల్వ ఉంచి తీసుకునే క్యాన్‌డ్ ఫుడ్.
**కీడు :** ఇందులో అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఎక్కువ. అవి చర్మసౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. చర్మం త్వరగా ముడుతలు పడేందుకు దోహదం చేస్తాయి.

**ఆహారం:** నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు ఉపయోగించే మార్జరిన్ నూనె ఉపయోగించిన పదార్థాలు.
**కీడు:** ఇందులో ట్రాన్స్–ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ. ఇవి రక్తంలో కొవ్వు పదార్థాలను పెంచి చర్మంపై మొటిమలు పెరిగేందుకు దోహదం చేస్తాయి.

### కాలుష్యం నుంచి చర్మాన్ని కాపాడుకోవడం ఎలా?

- కాలుష్యాలైన పొగ, దుమ్ము, ధూళి నేరుగా తాకకుండా సాధ్యమైనంత వరకు చర్మం కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి. అంటే ముఖం, చేతులను రక్షించుకోడానికి స్కార్ఫ్,



- చర్మానికి మంచి పోషకాలు అందేలా యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న పదార్థాలు అంటే ఆకుపచ్చని కూరలు (గ్రీన్ లీఫీ వెజిటబుల్స్), తాజా పళ్లు, విటమిన్ ఏ, సీ, ఈ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజూ రాత్రివేళ కూడా చర్మం, వెంట్రుకలు శుభ్రం అయ్యేలా స్నానం చేయాలి.
- బయటకు వెళ్లడానికి కనీసం 15–20 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. దీనికి తోడు బయటకు వెళ్లాక కూడా ప్రతి రెండు, మూడు గంటలకో మారు మళ్లీ సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. గ్లవ్జ్ వంటివి తొడుక్కోవాలి.

## క్రీమ్స్ వాడాలనుకుంటున్నారా...?

ఇటీవల సౌందర్య స్పృహ అటు మహిళలతో పాటు... ఇటు పురుషుల్లో కూడా పెరిగింది. వారూ మహిళలతో తీసుపోకుండా ఫెయిర్‌నెస్ క్రీములు వాడుతున్నారు. అవి వాడేవారికి డెర్మటాలజిస్టులు చేసే కొన్ని సూచనలివి...

- మీరు ఏదైనా ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడే ముందు దాన్ని కొద్దిగా శరీర భాగంలో ఎక్కడైనా (చేతికి అయితే మంచిది) కొద్దిగా ప్యాచ్‌లాగా రాసి... దాని వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేదని తెలుసుకున్న తర్వాతే వాడటం మంచిది.
- ఏదైనా క్రీమ్ ఎంపిక తర్వాత ఇలా టెస్ట్ చేసుకోకపోతే కొన్నిసార్లు కొందరిలో కాంటాక్ట్ డర్మటైటిస్, అలర్జిక్ రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉందని గుర్తుంచుకోండి. అదే కొద్దిగా ప్యాచ్‌లా రాసుకొని పరీక్షించడం వల్ల కొన్ని ప్రమాదాలను సమర్థంగా నివారించవచ్చని తెలుసుకోండి.
- స్టెరాయిడ్స్‌తో ఉన్న స్కిన్ లైటెనింగ్ క్రీమ్స్ చాలా మంది వాడుతున్నారు. అవి చర్మానికి చాలా హానికరం. అవి వాడటం వల్ల చర్మం చాలా దుష్ప్రభావాలు ఉంటాయి. అందుకే వాటిని వాడకూడదు.
- స్టెరాయిడ్స్ ఉన్న క్రీమ్స్ వల్ల చర్మం తెల్లగా అయినట్లు కనిపించినా దాన్ని విచ్చలవిడిగా వాడటం వల్ల స్టెరాయిడ్ డర్మటైటిస్ అనే సమస్య రావచ్చు. ఫలితంగా చర్మం పలచబారడం వంటి దుష్పరిణామాలు సంభవించవచ్చు. ఒక్కోసారి చర్మంపై పుండ్లు (అల్సర్స్) కూడా రావచ్చు. దాంతో చర్మం కింద ఉన్న రక్తనాళాలు కూడా మరింత వెడల్పుగా మారి (డయలేటెడ్ క్యాపిల్లరీస్) అవి దెబ్బతినే అవకాశం ఉంది.
- స్టెరాయిడ్స్ ఉన్న క్రీమ్స్ మరీ ఎక్కువగా ఉపయోగించడం వల్ల చర్మంపై మొటిమలు (యాక్నే) వంటివి వచ్చే అవకాశం ఉంది. చర్మం మరింత మృదువుగా అయి చిన్న చిన్న గాయాలకే మరింత ఎక్కువగా ప్రతిస్పందించేలా (సెన్సిటివ్‌గా) మారవచ్చు.
- స్టెరాయిడ్స్ ఉన్న క్రీమ్స్ మితిమీరి ఉపయోగించడం వల్ల వయసు పైబడే ప్రక్రియ వేగంగా జరగవచ్చు. శరీరంలోని చర్మకణాలను బిగుతుగా ఉండే కొలాజెన్ దెబ్బతిని ముడుతలు రావడం వేగంగా జరగవచ్చు.
- కొంతమంది బ్యూటీపార్లర్స్ నడిపేవారు తమ వద్ద తయారు చేసిన ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌ను డబ్బాల్లో పెట్టి ఇస్తుంటారు. అలాంటివాటినీ వాడకపోవడమే మంచిది.
- మీరు ఎలాంటి క్రీమ్స్ వాడాలని అనుకున్నా తొలుత దర్మటాలజిస్ట్‌ను సంప్రదించాకే వాడాలి. చర్మం మెరవడం కోసం లేజర్‌టోనింగ్, కెమికల్ పీల్ వంటి కొన్ని చికిత్స ప్రక్రియలు కూడా ఉంటాయి. అవి దర్మటాలజిస్ట్‌లు మాత్రమే చేస్తారు.


ఒక విషయం గుర్తుంచుకోవాలి. కృత్రిమంగా సౌందర్యసాధనాలతో సమకూరే మెరుపు తాత్కాలికం. పైగా ఒక స్నానం తర్వాత వాటిని మళ్లీ పూసుకోక తప్పదు. వీటిలో కొన్ని ఆరోగ్యాన్నీ దెబ్బతీయవచ్చు. కానీ మంచి జీవనశైలి, చక్కటి వ్యాయామం వంటి వాటితో వచ్చే నిగారింపు చాలాకాలం ఉంటుంది. దాదాపు శాశ్వతమే చెప్పవచ్చు. పైగా అది ఆరోగ్యకరం కూడా అయినందున షార్ట్‌కట్‌లు కాకుండా శాశ్వతమార్గాలను అనుసరించడమే మేలు.



**డాక్టర్ స్వప్నప్రియ,**
డర్మటాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్

పరి పరిశోధన


## గుండె జబ్బుల నివారణకు కొత్త మార్గం!



**శ**రీరంలోని ధమనులు వయసుతోపాటు ఎందుకు గట్టిపడతాయో తెలుసుకున్నారు కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. ఈ పరిశోధన పుణ్యమా అని సమీప భవిష్యత్తులోనే గుండె జబ్బుల నివారణకు సరికొత్త పద్ధతి అందుబాటులోకి రానుంది. బ్యాక్టీరియా సమస్యల పరిష్కారానికి మనం నిత్యం వాడే మందుతోనే ధమనులు గట్టిపడటాన్ని నివారించవచ్చునని, తద్వారా గుండెజబ్బులతోపాటు, డిమెన్షియా వంటి వయోసంబంధిత సమస్యలకూ చెక్ పెట్టవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త మెలిండా డ్యుయెర్ తెలిపారు. ధమనుల్లో కాల్షియం స్ఫటికాలు చేరడం ద్వారా అవి గట్టిపడతాయని చాలాకాలంగా తెలిసినప్పటికీ దీనికి కారణమేమిటన్నది మాత్రం ఇప్పటివరకూ స్పష్టం కాలేదు. ఈ నేపథ్యంలో తాము ధమనుల గోడలకు దగ్గరగానే ఈ కాల్షియం స్ఫటికాలు పేరుకు పోవడంపై పరిశోధనలు మొదలుపెట్టామిన మెలిండా తెలిపారు. న్యూక్లియర్ మ్యాగ్నెటిక్ రెసొనెన్స్ స్పెక్ట్రోస్కోపీ ఆధారంగా పరిశీలించినప్పుడు..ఈ కాల్షియం స్ఫటికాలన్నీ చచ్చిపోయిన కణాలు విడుదల చేసే పాలీ ఏడీపీ రైబోస్ రసాయనం ఫలితంగా విడుదలవుతున్నట్లు తెలిసింది. ఈ పీఏఆర్ రసాయాన్ని అడ్డుకునే మందు ఏదని వెతికితే తమకు మినోసైక్లీన్ అనే యాంటీబయాటిక్ కనిపించిందని చెప్పారు. జంతువుల్లో అధిక మినోసైక్లీన్ ఇచ్చినప్పుడు పీఏఆర్ రసాయనం విడుదల తగ్గిపోయిందని, అదేసమయంలో ధమనుల్లోకి కాల్షియం చేరడమూ నెమ్మదించిందని వివరించారు. చౌకగా లభించే, సురక్షితమైన మినోసైక్లీన్‌ను సమీప భవిష్యత్తులో గుండెజబ్బుల నివారణకు ఉపయోగించే అవకాశముందని తెలిపారు.

***

## తేలు విషంలో క్షయ మందు!



**తే**లు విషం ద్వారా క్షయతోపాటు, స్టెఫలోకాకస్ మెరుగైన చికిత్స అందించవచ్చునని గుర్తించారు స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. విషం నుంచి మందులను తయారు చేయడం కొత్తేమీ కాదన్నది తెలిసిందే. ఇప్పటికే తేలు విషంలోని పదార్థాలను మలేరియా చికిత్సకు ఉపయోగిస్తూండగా కేనసర్ కోసమూ వీటిపై పరిశోధనలు జరుగుతున్నాయి. అంతేకాదు.. గతనెలలో మెదడులోని కణితులను గుర్తించేందుకు తేలు విషం ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ నేపథ్యంలో స్టాన్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు జరిపిన తాజా పరిశోధనలో క్షయ, స్టెఫలోకాకస్ కారక బ్యాక్టీరియాలపై మంచి ప్రభావం చూపగల రెండు మూలకాలను తేలు విషంలో గుర్తించారు. అంతేకాదు.. ఈ మూలకాలను కత్రిమంగా తయారు చేయడం కూడా పూర్తిచేశారు. మెక్సికో ప్రాంతానికి చెందిన డిప్లోసెంట్రస్ మెలీసీ అనే జాతి తేలు నుంచి తీసిన విషంలోని రెండు బెంజోక్వినోన్స్‌కు యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నట్లు గుర్తించి పరిశోధనశాలలో వాటిని కత్రిమంగా తయారు చేశారు. ఎలుక కణజాలంలోకి వీటిని జొప్పించినప్పుడు బ్యాక్టీరియా నాశనమైనట్లు తెలిసిందని.. మరిన్ని పరిశోధనల ద్వారా ఈ విషయాలను ధ్రువీకరించుకున్న తరువాత విస్తృత వినియోగానికి తేగలమని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

## హోమియో కౌన్సెలింగ్స్

### గౌట్ సమస్యకు పరిష్కారం ఉందా?

**నా వయసు 47 ఏళ్లు. కొన్నాళ్లుగా కాలి బొటనవేలు వాచింది. అక్కడ విపరీతమైన సలపరంతో తీవ్రమైన నొప్పి వస్తోంది. డాక్టర్‌గారు గౌట్ అని చెప్పారు. ఎన్ని మందులు వాడినా ఉపశమనం కనిపించడం లేదు. నా సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?**

**– కె. శామ్యూల్, భీమవరం**



గౌట్ అనేది ఒక రకం కీళ్ల వ్యాధి. మన శరీరంలో 'యూరిక్ యాసిడ్' జీవక్రియలు సరిగా లేనందున ఈ వ్యాధి వస్తుంది. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో ఉండే ప్యూరిన్స్ అనే పదార్థాల విచ్ఛిన్నంలో భాగంగా యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. అది రక్తంలో ఉండాల్సిన పరిమాణం కంటే ఎక్కువగా ఉంటే కీళ్లలోకి చేరుతుంది. అప్పుడు కీలు వాచిపోయి, కదలికలు కష్టంగా మారతాయి. ఈ పరిస్థితిని 'గౌట్' అంటారు.

**కారణాలు:** ● సాధారణంగా రక్తంలోని యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా విసర్జితమవుతుంది. ఒక వేళ శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగినా లేదా దాని విసర్జన సరిగా జరగకపోయినా అది రక్తంలోనే నిలిచిపోయి గౌట్‌కు దారితీస్తుంది. ● ప్యూరిన్స్ ఎక్కువగా ఉండే ఆహారం (ఉదా: మాంసం, గుడ్లు, చేపలు) వంటి ఆహారం ఎక్కువగా తీసుకునేవారిలో ఇది అధికం. ● అధిక బరువు, వయసు పెరగడం, వంశపారంపర్యంగా రావడం కూడా కొన్ని కారణాలు.

**లక్షణాలు :** ● తీవ్రతను బట్టి ఈ వ్యాధి లక్షణాలు చాలా ఆకస్మికంగా కనిపిస్తాయి.
● చాలామందిలో ఇది కాలి బొటనవేలితో ప్రారంభమవుతుంది.
● మొదట్లో ఈ వ్యాధి కాలి బొటనవేలికి మాత్రమే పరిమితమైనప్పటికీ క్రమేపీ మోకాళ్లు, మడమలు, మోచేతులు, మణికట్టు, వేళ్లను కూడా ప్రభావితం చేస్తుంది.
● ఈ సమస్యను నిర్లక్ష్యం చేసి సరైన చికిత్స తీసుకోకపోతే మరింత తీవ్రతరమై కీళ్లను పూర్తిగా దెబ్బతీస్తుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం కూడా ఉంది.

**నివారణ / జాగ్రత్తలు :** మాంసకృత్తులను బాగా తగ్గించాలి. మాంసాహారంలో ప్యూరిన్స్ ఎక్కువగా ఉండే గొర్రె, మేక, బీఫ్ వంటివి తీసుకోకూడదు. అలాగే మాంసాహారంలోని లివర్, కిడ్నీ, ఎముక మూలుగా, పేగుల వంటి తినకూడదు. శాకాహారంలో పాలకూర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుళ్లు, వివిధ రకాల బీన్స్, పుట్టగొడుగుల వంటివి తీసుకోకూడదు. మద్యపానం పూర్తిగా మానివేయాలి.

**చికిత్స :** హోమియో వైద్యవిధానం ద్వారా అందించే అధునాతనమైన కాన్స్‌టిట్యూషన్ చికిత్స ద్వారా గౌట్ వ్యాధిని శాశ్వతంగా నయం చేయడం సాధ్యమవుతుంది.



**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

### మా పాప అలర్జీ సమస్యలు తగ్గుతాయా?

**మా పాపకు 12 ఏళ్లు. వాతావరణం మారగానే తుమ్ములు, జలుబు, ముక్కు దిబ్బెడ మొదలవుతాయి. డాక్టర్లను సంప్రదిస్తే అలర్జీనే కారణమంటున్నారు. స్కూల్‌కు వెళ్లేందుకు కూడా వీల్లేనంతగా సమస్య ఉంటోంది. మా పాప సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?**

**– మాలతి, విజయవాడ**

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ పాప అలర్జీతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అలర్జీ గురించి మనం ప్రతిరోజూ వింటూనే ఉంటాం. సాధారణంగా తొలకరి పడగానే అది వేసవి వేడిమి నుంచి ఉపశమనం ఇస్తుంటుంది. అయితే కొందరిలో అది పలు రకాల సమస్యలతో ప్రాణాలు తోడేయ వచ్చు. కొందరిలో తొలకరి మొదలుకాగానే అలర్జీ సమస్య వేధిస్తూ ఉంటుంది. తుమ్ములూ, దగ్గుతోబాటు శ్వాస తీసుకోవడమూ కష్టమవుతుంది. సాధారణంగా వర్షాకాలంలో మనం ఆస్తమా, అలర్జీ బ్రాంకైటిస్, ఫ్లూ వంటి వ్యాధులను ఎక్కువగా చూస్తుంటాం. ఆధునిక జీవనశైలి; పారిశ్రామిక ప్రాంతాలూ పెద్దపట్టణాల్లోని వాతావరణ కాలుష్యం వంటివి ఈ అలర్జీకి ప్రధానమైన కారణం. అలర్జీతో ఇబ్బందులు పడేవారి బాధ వర్ణనాతీతం. వయసుతో నిమిత్తం లేకుండా చిన్నా పెద్దా అందరూ అలర్జీ బారిన పడుతుంటారు. అలర్జీని కలిగించే పదార్థాలను 'అలర్జెన్స్' అంటారు. అంటే... అలర్జీతో బాధపడేవారు వారికి సరిపడని పదార్థం తీసుకున్నప్పుడు లేదా దానికి చేరువగా వచ్చినప్పుడు వారి రక్తంలో ఉండే ఇమ్యూనోగ్లోబిన్–ఈ అనే యాంటీబాడీస్‌తో అలర్జెన్స్ కలవడం వల్ల హిస్టమిన్ అనే జీవరసాయనం విడుదల అవుతుంది. దీని కారణంగానే వ్యాధి లక్షణాలు ప్రారంభం అవుతాయి. వ్యక్తుల శారీరక తత్వాలు, వాతావరణం, వంశపారంపర్య ఆరోగ్య చరిత్ర, గాలి–నీరు–ఆహారం, కాలుష్యాల వల్ల రక్తంలో కలిగే మార్పుల కారణంగా అలర్జీ వస్తుంది.

**అలర్జీలకు కారణాలు:** ● దుమ్ము, పుప్పొడి రేణువులు ● పెంపుడు జంతువుల వెంట్రుకలు ● ఘాటువాసనలు ● చల్లటిగాలి ● శీతలపానీయాలు, ఐస్‌క్రీములు ● మస్కిటో రిపల్లెంట్స్ ● వాతావరణంలో మార్పులు

**లక్షణాలు:** ●తుమ్ములు ● ముక్కు కారడం ● శ్వాసలో ఇబ్బందులు, ఆయాసం, ఉబ్బసం ● వాంతులు ● దద్దుర్లు ● కళ్లు దురద పెట్టడం

**వ్యాధి నిర్ధారణ :** సీబీపీ, ఈఎస్ఆర్, ఇసినోఫిల్ కౌంట్, ఐజీ–ఈ యాంటీబాడీస్, ఎక్స్‌రే, పల్మునరీ ఫంక్షన్ టెస్ట్, సీటీ స్కాన్, అలర్జిక్ ప్రొఫైల్ వంటి వైద్య పరీక్షలు.

**చికిత్స:** హోమియోలో అలర్జీ నుంచి పూర్తి ఉపశమనం కలిగించే మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి కారకాలను బట్టి రోగనిరోధక శక్తిని పెంచి అన్ని రకాల అలర్జీలను దూరం చేసి వ్యాధిని నయం చేస్తారు. దీనికి ఆర్సెనిక్ ఆల్బ్, రస్టాక్స్, బెల్లడోనా, ఆరమ్ ట్రైఫిల్లమ్, అలియమ్ సెపా వంటి మందులను అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వాడాలి.




**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

ఫ్యామిలీ డాక్టర్

### రుమటాయిడ్ ఆర్థరైటిస్ నయమవుతుందా?

**నా వయసు 59 ఏళ్లు. నాకు రెండు చేతుల్లోని కీళ్లు నొప్పిగా ఉంటున్నాయి. కీళ్లవద్ద ఎర్రగా మారుతోంది. హోమియోలో పరిష్కారం ఉందా?**

**వి. రాజయ్య, కందుకూరు**



ఇటీవల ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారిని ఎక్కువగా చూస్తున్నాం. ఈ తరహా వ్యాధులలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ ముఖ్యమైనది. సాధారణంగా స్త్రీ–పురుషులలో యాభైఏళ్ల తర్వాత కొన్ని నొప్పులు మొదలవుతాయి. వయస్సు పెరిగేకొద్దీ కీళ్ళలో వచ్చే అరుగుదల వలన, ఎముకలలో క్యాల్షియం తగ్గిపోవడం వల్ల ఇలా జరుగుతోంది. దీనిని 'ఆస్టియో ఆర్థరైటిస్' అంటారు. ఇందుకు భిన్నంగా ముప్పై నుండి నలభై ఏళ్ళ మధ్యలో ఉండే వారిలో చేతుల్లో, పాదాలలో ఉండే చిన్న చిన్న కీళ్లలో వచ్చే కీళ్ళ వాపులు, నొప్పులు రావడం రుమటాయిడ్ ఆర్థరైటిస్ లక్షణాలు. ఇది మహిళలు, పురుషులు, కొన్ని సందర్భాల్లో పిల్లల్లో కూడా రావచ్చు. చిన్న పిల్లల్లో వచ్చే ఈ తరహా వ్యాధిని 'స్టిల్స్ డిసీజ్' అని అంటారు.

**లక్షణాలు :** ఈ వ్యాధి యాక్టివ్ స్టేజ్‌లో ఉన్నప్పుడు అలసట, ఆకలి లేకపోవడం, లోగ్రేడ్ జ్వరం, కీళ్ళలో, కండరాల్లో నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా కీళ్లనొప్పులు ఉదయాన్నే లేవగానే అత్యధికంగా ఉండి కొద్దిగా శరీరం కదిలించిన తర్వాత అదుపులో ఉంటాయి. సాధారణంగా చేతుల్లో కాళ్లలో రెండు వైపులా ఒకే కీళ్ళు ప్రభావితమవుతాయి. కీళ్ళు ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయి. వ్యాధి దీర్ఘకాలంగా మారినప్పుడు కీళ్ళలోని మృదులాస్థి, ఎముకలు దెబ్బతినడం వలన వేళ్ళు వంకర్లు పోవడం పూర్తిగా కదలికలు ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటినే 'డిఫార్మిటీస్' అంటారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ని నిర్ధారించడానికి ఏ ఒక్క పరీక్ష సరిపోదు. రక్తపరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలూ చేయించాల్సి ఉంటుంది. ఆటో ఇమ్యూన్ సమస్యలలో చికిత్స చెయ్యడానికి హోమియోపతిలో మయాజ్మాటిక్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. సాధారణంగా వాడే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వల్ల నొప్పి నుండి తాత్కాలికంగా ఉపశమనం లభించడం లేదా కొన్నిసార్లు అస్సలు ప్రభావమే ఉండకపోవచ్చు. పైగా ఈ మందుల వలన డిఫార్మిటీస్‌ని నివారించలేవు. హోమియోపతి మందుల ద్వారా అయితే వ్యాధిని నియంత్రించి నొప్పులను పూర్తిగా తగ్గించడం మాత్రమే కాకుండా డిఫార్మిటీలు రాకుండా కూడా నివారించవచ్చు.



**డాక్టర్ టి.కిరణ్‌కుమార్,**
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

సాక్షి
భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
13-6-2019




# ఏపీ గ్రూప్-1
# మెయిన్స్ సమరం

**ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది. 'కీ' సైతం విడుదల చేసింది. దాంతో తమకు వచ్చే స్కోర్‌పై విద్యార్థుల్లో చర్చ జరుగుతోంది. మెయిన్స్‌కు ఎంతమందిని ఎంపిక చేస్తారు..కటాఫ్ ఎంత ఉంటుంది.. మెయిన్స్‌కు ప్రిపరేషన్ ఇప్పుడే ప్రారంభించాలా.. ఫలితాలు వచ్చేవరకూ ఆగుదామా..! ఇలా అభ్యర్థుల్లో తర్జనభర్జన కొనసాగుతోంది. అయితే కీని చూసుకొని పరీక్ష బాగా రాసామని నమ్ముతున్న విద్యార్థులు వెంటనే మెయిన్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టడం మేలన్నది నిపుణుల సలహా. మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్‌లో జరిగే అవకాశమున్న నేపథ్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ రివ్యూతోపాటు మెయిన్స్ ప్రిపరేషన్ గైడెన్స్...**

- ఏపీ గ్రూప్-1 ప్రిలిమ్స్ కఠినంగా ఉందనే అభిప్రాయం
- అనువాద దోషాలతో అభ్యర్థుల్లో గందరగోళం
- కీ విడుదల చేసిన ఏపీపీఎస్సీ
- మెయిన్ పరీక్షలు సెప్టెంబర్‌లో!

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను (స్క్రీనింగ్ టెస్ట్) మే 26న నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,14,473 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా..59,200 మంది హాజరయ్యారు. స్క్రీనింగ్ టెస్టు ప్రశ్నపత్రాల్లో దొర్లిన తప్పులు అభ్యర్థులను గందరగోళానికి గురిచేశాయి. ప్రధానంగా ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువాదాల్లో చాలా పొరపాట్లు ఉన్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. ఇంగ్లిష్ పదాలను తెలుగులోకి సరిగా అనువాదం చేయకపోవడం.. మరికొన్ని ప్రశ్నల్లో ఆంగ్ల పదాలను తెలుగులో యథాతథంగా ఇవ్వడం వల్ల తెలుగు మీడియం విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఉదాహరణకు During which period did India have continuous current account surplus? అనే ప్రశ్నను భారతదేశంలో ఏ సంవత్సరంలో నిరాటంక అధిక విద్యుత్ సరఫరా జరిగింది? అని తెలుగులో అనువదించడం వల్ల ఆ ప్రశ్న అర్థమే మారిపోయింది. అలానే, The Preamble may be invoked to determine the ambit of Fundamental Rights and Directive Principles అనే ప్రశ్నకు... ప్రవేశిక ఆంబిట్ యొక్క ఇన్వోక్ గుర్తించడానికి ప్రాథమిక హక్కులు, డైరెక్టివ్ ప్రిన్స్‌పల్స్ అని తర్జుమా చేయడం వల్ల తెలుగు మీడియం అభ్యర్థులు ప్రశ్నను అర్థం చేసుకోలేకపోయారు. పలు ప్రశ్నల్లో సాంకేతిక పదాలను అనువదించడంలో తప్పిదాలు దొర్లినట్లు నిపుణులు చెబుతున్నారు. అలానే కొన్నిచోట్ల ప్రశ్నలు-వాటి ఐచ్ఛికాలు కూడా అర్థవంతంగా లేవని అభ్యర్థులు అంటున్నారు.

### భిన్నంగా ప్రశ్నల సరళి

ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రశ్నల సరళి సంప్రదాయానికి భిన్నంగా ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ, దేశ, రాష్ట్ర జాగ్రఫీ అని సిలబస్‌లో పేర్కొన్నారు. కానీ, స్క్రీనింగ్ టెస్టులో మొత్తం వరల్డ్ జాగ్రఫీ నుంచే ప్రశ్నలు అడిగారు. ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ నుంచి ప్రశ్నలు కనిపించలేదు. భారత జాగ్రఫీ నుంచి 1-2 ప్రశ్నలు మాత్రమే వచ్చాయి. చరిత్రలో అభ్యర్థులు పెద్దగా దృష్టిసారించని పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడిగారు. పాలిటీ ప్రశ్నలు, ఆప్షన్లు సుదీర్ఘంగా, విశ్లేషణాత్మకంగా యూపీఎస్సీ సివిల్స్ తరహాలో ఉన్నట్లు పలువురు పేర్కొన్నారు.

### పేపర్ 2 సైతం కఠినంగానే

పేపర్ 2 కూడా కఠినంగా ఉంది. లెక్కలకు సమాధానాలు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టింది. మ్యాథ్స్ నేపథ్యం లేని అభ్యర్థులకు పేపర్ 2 ప్రశ్నపత్రం మరింత క్లిష్టంగా అనిపించింది. క్యాట్ వంటి పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులు సాధించగలిగేలా కొన్ని ప్రశ్నలున్నాయని చెబుతున్నారు. డేటాఅనాలిసిస్‌కు సంబంధించిన ప్రశ్నలు మాత్రం కొంత సులువుగా వచ్చాయి. కరెంట్ అఫైర్స్ విషయంలోనూ అభ్యర్థుల అంచనాలు తప్పాయి. పోటీ పరీక్షల అభ్యర్థులు సాధారణంగా పరీక్షకు ఆరు నెలల ముందు వరకు జరిగిన వర్తమాన వ్యవహారాలు చదువుకుంటారు. కానీ, గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్టులో దాదాపు ఏడాది ముందు వరకు జరిగిన సమకాలీన అంశాలపై ప్రశ్నలు వచ్చాయి.



### మెయిన్స్ సన్నద్ధత... మూడు నెలల సమయం

ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్టు 'కీ' విడుదల చేసింది. అభ్యర్థులు 'కీ'ని చూసుకున్న తర్వాత మెయిన్స్‌కు అర్హత సాధిస్తారా.. లేదా? అని ఒక అంచనాకు వచ్చి ఉంటారు. సెప్టెంబర్‌లో మెయిన్ పరీక్షను నిర్వహించే అవకాశముంది. అంటే.. మెయిన్ పరీక్షకు ఇంకా సుమారు మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. అభ్యర్థులు ఈ సమయాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోవాలి. ఇంతకాలం చదివిన అంశాలను పునశ్చరణ చేయాలి. గతంలో గ్రూప్-1కు సన్నద్ధమైన అభ్యర్థులు ఈసారి మారిన పరీక్ష విధానానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం చదవాలి.

### మెయిన్స్.. 750 మార్కులు

- **తెలుగు పేపర్:** 150 మార్కులు (అర్హత పరీక్ష).
- **ఇంగ్లిష్ పేపర్:** 150 మార్కులు (అర్హత పరీక్ష).
- **పేపర్-1:** జనరల్ ఎస్సే-150 మార్కులు.
- **పేపర్-2:** హిస్టరీ, కల్చర్ అండ్ జాగ్రఫీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్-150 మార్కులు.
- **పేపర్-3:** పాలిటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్, లా, ఎథిక్స్-150 మార్కులు.
- **పేపర్-4:** భారత్, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి-150 మార్కులు.
- **పేపర్-5:** సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్-150 మార్కులు.
- ప్రతి పేపర్‌కు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.
- మెయిన్స్‌లో ప్రతిభచూపిన వారికి 75 మార్కులకు ఇంటర్వ్యూ జరుగుతుంది.
- తెలుగు, ఇంగ్లిష్ పేపర్ల మార్కులను తుది జాబితా రూపకల్పనకు పరిగణనలోకి తీసుకోరు. కానీ, వీటిలో కనీస అర్హత మార్కులు సాధించాలి.
- మెయిన్ పరీక్ష ఐదు పేపర్లకు 750 మార్కులు, ఇంటర్వ్యూకు 75 మార్కులు కలుపుకొని మొత్తం 825 మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

### జనరల్ ఎస్సే

మెయిన్స్‌లో జనరల్ ఎస్సే.. అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తుంది. ఇందులో వేర్వేరు అంశాల్లో అభ్యర్థికి ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. కరెంట్ అఫైర్స్, సామాజిక-రాజకీయ సమస్యలు, సామాజిక-ఆర్థిక సమస్యలు, సామాజిక- పర్యావరణ సమస్యలు, సాంస్కృతిక-చారిత్రాత్మక అంశాలు, పౌరస్పృహ నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి నిర్దిష్ట అంశంపై విభిన్న కోణాల్లో తన అభిప్రాయాలను సమగ్ర సమాచారంతో విశ్లేషించగలిగే నైపుణ్యం కలిగి ఉండాలి. సమాధానాలు సూటిగా, స్పష్టంగా రాయాలి. జనరల్ ఎస్సేలో.. ఆరంభం, సమాచారం, విశ్లేషణ, సానుకూల, ప్రతికూల అంశాల ప్రస్తావన, సమస్య-పరిష్కారాలు, చివరగా ముగింపు.. ఒక క్రమపద్ధతిలో సాగాలి. విషయ పరిజ్ఞానం ఉట్టిపడేలా ఎస్సే రైటింగ్ ఉండాలి. సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక సలహాలు పొందుపరచాలి. రోజూ దినపత్రికల్లో వచ్చే ఎడిటోరియల్స్, ప్రత్యేక కథనాలు చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం, రైటింగ్ స్కిల్స్ మెరుగుపరచుకోవచ్చు. దాంతోపాటు గ్రామర్, స్పెల్లింగ్ తప్పిదాలు లేకుండా సమాధానాలు రాయడం ముఖ్యం.

### ఆన్‌లైన్ సమాచారం.. అప్రమత్తత

ఆన్‌లైన్లో సమాచారం సేకరించే క్రమంలో అప్రమత్తంగా ఉండాలి. నెట్‌లో విస్తృత సమాచారం అందుబాటులో ఉంది. అనవసర విషయాలపై దృష్టి మరిలే ఆస్కారం ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు స్పష్టతతో వ్యవహరించాలి. కీవర్డ్స్ ఉపయోగించి సమాచారం సేకరించుకొని నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పరీక్షలో ఎదురయ్యే ప్రశ్నలకు నిర్దేశిత పరిమిత వాక్యాల్లో సమాధానాలు రాయాలి. దీనికి తగ్గట్టుగానే నోట్స్ సిద్ధం చేసుకోవాలి. 10 మార్కులకు వచ్చిన ప్రశ్నలకు ఉపోద్ఘాతంతో పాటు 10 నుంచి 15 కీలక పాయింట్లు రాస్తే సరిపోతుంది. ఇంటర్నెట్, ఇతర సోర్సుల ద్వారా సేకరించుకునే సమాచారం చాలా ప్రధానమైనదై ఉండాలి.

### చరిత్ర, జాగ్రఫీ

- పేపర్ 2లో చరిత్ర, సంస్కృతి; భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీపై ప్రశ్నలు ఉంటాయి. హిస్టరీలో మొదటి సెక్షన్ ఇండియన్ హిస్టరీ, రెండో సెక్షన్ ఆంధ్రప్రదేశ్ చరిత్ర. అభ్యర్థులు ఇప్పటికే హిస్టరీ ప్రిపరేషన్ పూర్తిచేసి ఉంటారు. గతంలో చదివిన పుస్తకాలనే మరోసారి చదవడం మేలు. సిలబస్‌లో పేర్కొన్న అంశాల వారీగా ప్రిపరేషన్ సాగించడం లాభిస్తుంది. భారతదేశ చరిత్రలో ఆధునిక చరిత్రకు ప్రాధాన్యమివ్వాలి. ప్రాచీన చరిత్రలో భాగంగా సింధూ నాగరికత, శాతవాహనులు, నాటి విద్యాసంస్థలు, పల్లవులు, చాళుక్యులు, నాటి సాంస్కృతిక వ్యవహారాలు, మత ఉద్యమాలు, ఢిల్లీ సుల్తానులు, సాహిత్యం, మొగల్ సామ్రాజ్య స్థాపన, సాంస్కృతిక, మతపరమైన పరిణామాలు, యూరోపియన్ల రాక, ఈస్ట్ ఇండియా కంపెనీ-వర్తక వ్యవహారాలు, క్రిస్టియన్ మిషనరీల పాత్ర, బ్రిటిష్ పాలన, జాతీయోద్యమం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, దేశ విభజన తదితరాలపై దృష్టిసారించాలి.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్రకు సంబంధించి అకాడమీ పుస్తకాలు, ప్రామాణిక రచయితల పుస్తకాలు సేకరించుకొని చదవాలి. ప్రధానంగా జాతీయోద్యమంలో తెలుగు వ్యక్తుల భాగస్వామ్యాన్ని అధ్యయనం చేయాలి. అల్లూరి సీతారామరాజు, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్యతోపాటు ఈసారి డొక్కా సీతమ్మ, కనకమ్మ వంటి పేర్లను కూడా సిలబస్‌లో చేర్చారు. వారి గురించి ప్రత్యేకంగా నోట్స్ సిద్ధం చేసుకోవడం మేలు. ఇంకా ముఖ్యంగా రాష్ట్ర విభజనకు దారితీసిన సంఘటనలు, విభజన చట్టం, ఉద్యోగుల విభజన, స్థానిక సమస్యలు, నీళ్ల పంపకం తదితర సమస్యల గురించి పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండాలి. జాగ్రఫీ సన్నద్ధతకు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12వ తరగతుల పుస్తకాలు చదవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఏపీ జాగ్రఫీకి తెలుగు అకాడమీ పుస్తకాలు చదవొచ్చు. ఇప్పటికే ఏదైనా పుస్తకాన్ని రిఫర్ చేస్తే దాన్నే మరోసారి పునశ్చరణ చేసుకోవడం మేలు.

### పాలిటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్, లా, ఎథిక్స్

- పేపర్ 3లో పాలిటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్, లా అండ్ ఎథిక్స్ అంశాలు ఉన్నాయి. వీటిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎథిక్స్ పేపర్లు అభ్యర్థులకు కొత్త అని చెప్పొచ్చు. యూపీఎస్సీ సివిల్స్ సిలబస్‌నే కాస్త అటుఇటుగా గ్రూపు-1 మెయిన్స్‌లో చేర్చారు. గవర్నెన్స్, పౌర సమాజం, పాలనా దక్షత, ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమల్లో ఎదురయ్యే సమస్యలు, ప్రజాస్వామ్యంలో సివిల్ సర్వీసెస్ పాత్ర, ఆర్‌టీఐ, సుపరిపాలన, ఈ-గవర్నెన్స్, పారదర్శకత, జవాబుదారీతనం, సోషల్ ఆడిట్ వంటి అంశాల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు ఉద్దేశించిన విభాగం ఇది. ఈ అంశాలకు సంబంధించి డిగ్రీస్థాయి పుస్తకాలు చదవొచ్చు. అలాగే ఎథిక్స్ నుంచి దృక్పథం, విలువలు, ప్రజాసేవ మొదలైన అంశాలపై కేస్ స్టడీస్ రూపంలో ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది.
- జాతీయస్థాయిలో లోక్‌పాల్ ప్రాముఖ్యత, అవినీతి, లోకాయుక్త, అంతర్జాతీయ వ్యవహారాల్లో విలువలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఈ మేరకు నోట్స్ సిద్ధం చేసుకోవాలి. దేశంలో సివిల్, క్రిమినల్ చట్టాలు, లేబర్ చట్టాలు, సైబర్ చట్టాలు, పన్ను చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలి. ఇటీవల అమల్లోకి వచ్చిన చట్టాలు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి అన్ని అంశాలను తెలుసుకోవాలి. కోర్ సబ్జెక్ట్‌లో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు-సంబంధాలు, భారత సమాఖ్య-ప్రత్యేక లక్షణాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, ఎన్నికల కమిషన్, న్యాయ సమీక్ష-న్యాయ వ్యవస్థ క్రియాశీలత, రాజ్యాంగ ప్రాథమిక స్వరూప సిద్ధాంతం, పంచాయతీరాజ్ వ్యవస్థ, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, మైనార్టీల సంక్షేమం వంటి అంశాలపై ప్రశ్నలకు సమాధానాలు రాయడాన్ని ప్రాక్టీస్ చేయాలి.

### పేపర్ 4.. ఎకానమీ

ఎకానమీ; భారత్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై పేపర్ 4 ఉంటుంది. ఇందులో సమకాలీన అంశాలకు ప్రాధాన్యమిస్తారు. సిలబస్‌లోని ప్రతి టాపిక్‌ను వర్తమాన వ్యవహారాలతో అనుసంధానిస్తూ చదువుకోవాలి. ఈ పేపర్ పూర్తిగా డైనమిక్ అని చెప్పొచ్చు. కేంద్ర ప్రభుత్వం జులై మొదటి వారంలో సోషియో ఎకనామిక్ సర్వేను విడుదల చేయనుంది. దీనిద్వారా భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులకు సంబంధించి కీలక సమాచారం పొందొచ్చు. అలాగే ఎకానమీ ప్రిపరేషన్‌కు అభ్యర్థులు ఇంటర్నెట్‌పై ఆధారపడొచ్చు. ఎకానమీలో కొన్ని ప్రశ్నలు నేరుగా ఉంటాయి. వీటికి సమకాలీన అంశాలను జోడిస్తూ సమాధానాలు రాయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు. ఏపీకి సంబంధించి శ్వేత పత్రాలు, సోషియో ఎకనామిక్ సర్వేను బాగా ఔపోసన పట్టాలి. భారత ఆర్థిక వ్యవస్థ-ప్రస్తుత సవాళ్లు, వనరుల సమీకరణ, సమ్మిళిత వృద్ధి, వ్యవసాయ రంగం, భారత్, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అభివృద్ధి వంటి అంశాలపై పట్టుసాధించాలి. పారిశ్రామిక రంగం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విధానం, మౌలిక వసతులు కూడా పరీక్ష కోణంలో ముఖ్యమైన అంశాలే. అలాగే కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ద్రవ్యలోటు, తలసరి ఆదాయం, జీడీపీ వృద్ధిరేటుకు సంబంధించి తాజా గణాంకాలు తెలుసుకోవాలి. సమాధానాలు రాసేటప్పుడు వీటిని ఉటంకించడం ద్వారా మంచి స్కోరు సాధించొచ్చు. గత రెండు, మూడేళ్ల గణాంకాలను పోల్చుతూ సమాధానాలు రాయడం కూడా లాభిస్తుంది.

### పేపర్ 5.. సైన్స్, టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్



- సైన్స్ అండ్ టెక్నాలజీ సిలబస్‌లో పెద్దగా మార్పులు లేవు. కానీ, ప్రశ్నలను లోతుగా అడిగే అవకాశం ఉంటుంది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఈ-గవర్నెన్స్, సైబర్ క్రైమ్, భారత ప్రభుత్వ ఐటీ పాలసీ; దేశంలో, ఏపీలో ఐటీ అభివృద్ధికి సంబంధించిన పరిణామాలు, భారత అంతరిక్ష కార్యక్రమం, ఇస్రో, ఉపగ్రహ ప్రయోగాలు, డీఆర్‌డీవో, దేశ ఇంధన అవసరాలు, శుద్ధ ఇంధనం అంశాలపై ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది. వీటిని తాజా పరిణామాలకు అనుసంధానిస్తూ చదువుకోవాలి.
- ఈ పేపర్‌లో పర్యావరణ అంశానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. పర్యావరణం ప్రిపరేషన్ కోసం ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకోవచ్చు. యూపీఎస్సీ సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రూపు-1 సిలబస్‌ను ఎంతవరకు చదవాలో నిర్ణయించుకొని ప్రిపరేషన్ కొనసాగించాలి. ఉదాహరణకు శంకర్ ఐఏఎస్ పుస్తకం రిఫర్ చేసే అభ్యర్థులు ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్(ఈఐఏ) టాపిక్‌ను చదివేటప్పుడు అవసరం మేరకే చదవాలి. శంకర్ ఐఏఎస్ బుక్‌లో ఈ టాపిక్‌కు ప్రత్యేకమైన చాప్టర్ మొత్తం ఉంటుంది. కాబట్టి దాన్నంతా చదవాల్సిన అవసరం లేదు. అవసరం మేరకు చదివి సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి. అదేవిధంగా ఇప్పటివరకు ప్రిపేరైన మెటీరియల్‌నే చదవడం మేలు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సమకాలీన అంశాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇది పూర్తి డైనమిక్ సబ్జెక్టుగా చెప్పుకోవచ్చు. కాబట్టి ప్రిపరేషన్‌కు ఆన్‌లైన్ సమాచారం చక్కటి వేదికగా నిలుస్తుంది.

### సిలబస్‌ను అర్థం చేసుకోవాలి

ప్రామాణిక పుస్తకాలు చదివే వారికి గ్రూప్-1 సాధించడం పెద్దకష్టం కాదు. ముఖ్యంగా సిలబస్‌లో పేర్కొన్న అంశాలను మాత్రమే చదవాలి. ప్రతి అంశానికి సొంత నోట్స్ సిద్ధం చేసుకోవడం లాభిస్తుంది. గత పరీక్షలు రాసిన వారు ఈసారి సిలబస్‌లో చోటుచేసుకున్న మార్పులను గమనించి సన్నద్ధమవ్వాలి. హిస్టరీ మినహా అన్ని సబ్జెక్టులు డైనమిక్‌గా ఉంటాయి. తదనుగుణంగా తాజాగా చోటుచేసుకుంటున్న సంఘటనలను గమనిస్తూ, ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి. పరీక్షలో సూటిగా, అవసరం మేరకే సమాధానాలు రాసేలా ప్రాక్టీస్ చేయాలి.

**- చల్లపల్లె యశ్వంత్‌రెడ్డి**, అసిస్టెంట్ కమిషనర్, స్టేట్ ట్యాక్స్, కర్నూలు, 2016 గ్రూప్-1 మూడో ర్యాంకర్.

### ప్రాక్టీస్ చేయకుంటే..

రోజంతా కష్టపడి చదివినా.. పెన్ పెట్టి ప్రాక్టీస్ చేయకుంటే మంచి మార్కులు పొందలేరు. కాబట్టి ప్రాక్టీస్ చేస్తూ సమాధానాలను ఫ్యాకల్టీ, నిపుణులతో మూల్యాంకనం చేయించుకోవాలి. గ్రూప్-1 ఔత్సాహిక అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ రాస్తున్న వారితో పోటీపడాల్సి ఉంటుంది. కాబట్టి ఎక్కువగా శ్రమించాలి. మెయిన్స్‌కు అందుబాటులో ఉన్న మూడు నెలల సమయాన్ని ఉపయోగించుకుంటూ.. రైటింగ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. తాజా పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ నోట్ చేసుకోవాలి.

**- బి.కృష్ణారెడ్డి**, పోటీపరీక్షల నిపుణులు.

---

## ఉద్యోగ సమాచారం

### అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో ఖాళీలు

సంగారెడ్డి (తెలంగాణ) కేంద్రంగా.. అంగన్‌వాడీ కేంద్రాలతో కలిసి పూర్వ ప్రాథమిక విద్య (ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్)లో నాణ్యతను మెరుగుపరచడానికి కృషిచేస్తున్న అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం ప్రకటన వెలువడింది.

- **అర్హత:** ఏదైనా సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ లేదా డిగ్రీతో పాటు డీ.ఎడ్/బీ.ఎడ్ పూర్తిచేసి కన్నడ, తెలుగులో స్పష్టంగా మాట్లాడగలిగిన వారు అర్హులు.
- **పని ప్రదేశం:** ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు సంగారెడ్డి, నార్త్ ఈస్ట్ కర్ణాటకలోని పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.29 వేలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.azimpremjifoundation.org

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
Google Play
App Store
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

## ఐఐటీలో.. బీటెక్ డేటాసైన్స్!

కెరీర్ గైడెన్స్



**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)-మండి, డేటాసైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌తో బీటెక్ ప్రోగ్రామ్‌ను అందించనుంది. వచ్చే విద్యాసంవత్సరం(2019-20) నుంచి ఈ కోర్సును ప్రారంభించనుంది. దీంతో డేటాసైన్స్ స్పెషలైజేషన్‌తో బ్యాచిలర్ డిగ్రీ స్థాయి కోర్సు అందిస్తున్న తొలి ఐఐటీగా గుర్తింపు పొందింది ఐఐటీ మండి. ఈ నేపథ్యంలో డేటాసైన్స్ కోర్సు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం..**

### అకడమిక్ ప్రాధాన్యం

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వ్యాపారాలు, సంస్థల నిర్వహణలో డేటాసైన్స్ నిపుణుల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. దాంతో ఐఐటీలు సైతం బీటెక్‌లో డేటాసైన్స్ స్పెషలైజేషన్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. తాజాగా ఇండియాలో నిర్వహించిన ఓ సర్వేలో డేటాసైన్స్ విభాగం వేగంగా వృద్ధి చెందుతున్నట్లు వెల్లడైంది. డేటాసైన్స్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో ఐఐటీ మండి అందించే బీటెక్ డేటాసైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులో భాగంగా.. కంప్యూటర్‌సైన్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, అప్లయిడ్ మ్యాథమెటిక్స్, మెషిన్ లెర్నింగ్ తదితర ఆధునిక టెక్నాలజీపై శిక్షణ ఇవ్వనుంది.

### అన్ని రంగాల్లో కీలకంగా డేటా

ఐటీ, ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్ కేర్, రిటైల్, టెలికం, ఆయిల్ అండ్ గ్యాస్, ఎయిర్ లైన్, ఇ-కామర్స్.. ఇలా అన్ని రంగాల్లోని సంస్థల నిర్వహణలో డేటా అత్యంత కీలకంగా మారుతోంది. డేటా విశ్లేషణ ఆధారంగానే కంపెనీలు కీలక వ్యాపార నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఆ క్రమంలో సదరు కంపెనీలు డేటాసైంటిస్ట్‌లను నియమించుకోవడంపై దృష్టిసారించాయి. ప్రస్తుతం డేటాసైన్స్ విభాగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మన దేశంలో కోడింగ్ పరిజ్ఞానం కలిగిన యువత పెద్దసంఖ్యలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో యువతకు డేటాసైన్స్ ఆకర్షణీయ కెరీర్‌గా నిలుస్తోంది.

### కెరీర్ స్టార్ట్

డేటాసైన్స్‌లో కెరీర్‌ను ప్రారంభించేందుకు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో రెండింటిని ప్రధానంగా చెప్పుకోవచ్చు. అవి.. ఒకటి, డేటాసైన్స్‌లో మాస్టర్స్ చేయడం, రెండోది, మూక్స్ విధానంలో డేటాసైన్స్‌పై అవగాహన పెంచుకోవడం. మాస్టర్స్ స్థాయి కోర్సు పూర్తిచేసి.. డేటాసైన్స్ విభాగంలో సమున్నత కెరీర్‌ను అందుకోవచ్చు. అదేవిధంగా మూక్స్ కోర్సుల ద్వారా డేటా సైన్స్ సంబంధిత అంశాల్లో నైపుణ్యం సాధించి..ఈ విభాగంలో అవకాశాలను అందుకునే వీలుంది. ఈ దిశగా కోర్సెరా, ఈడీఎక్స్, ఉడేమీ తదితర వేదికలు అందుబాటులో ఉన్నాయి.

### కావల్సిన లక్షణాలు

డేటాసైన్స్ ఔత్సాహికులకు తెలుసుకోవాలనే తృష్ణ, కష్టపడే తత్వం ఉండాలి. అకడెమిక్స్ పరంగా ఆయా సబ్జెక్టులపై పట్టుండాలి. నూతన టెక్నాలజీ, అల్గారిథమ్స్‌పై నిత్యం ఆసక్తిని ప్రదర్శించి..కొత్త విషయాలు తెలుసుకునే తపన తప్పనిసరి. మ్యాథ్స్‌లో పట్టు, కోడింగ్‌పై అవగాహన ఉన్న వారు డేటాసైన్స్‌లో ప్రవేశించి రాణించే వీలుంది. అలాగే డేటాసైన్స్ రంగంలో.. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్నవారు, ఇంజనీర్లు మాత్రమే రాణించగలరనేది అపోహ మాత్రమే అంటున్నారు నిపుణులు. చాలా మంది నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులు సైతం డేటాసైన్స్‌లో ముందంజలో నిలుస్తున్నారు. డొమైన్ నాలెడ్జ్ ఉన్నవారెవరైనా ఆయా రంగంలో రాణించగలరు.

### సవాళ్లు

- డొమైన్ నాలెడ్జ్‌తోపాటు అనుబంధ నైపుణ్యాలైన మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైథాన్, ఎస్‌క్యూఎల్, ఎస్ఏఎస్, బిగ్‌డేటా టూల్స్‌పై పట్టున్న వారికి జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది.
- అభ్యర్థులు ఈ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలంటే.. నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవరచుకోవాలి. తరగతిగదిలో థియరీపై అవగాహన కలిగేలా బోధన ఉంటుంది. కానీ, వాస్తవ పని అనుభవంతోనే డొమైన్, బిజినెస్‌పై అవగాహన ఏర్పడుతుంది.
- డేటా సైంటిస్టులకు డిమాండ్ వేగంగా పెరుగుతున్నా..దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లు ఆ స్థాయిలో కోర్సులు నిర్వహించడం లేదు. దీంతోపాటు ఈ డొమైన్‌లో అర్హత కలిగిన ఫ్యాకల్టీ చాలా తక్కువ మంది ఉన్నారు. ఫలితంగా డేటాసైన్స్ నిపుణుల కొరత నెలకొంది.
- ప్రస్తుతం డేటాసైన్స్ ఔత్సాహికుల్లో కనిపిస్తున్న ప్రధాన లోపం.. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌ను సరిగా అనువర్తించలేకపోవడం! సింటాక్స్ స్థాయిలో మెషిన్ లెర్నింగ్ నేర్చుకొని మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌పై దృష్టిసారించకపోవడంతో ఈ సమస్య వస్తోంది. కాబట్టి ఔత్సాహికులు మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌పై పట్టుసాధించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### కొలువులకు వేదికలు..

డేటాసైన్స్ నిపుణులకు ప్రముఖ కంపెనీలు కొలువులు అందిస్తున్నాయి. వాటిలో కొన్ని..

యాక్సెంచర్ ➠ ఆటోస్ ➠ ఏంజెల్ బ్రోకింగ్ ➠ హెచ్‌డీఎఫ్‌సీ ➠ డెలాయిట్ ➠ క్రెడిట్ విద్య ➠ ఐబీఎం ➠ ఆదిత్య బిర్లా ➠ ఈగెన్ టెక్నాలజీస్ ➠ డేటాఫార్చ్యూన్ ➠ విజ్‌మైండ్స్ ➠ ఇన్ఫోటెక్ ➠ వాల్యూడైరెక్ట్.



సాక్షి స్పోర్ట్స్
గురువారం
13-6-2019

## భారత్ సెమీస్ ప్రత్యర్థి జపాన్

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో భారత సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలింది. భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన క్రాస్ ఓవర్ మ్యాచ్‌లో ఆసియా క్రీడల చాంపియన్ జపాన్ 6–2తో పోలాండ్‌ను ఓడించింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో భారత్‌తో పోరుకు సిద్ధమైంది. మరో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 2–1తో రష్యాపై విజయం సాధించి శుక్రవారం జరిగే సెమీఫైనల్లో అమెరికాతో ఆడనుంది.

# భారత్‌కు బలపరీక్ష

### నేడు న్యూజిలాండ్‌తో పోరు

- ధావన్ లేకుండా బరిలోకి
- ఓపెనర్‌గా రాహుల్
- మ్యాచ్‌కు వర్ష సూచన
- నాలుగో విజయంపై కివీస్ దృష్టి

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో అగ్రశ్రేణి టీమ్‌లను ఓడించిన భారత్ ఇప్పుడు మరో ప్రధాన జట్టును ఓడించడంపై గురి పెట్టింది. టోర్నీలో మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్‌ను టీమిండియా ఎదుర్కోనుంది. బలాబలాలపరంగా చూస్తే ఇటీవలే కివీస్‌ను వారి సొంతగడ్డపై వన్డే సిరీస్‌లో చిత్తుగా ఓడించిన కోహ్లి సేనదే పైచేయిగా కనిపిస్తున్నా... ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్ ఎప్పుడైనా ప్రమాదకర జట్టే. అయితే అన్నింటికి మించి ఓపెనర్ శిఖర్ ధావన్ లేని జట్టు తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త వ్యూహంతో బరిలోకి దిగాల్సి వస్తోంది. ఇన్నేళ్లుగా జట్టు విజయాల్లో కీలకంగా నిలిచిన ధావన్ లేకుండా బలపరీక్షకు సిద్ధమైన కోహ్లి సేన అదే తరహా జోరు ప్రదర్శించగలదా? కూర్పులో మార్పు వల్ల జట్టు లయ దెబ్బతింటుందా? చూడాలి!





రాహుల్

**నాటింగ్‌హామ్:** ఇంగ్లండ్ గడ్డపై అడుగు పెట్టిన తర్వాత సన్నాహాల్లో భాగంగా ప్రాక్టీస్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో భారత్ చిత్తుగా ఓడింది. ఇరవై రోజుల క్రితం ఆ మ్యాచ్ ఫలితం మనపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఆ తర్వాత అసలు పోరులో మన టీమ్ సత్తా చూపింది. ఇక ఇప్పుడు అసలు సమరంలో గెలిస్తే భారత్‌కు టోర్నీ లో తిరుగుండదు. మరోవైపు రెండు మ్యాచ్‌లలో బలహీన శ్రీలంక, అఫ్గానిస్తాన్‌లపై నెగ్గిన కివీస్... అతి కష్టమ్మీద బంగ్లాను ఓడించింది. ఈ నేపథ్యంలో భారత్‌లాంటి టీమ్‌తో ఆ జట్టుకు పెను సవాల్ ఎదురవుతోంది.

### నాలుగో స్థానంలో ఎవరు?

ముందుగా దక్షిణాఫ్రికాపై, ఆ తర్వాత ఆస్ట్రేలియాపై కూడా భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. అన్ని విభాగాల్లో ఆటగాళ్లు ఒకరితో మరొకరు పోటీ పడి చక్కటి ప్రదర్శన కనబర్చారు. రోహిత్, ధావన్‌లు సెంచరీలు చేయగా, కోహ్లి గత మ్యాచ్‌లో తన స్థాయికి తగినట్లుగా ఆడాడు. హార్దిక్ పాండ్యా మెరుపు బ్యాటింగ్ అదనపు బలం కాగా, ధోని కూడా చక్కటి స్ట్రోక్స్ ఆడుతున్నాడు. కేదార్ జాదవ్‌కు ఇంకా బ్యాటింగ్ అవకాశం సరిగా రాలేదు. బౌలింగ్‌లో కూడా నలుగురు రెగ్యులర్ బౌలర్లు తమ పాత్రను సమర్థంగా పోషించగా... పాండ్యా, జాదవ్ కలిసి ఐదో బౌలర్ కోటాను ఇబ్బంది లేకుండా పూర్తి చేయగలిగారు. మొత్తంగా జట్టులో లోపాలేవీ కనిపించడం లేదు. అయితే ఇప్పుడు అందరి దృష్టి ధావన్‌కు బదులుగా వచ్చే ఆటగాడిపైనే ఉంది. లోకేశ్ రాహుల్ ఓపెనింగ్ చేయడం ఖాయమైపోయింది. ఓపెనర్ పాత్ర అతనికి కొత్త కాదు. నిజానికి ప్రపంచకప్‌కు ఎంపిక చేసినప్పుడు కూడా సెలక్టర్లు మూడో ఓపెనర్‌గానే చూశారు. కెరీర్‌లో అతని ఏకైక సెంచరీ ఓపెనర్‌గానే సాధించాడు. ఇప్పుడు కీలకమైన ప్రపంచ కప్ మ్యాచ్‌లో అతను రోహిత్‌తో కలిసి ఎలాంటి ఆరంభం ఇస్తాడనేది చూడాలి. మరోవైపు రాహుల్‌కు బదులుగా మిడిలార్డర్‌లో ఎవరికి అవకాశం దక్కుతుందో చెప్పలేని పరిస్థితి. బుధవారం నెట్స్‌లో విజయ్ శంకర్ ఎక్కువసేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. కానీ దినేశ్ కార్తీక్ అవకాశాలను కూడా కొట్టి పారేయలేం. వార్మప్ మ్యాచ్ తరహా వాతావరణమే ఎదురయ్యే అవకాశం ఉండటంతో బౌల్ట్‌ను భారత బ్యాట్స్‌మెన్ సమర్థంగా ఎదుర్కోవడం ముఖ్యం.

**57**

కోహ్లి మరో 57 పరుగులు చేస్తే అందరికంటే వేగంగా (222 ఇన్నింగ్స్‌లలో) వన్డేల్లో 11 వేల పరుగులు పూర్తి చేసుకుంటాడు. సచిన్ 276 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయి దాటాడు.

### మిడిలార్డర్ కీలకం...

న్యూజిలాండ్ కూడా మూడు విజయాలతో అమితోత్సాహంతో ఉంది. అయితే ఆ జట్టుకు కూడా సొంత సమస్యలు ఉన్నాయి. కివీస్‌కు ఓపెనింగ్ ప్రధాన సమస్యగా మారింది. గత కొన్నేళ్లలో ఏ జోడి కూడా భారీ భాగస్వామ్యాలు నమోదు చేయలేదు. గప్టిల్ గత రెండు మ్యాచ్‌లలోనూ విఫలమయ్యాడు. భారత్‌తో సిరీస్‌లో విఫలమైన మున్రోను పక్కన పెట్టి నికోల్స్‌ను మరో ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. టీమ్ బరువు బాధ్యతలన్నీ ఇప్పుడు విలియమ్సన్, రాస్ టేలర్‌లపైనే ఆధారపడి ఉన్నాయి. మరోసారి వీరిద్దరు రాణిస్తే కివీస్‌కు గెలుపు అవకాశాలు ఉంటాయి. లాథమ్, నీషమ్ కూడా రాణించడం అవసరం. బౌలింగ్‌లో ప్రధాన బలం ట్రెంట్ బౌల్ట్. అతను చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పవు. 145 కిలోమీటర్లకు తగ్గకుండా బౌలింగ్ చేస్తున్న ఫెర్గూసన్ కూడా ప్రత్యర్థికి ఇబ్బందులు సృష్టించగలడు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, రాహుల్, దినేశ్ కార్తీక్/విజయ్ శంకర్, పాండ్యా, ధోని, జాదవ్, భువనేశ్వర్, కుల్దీప్, చహల్, బుమ్రా. **న్యూజిలాండ్:** విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, నికోల్స్, టేలర్, లాథమ్, నీషమ్, సాన్‌ట్నర్, గ్రాండ్‌హోమ్, సౌతీ, ఫెర్గూసన్, బౌల్ట్.

### పిచ్, వాతావరణం

గత కొన్నేళ్లుగా పరుగుల వరద పారిన మైదానం. ఈ వరల్డ్ కప్‌లో కూడా రెండు మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. బౌండరీలు చిన్నవి కాబట్టి బ్యాట్స్‌మెన్ చెలరేగిపోవచ్చు. అయితే మేఘావృత వాతావరణం కారణంగా స్వింగ్ బౌలర్లకూ మంచి అవకాశముంది. దాంతో బ్యాట్‌కు, బంతికి మధ్య సమాన పోరు జరిగేందుకు ఆస్కారముంది. గురువారం నాటింగ్‌హామ్‌లో వర్ష సూచన ఉంది. ఆటకు అంతరాయం కలగవచ్చు.

## భారత పురుషుల ఆర్చరీ జట్టుకు ‘టోక్యో’ బెర్త్



**ఎస్‌–హెర్టోగెన్‌బాష్ (నెదర్లాండ్స్):** ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడం ద్వారా భారత పురుషుల రికర్వ్ జట్టు వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ రమేశ్ జాదవ్‌లతో కూడిన భారత బృందం ప్రిక్వార్టర్ ఫైనల్లో 5–3తో కెనడా జట్టును ఓడించింది. మరోవైపు దీపిక, బొంబేలా దేవి, కోమలికలతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్లో 2–6తో బెలారస్ చేతిలో ఓడింది. తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది.

## పంత్ ఇంగ్లండ్ పయనం

**భారత మేనేజ్‌మెంట్ ముందుజాగ్రత్త • జూన్ 30లోగా ధావన్ కోలుకునే అవకాశం**

**నాటింగ్‌హామ్:** ఓపెనర్ శిఖర్ ధావన్ అనూహ్యంగా గాయపడటంతో భారత టీమ్ మేనేజ్‌మెంట్ ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టింది. అవసరమైతే మరో ఆటగాడు అందుబాటులో ఉంటే మంచిదని భావిస్తూ అందుకోసం యువ ఆటగాడు రిషభ్ పంత్‌ను ఎంపిక చేసింది. ప్రపంచ కప్ జట్టును ఎంపిక చేసిన సమయంలో ప్రకటించిన రిజర్వ్ ఆటగాళ్లలో పంత్ కూడా ఒకడు. రిషభ్ గురువారం సాయంత్రం ఇంగ్లండ్ చేరుకుంటాడు. అయితే గాయం నుంచి కోలుకునే వరకు ధావన్‌ను జట్టుతోనే కొనసాగించాలని భారత్ నిర్ణయించుకున్న నేపథ్యంలో ఐసీసీ నిబంధనల ప్రకారం పంత్ టీమిండియాతో చేరే అవకాశం లేదు. అతను జట్టుతో ఉండకుండా మాంచెస్టర్‌లో ఉంటాడని, ప్రస్తుతానికి పంత్ ‘స్టాండ్ బై’ మాత్రమేనని, ధావన్ స్థానంలో ఎంపిక చేయలేదని బీసీసీఐ ప్రకటించింది. గత ఏడాది కాలంగా అద్భుత ఫామ్‌లో ఉన్న పంత్‌ను ప్రపంచకప్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. అయితే కుర్ర పంత్‌కంటే అనుభవజ్ఞుడైన దినేశ్ కార్తీక్‌కే ప్రాధాన్యమిచ్చామని చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వివరణ ఇచ్చారు.

### మరో రెండు మ్యాచ్‌లకు...

ప్రస్తుతం ధావన్ గాయాన్ని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. అతని గాయంపై పూర్తిగా స్పష్టత వచ్చేందుకు మరో 10–12 రోజులు పడుతుందని బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ వెల్లడించారు. ముందుగా అనుకున్నట్లు కివీస్, పాక్ మ్యాచ్‌లకే కాకుండా 22, 27 తేదీల్లో అఫ్గానిస్తాన్, వెస్టిండీస్‌లతో జరిగే మ్యాచ్‌లు కూడా ధావన్ ఆడే అవకాశం కనిపించడం లేదు. అయితే 30లోగా అతను పూర్తిగా కోలుకోవచ్చని వైద్యులు టీమ్ మేనేజ్‌మెంట్‌కు చెప్పినట్లు సమాచారం. వరల్డ్ కప్‌లో అతి పెద్ద మ్యాచ్‌గా భావిస్తున్న భారత్, ఇంగ్లండ్ మధ్య పోరు ఈ నెల 30న బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో శిఖర్ బరిలోకి దిగితే చాలని భారత్ కోరుకుంటోంది.



## ‘రెక్కలతో కాదు... సంకల్పంతో ఎగురుతా’

### శిఖర్ ధావన్ భావోద్వేగం



**నాటింగ్‌హామ్:** గాయం కారణంగా రాబోయే ప్రపంచకప్ మ్యాచ్‌లకు దూరమైన శిఖర్ ధావన్ తన ప్రతిస్పందనను కవితా రూపంలో వెల్లడించాడు. గాయం తనను దెబ్బ తీయలేదనే ఉద్దేశం అతని మాటల్లో కనిపించింది. ప్రఖ్యాత ఉర్దూ రచయిత రాహత్ ఇందోరీ రాసిన పంక్తిని అతను ట్విట్టర్ ద్వారా పంచుకున్నాడు. ‘కభీ మహక్ కీ తరహ్ హమ్ గులోన్‌సే ఉడ్తే హై.. కభీ ధుయే కీ తరహ్ పర్బతోన్‌సే ఉడ్తే హై..యే కైంచియా హమే ఉడ్నే సే ఖాఖ్ రోకేంగీ.. కే హమ్ పరోన్‌సే నహీ హౌస్‌లోన్‌సే ఉడ్తే హై’ (పూలల్లో ఉండే సువాసనలా ఒకసారి, పర్వతాల మీదుగా వెళ్లే పొగమంచులా మరోసారి ఎగురుకుంటూ వెళ్లిపోతాను. నేను ఎగరకుండా ఈ కత్తెరలు ఏం ఆపగలవు. నేను ఎగిరేది రెక్కలతో కాదు, సంకల్పంతో) అని ధావన్ తన భావాన్ని పంచుకున్నాడు. తన కవితతో ధావన్ స్ఫూర్తి పొందే ప్రయత్నం చేయగా... స్వయంగా రాహత్ ఇందోరీ వెంటనే మరో కవితతో స్పందించడం విశేషం. ‘సెలయేటికి తన అస్తిత్వంపై చాలా గర్వం ఉంది. దాహంతో ఉన్న నాతో పెట్టుకుంటే తన సంగతేమౌతుందో తెలియదా’ (బహుత్ గురూర్ హై దరియాకో అప్నే హోనేపర్. జో మేరీ ప్యాస్ సే ఉల్‌ఝేతో ధజ్జియా ఉడ్‌జాయే, జిందాబాద్) అంటూ మరింతగా ప్రోత్సహించే ప్రయత్నం చేశారు.



వార్నర్

## పాక్ తొడగొట్టినా...
# ఆసీస్ పడగొట్టింది

**41 పరుగులతో ఫించ్ బృందం గెలుపు**

- సెంచరీతో మెరిసిన డేవిడ్ వార్నర్
- ఆమిర్ అద్భుత బౌలింగ్ వృథా

**టాంటన్:** ఈ ప్రపంచ కప్‌లో మరో సంచలన విజయం సాధించే అవకాశాన్ని పాకిస్తాన్ కాలదన్నుకుంది. తొలుత బౌలింగ్‌లో పుంజుకుని ప్రత్యర్థిని కట్టడి చేసిన ఆ జట్టు... బ్యాటింగ్‌లో మంచి స్థితిలో ఉండీ గెలుపును చేజార్చుకుంది. దీంతో ఆస్ట్రేలియాతో బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 41 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ ఓపెనర్ డేవిడ్ వార్నర్ (111 బంతుల్లో 107; 11 ఫోర్లు, సిక్స్) శతకం బాదడంతో పాటు కెప్టెన్ ఆరోన్ ఫించ్ (84 బంతుల్లో 82; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించడంతో... టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. పేసర్ ఆమిర్ (5/30) ప్రత్యర్థికి కళ్లెం వేశాడు. ఛేదనలో పాక్ 45.4 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఇమాముల్ హక్ (75 బంతుల్లో 53; 7 ఫోర్లు), హఫీజ్ (46; 3 ఫోర్లు, సిక్స్) రాణించినా మిడిలార్డర్ వైఫల్యం దెబ్బకొట్టింది. టెయిలెండర్లు హసన్ అలీ (15 బంతుల్లో 32; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), వహాబ్ రియాజ్ (39 బంతుల్లో 45; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులకు కెప్టెన్ సర్ఫరాజ్ (48 బంతుల్లో 40; ఫోర్) అండగా నిలిచి పోరాడినా... పేసర్ స్టార్క్ (2/43) ఒకే ఓవర్లో రియాజ్, ఆమిర్ (0)లను ఔట్ చేసి ఆసీస్ విజయాన్ని ఖాయం చేశాడు. కమిన్స్ (3/33) పొదుపుగా బంతులేశాడు.



ఆమిర్

### ఆరంభం అదిరినా... చివర్లో చతికిల

146/0. రన్‌రేట్ 6.63. 22 ఓవర్లకు ఆసీస్ స్కోరిది. కానీ, 23వ ఓవర్ తొలి బంతికి ఫించ్‌ను ఔట్ చేసి ఆమిర్ మలుపు తిప్పాడు. వార్నర్ సహజ శైలిలో ఆడుతూ పోతుంటే... మరో ఎండ్‌లో స్మిత్ (10), మ్యాక్స్‌వెల్ (20), షాన్ మార్ష్ (23), ఖాజా (18) వెంటవెంటనే ఔటయ్యారు. 102 బంతుల్లో కెరీర్‌లో 15వ వన్డే సెంచరీ పూర్తి చేసుకున్న వార్నర్ ఎక్కువసేపు నిలువలేదు. కీపర్ అలెక్స్ క్యారీ (20)తో పాటు స్టార్క్ (3)ను చక్కటి బంతులతో డగౌట్ చేర్చిన ఆమిర్ 49వ ఓవర్లోనే ఆసీస్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. కంగారూలు తమ పది వికెట్లను 28 ఓవర్ల వ్యవధిలో 161 పరుగులకే కోల్పోయారు.

### ఛేదించేలా కనిపించి... చేజేతులా

ఫఖర్ జమాన్ (0)ను ఖాతా తెరవకుండానే ఔట్ చేసి ఛేదనలో పాక్‌కు కమిన్స్ షాకిచ్చాడు. ఇమాముల్, ఆజమ్ (28 బంతుల్లో 30; 7 ఫోర్లు) చకచకా బౌండరీలు బాదుతూ ఆశలు రేపారు. ఈ స్థితిలో బాబర్ అనవసర షాట్‌కు పోయి వికెట్ పారేసుకున్నాడు. ఇమాముల్, హఫీజ్ మూడో వికెట్‌కు 86 బంతుల్లో 80 పరుగులు జోడించడంతో పాక్ లక్ష్యం దిశగా సాగుతున్నట్లే కనిపించింది. కమిన్స్ ఓవర్లో లెగ్ సైడ్ వెళ్తున్న బంతిని వేటాడి ఇమాముల్, పార్ట్‌టైమర్ ఫించ్ బంతిని భారీ షాట్ ఆడబోయి హఫీజ్ వరుస ఓవర్లలో వెనుదిరగడం దెబ్బకొట్టింది. షోయబ్ మాలిక్ (0), ఆసిఫ్ అలీ (5) పేలవంగా నిష్క్రమించారు. 160/6తో పరాజయం అంచుల్లో ఉన్న జట్టును సర్ఫరాజ్, హసన్ అలీ, రియాజ్ మొండిగా నడిపించినా లాభం లేకపోయింది.

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** ఫించ్ (సి) హఫీజ్ (బి) ఆమిర్ 82; వార్నర్ (సి) ఇమాముల్ (బి) షాహీన్ 107; స్మిత్ (సి) ఆసిఫ్ అలీ (బి) హఫీజ్ 10; మ్యాక్స్‌వెల్ (బి) షాహీన్ 20; షాన్ మార్ష్ (సి) షోయబ్ మాలిక్ (బి) ఆమిర్ 23; ఖాజా (సి) వహాబ్ రియాజ్ (బి) ఆమిర్ 18; క్యారీ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆమిర్ 20; కూల్టర్ నైల్ (సి) సర్ఫరాజ్ (బి) రియాజ్ 2; కమిన్స్ (సి) సర్ఫరాజ్ (బి) హసన్ అలీ 2; స్టార్క్ (సి) షోయబ్ మాలిక్ (బి) ఆమిర్ 3; రిచర్డ్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 307.**

**వికెట్ల పతనం:** 1–146, 2–189, 3–223, 4–242, 5–277, 6–288, 7–299, 8–302, 9–304, 10–307. **బౌలింగ్:** ఆమిర్ 10–2–30–5; షాహీన్ అఫ్రిది 10–0–70–2; హసన్ అలీ 10–0–67–1; వహాబ్ రియాజ్ 8–0–44–1; హఫీజ్ 7–0–60–1; షోయబ్ మాలిక్ 4–0–26–0.

**పాకిస్తాన్ ఇన్నింగ్స్:** ఇమాముల్ హక్ (సి) క్యారీ (బి) కమిన్స్ 53; ఫఖర్ జమాన్ (సి) రిచర్డ్సన్ (బి) కమిన్స్ 0; బాబర్ ఆజమ్ (సి) రిచర్డ్సన్ (బి) కూల్టర్‌నైల్ 30; హఫీజ్ (సి) స్టార్క్ (బి) ఫించ్ 46; సర్ఫరాజ్ (రనౌట్) 40; షోయబ్ మాలిక్ (సి) క్యారీ (బి) కమిన్స్ 0; ఆసిఫ్ అలీ (సి) క్యారీ (బి) రిచర్డ్సన్ 5; హసన్ అలీ (సి) ఖాజా (బి) రిచర్డ్సన్ 32; వహాబ్ రియాజ్ (సి) క్యారీ (బి) స్టార్క్ 45; ఆమిర్ (సి) స్టార్క్ 0; షాహీన్ అఫ్రిది (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (45.4 ఓవర్లలో ఆలౌట్) 266.**

**వికెట్ల పతనం:** 1–2, 2–56, 3–136, 4–146, 5–147, 6–160, 7–200, 8–264, 9–265, 10–266. **బౌలింగ్:** కమిన్స్ 10–0–33–3, స్టార్క్ 9–1–43–2, రిచర్డ్సన్ 8.4–0–62–2, కూల్టర్‌నైల్ 9–0–53–1, మ్యాక్స్‌వెల్ 7–0–58–0, ఫించ్ 2–0–13–1.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 3 | 3 | 0 | 0 | 2.163 | 6 |
| ఆస్ట్రేలియా | 4 | 3 | 1 | 0 | 0.448 | 6 |
| ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | 1.307 | 4 |
| భారత్ | 2 | 2 | 0 | 0 | 0.539 | 4 |
| శ్రీలంక | 4 | 1 | 1 | 2 | -1.517 | 4 |
| వెస్టిండీస్ | 3 | 1 | 1 | 1 | 2.054 | 3 |
| బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.714 | 3 |
| పాకిస్తాన్ | 4 | 1 | 2 | 1 | -1.654 | 3 |
| దక్షిణాఫ్రికా | 4 | 0 | 3 | 1 | -0.952 | 1 |
| అఫ్గానిస్తాన్ | 3 | 0 | 3 | 0 | -1.493 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

## ‘రిజర్వ్ డే’ సాధ్యం కాదు

**వర్షంతో మ్యాచ్‌ల రద్దుపై ఐసీసీ వివరణ**

**లండన్:** ప్రపంచ కప్‌లో ఇప్పటికే మూడు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. మరికొన్ని మ్యాచ్‌లకు కూడా వర్షం ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో ఐసీసీ టోర్నీ నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో అన్ని మ్యాచ్‌లకు ‘రిజర్వ్ డే’ ఉంటే బాగుండేదని చాలా మంది అభిప్రాయపడ్డారు. అయితే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) దీనిపై పూర్తి స్థాయి వివరణ ఇచ్చింది. 45 లీగ్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉంచడం సాధ్యం కాదని... అది తీవ్ర శ్రమతో కూడుకున్న వ్యవహారమని స్పష్టం చేసింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు మాత్రం రిజర్వ్ డే ఉన్నట్లు వెల్లడించింది. ‘ప్రపంచకప్‌లో ప్రతీ మ్యాచ్‌కు రిజర్వ్ డే పెట్టడం సాధ్యం కాదు. రిజర్వ్ డే రోజున కూడా వర్షం పడదని ఎవరూ హామీ ఇవ్వలేరు’ అని ఐసీసీ వివరణ ఇచ్చింది.

# జూలై 15న చంద్రయాన్‌2

**చంద్రుడిపైకి రోవర్ పంపుతున్నాం • ఇస్రో చైర్మన్ కె.శివన్ వెల్లడి**





బెంగళూరులో చంద్రయాన్‌-2 ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైన శాస్త్రవేత్తలు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతున్న శివన్

**బొమ్మనహళ్లి(బెంగళూరు)/సూళ్లూరుపేట:** చంద్రుడిపైకి రెండో మిషన్‌లో భాగంగా చంద్రయాన్‌–2ని జూలై 15న ప్రయోగిస్తామని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ కె.శివన్ వెల్లడించారు. సెప్టెంబర్ 6 లేదా 7వ తేదీల్లో చంద్రుడి దక్షిణ ధ్రువంపై రోవర్ దిగుతుందని బుధవారం ఆయన వెల్లడించారు. భారత అంతరిక్ష ప్రయోగాలలో ఈ ప్రయోగం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నామని ఆయన వెల్లడించారు. జూలై 15వ తేదీ తెల్లవారుజామున 2.51 గంటలకు జీఎస్‌ఎల్‌వీ ఎంకే–3 రాకెట్ సాయంతో ఈ మిషన్‌ను ప్రారంభిస్తామని, ఈ ప్రయోగం ద్వారా మీటరు పొడవైన 25 కేజీల బరువున్న రోవర్, ఆర్బిటర్, లాండర్లను చంద్రుడిపైకి పంపనున్నట్లు తెలిపారు. చంద్రయాన్–2 మొత్తం బరువు 3.8 టన్నులని, ఇస్రో ప్రయోగిస్తున్న లాండర్, రోవర్ దిగే దక్షిణ ధ్రువ ప్రదేశానికి ఇంతవరకు ఏ దేశానికి చెందిన ఉపగ్రహాలు చేరలేదని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకోసం ఇస్రో వద్ద ఉన్న అత్యంత శక్తివంతమైన జీఎస్‌ఎల్‌వీ ఎంకే–3 రాకెట్‌ను వాడుతున్నారు. ఆర్బిటర్ ప్రొపెలైజేషన్ విధానంలో ఈ మూడు పరికరాలు చంద్రుడి కక్ష్యలోకి చేరతాయి. అక్కడ ఆర్బిటర్ నుంచి లాండర్ విడిపోయి చంద్రుడివైపు దూసుకెళుతుంది. ఆర్బిటర్ నుంచి లాండర్ విడిపోవడం ఈ ప్రాజెక్టులో కీలక ఘట్టంగా భావిస్తున్నారు. విడిపోయిన అనంతరం ఆర్బిటర్ నిర్దేశిత కక్ష్యలో తిరుగుతుంది. మరోపక్క లాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై నిర్దేశిత ప్రాంతంలో దిగుతుంది. లాండర్ క్షేమంగా లక్ష్యాన్ని చేరుకున్నాక దానిలోంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడిపై పరిశోధనలు చేస్తుంది. ఈ రోవర్ ప్రయోగాలు చేయడానికి అవసరమైన పరికరాలను కూడా లాండర్ పైభాగంలో అమర్చారు. రోవర్ సాయంతో చంద్రుడి ఉపరితలం, ఖనిజాలు వంటి వాటిని అన్వేషిస్తారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు రూ.1,000 కోట్లుకాగా, చంద్రయాన్ –2 కోసం రూ. 603 కోట్లు ఖర్చుకానుంది. ఇందులో జీఎస్‌ఎల్‌వీ ఎంకే–3 కోసం రూ.375 కోట్లు వెచ్చించనున్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే సెప్టెంబర్ నుంచి ఇది ఇస్రోకు సంకేతాలను పంపుతుందని శివన్ వెల్లడించారు.

## స్క్రామ్‌జెట్ పరీక్ష సక్సెస్



**బాలాసోర్:** హైపర్‌సోనిక్ టెక్నాలజీ డెమానిస్ట్రేటర్ వెహికల్(హెచ్‌ఎస్‌టీడీవీ) అనే మానవరహిత విమానాన్ని భారత్ విజయవంతంగా పరీక్షించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ స్క్రామ్‌జెట్ విమానాన్ని ఒడిశాలోని కలామ్ ద్వీపం నుంచి బుధవారం ఉదయం డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. హెచ్‌ఎస్‌టీడీవీ ఓ పునర్వినియోగ వాహనమనీ, దీంతో ఉపగ్రహాలను చవకగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టవచ్చని రక్షణరంగ నిపుణుడొకరు చెప్పారు. దీంతో శత్రుదేశాలపై క్రూయిజ్ క్షిపణులనూ ప్రయోగించవచ్చన్నారు. హెచ్‌ఎస్‌టీడీవీ 20 సెకన్లలో 32.5 కి.మీ ఎత్తుకు చేరుకోగలదనీ, గంటకు 7,408 కి.మీ(6 మ్యాక్‌ల) వేగంతో దూసుకుపోగలదన్నారు. తాజాగా ప్రయోగంతో ఇలాంటి సాంకేతికత ఉన్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరిందన్నారు. హెచ్‌ఎస్‌టీడీ తొలుత ఘనఇంధన మోటార్‌తో నిర్ణీత ఎత్తులోకి చేరుకుంటుంది. సరైన వేగం అందుకున్నాక హెచ్‌ఎస్‌టీడీలోని క్రూయిజ్ వాహనం విడిపోతుందనీ, స్క్రామ్‌జెట్ ఇంజిన్‌ను మండించడం ద్వారా ఇది లక్ష్యం దిశగా దూసుకెళుతుందని పేర్కొన్నారు.

# గుజరాత్‌కు ‘వాయు’ గండం

**పెను తుపానుతో భారీ వర్షాలు, గంటకు 170 కి.మీ.ల వేగంతో గాలులకు అవకాశం**

- కచ్, సౌరాష్ట్రల్లోని 3 లక్షల మంది ప్రజల తరలింపు
- 70 రైళ్లు రద్దు.. 400 విమానాల రాకపోకలకు అంతరాయం





వెరావల్‌లో తీరం వెంట ఎగసిపడుతున్న భారీ అలలు. జామ్‌నగర్‌కు విమానంలో బయల్దేరిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు

**న్యూఢిల్లీ/అహ్మదాబాద్:** ఉత్తరభారతంలో ఒకవైపు సూర్యుడి ప్రతాపంతో జనం అల్లాడుతుండగా మరోవైపు ‘వాయు’తుపాను గుజరాత్ వైపు ప్రచండ వేగంతో దూసుకువస్తోంది. గుజరాత్ తీరంలోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతంపై ‘వాయు’ ప్రభావం మరో 24 గంటలు ఉంటుందని, భారీ వర్షాలు కురియడంతోపాటు గంటకు 170 కిలోమీటర్ల వేగంతో తీవ్రగాలులు వీస్తాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్తగా తీరం ప్రాంతాల్లోని పది జిల్లాల లోతట్టు ప్రాంతాలకు చెందిన 3 లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఎన్‌డీఆర్‌ఎఫ్, సైన్యం, నావికాదళం, వాయుసేన ప్రభావిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. ప్రభుత్వం, స్థానిక విభాగాలు అందించే సూచనలు, సలహాలను పాటించి సురక్షితంగా ఉండాలని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పార్టీ శ్రేణులను ట్విట్టర్‌లో కోరారు.

**వాతావరణ శాఖ హెచ్చరిక**

‘వాయు’తుపాను అతితీవ్రంగా మారనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పోర్‌బందర్, కేంద్ర పాలిత ప్రాంతం డయ్యూల మధ్య గురువారం ఉదయం భారీ వర్షం కురుస్తుందని తెలిపింది. తీరం దాటిన తర్వాత తుపాను సాధారణంగా బలహీన పడుతుంది. ఇందుకు విరుద్ధంగా, ‘వాయు’మరింత తీవ్రంగా మారనుందని తెలిపింది. వెరావల్‌కు దక్షిణంగా 280 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న ‘వాయు’ గురువారం మధ్యాహ్నం వెరావల్, దక్షిణ ద్వారక మధ్య తీరాన్ని తాకే అవకాశముందని తెలిపింది. అరేబియా సముద్రంలో అలలు ఉవ్వెత్తున లేచి తీరాన్ని తాకుతాయని తెలిపింది.

**అధికార యంత్రాంగం అప్రమత్తం**

తుపాను హెచ్చరికలతో గుజరాత్, డయ్యూ యంత్రాంగాలతోపాటు కేంద్రం అప్రమత్తమైంది. జాతీయ విపత్తు నిర్వహణ సహాయ దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్), సైన్యం ప్రభావిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. యుద్ధ నౌకలు, నావికా దళ విమానాలను కూడా సిద్ధం చేశారు. తీరంలోని నౌకాశ్రయాలను ముందు జాగ్రత్తగా మూసివేయాలని ఆదేశించినట్లు ప్రభుత్వం పేర్కొంది. పోర్‌బందర్, డయ్యూ, భావ్‌నగర్, కెశోద్, కాండ్లా ఎయిర్‌పోర్ట్‌లను 13వ తేదీ అర్ధరాత్రి వరకు మూసివేస్తున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని కొన్ని బస్ సర్వీసులను రద్దు చేసింది. విద్యా సంస్థలకు 12, 13 తేదీల్లో సెలవులిచ్చారు. ఇప్పటికే 70 రైళ్లు రద్దుచేశారు. వచ్చే రెండు రోజులపాటు కొన్ని రైళ్లను రద్దు చేయడమో లేక దారిమళ్లించడమో చేస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ముంబైకి రాకపోకలు సాగించే 400 విమానాలకు అంతరాయం కలిగింది.

## రణరంగంగా మారిన కోల్‌కతా

**టీఎంసీ దాడులకు నిరసనగా బీజేపీ భారీ ర్యాలీ**



బారికేడ్లు పడేస్తున్న బీజేపీ కార్యకర్తలు

**కోల్‌కతా:** సార్వత్రిక ఎన్నికల అనంతరం బీజేపీ కార్యకర్తలపై అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) శ్రేణుల దాడులను నిరసిస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు కోల్‌కతాలో భారీసంఖ్యలో ఆందోళనకు దిగారు. కోల్‌కతాలోని వెల్లింగ్టన్ ప్రాంతం నుంచి లాల్‌బజార్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి ర్యాలీగా బయల్దేరారు. వీరిని బౌబజార్‌లో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ఆందోళనకారులపై వాటర్ కేనన్లు, భాష్పవాయువును ప్రయోగించారు. దీంతో ఒక్కసారిగా రెచ్చిపోయిన బీజేపీ శ్రేణులు పోలీసులపై రాళ్లు, గాజుసీసాలు విసిరాయి. తోపులాటలో బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజు బెనర్జీతో పాటు పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. ఆందోళనలో 18 మంది బీజేపీ ఎంపీలు పాల్గొన్నారు. బీజేపీ శ్రేణులపై దాడులకు నిరసనగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ, బెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్, ఇతర సీనియర్ నేతలు బౌబజార్ కూడలిలో ఆందోళనకు దిగారు. తమ కార్యకర్తలు ఎవరూ పోలీసులపై దాడి చేయలేదనీ, పోలీసులే రాళ్లు, గాజు సీసాలు విసిరారని విజయవర్గీయ ఆరోపించారు.

**అఖిలపక్ష భేటీకి గవర్నర్ పిలుపు**

పశ్చిమబెంగాల్‌లో శాంతిభద్రతలు అదుపుతప్పే పరిస్థితి ఏర్పడటంతో గవర్నర్ కేసరినాథ్ అఖిలపక్ష భేటీకి పిలుపునిచ్చారు. రాజ్‌భవన్‌లో గురువారం సాయంత్రం జరిగే ఈ భేటీకి రావాలని టీఎంసీ, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలను ఆహ్వానించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరవుతామని బీజేపీ, టీఎంసీ ప్రకటించగా, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు తమ నిర్ణయాన్ని తెలియజేయలేదు.

## లోక్‌సభలో బీజేపీ నేతగా మోదీ

- ఉపనేతగా రాజ్‌నాథ్‌సింగ్
- పార్లమెంటరీ పార్టీ భేటీ

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో బీజేపీ నేతగా ప్రధాని మోదీ, ఉపనేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నియమితులయ్యారు. బుధవారం ఇక్కడ సమావేశమైన బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకుంది. రాజ్యసభలో అధికార పార్టీ నేతగా బీజేపీకి చెందిన దళిత నేత, కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్, ఉపనేతగా పీయూష్ గోయెల్ నియమితులయ్యారు. చీఫ్ విప్‌గా సంజయ్ జైస్వాల్‌తోపాటు ప్రథమంగా ముగ్గురు మహిళా ఎంపీలను, వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 15 మంది లోక్‌సభ సభ్యులను విప్‌లుగా నియమించింది. రాజ్యసభ నుంచి కూడా ఆరుగురిని విప్‌లుగా ప్రకటించింది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా లోక్‌సభ సభ్యులు గడ్కరీ, రవి శంకర్, అర్జున్ ముండా, నరేంద్ర తోమర్, జువల్ ఓరమ్, స్మృతీ ఇరానీ హాజరయ్యారు. అలాగే, రాజ్యసభ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా జేపీ నడ్డా, ఓ ప్రకాశ్ మాథుర్, నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రకాశ్ జవడేకర్ పాల్గొన్నారు. ఎంపీలు కానందున మొదటిసారిగా ఈ కమిటీలో సభ్యులు కాని అగ్ర నేతలు, ఎల్‌కే అడ్వాణీ, మురళీ మనోహర్ జోషి సమావేశానికి రాలేదు. బీజేపీ పార్లమెంటరీ కార్యాలయం ఇన్‌చార్జిగా బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ, కార్యదర్శిగా తెలుగు వ్యక్తి బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. 16న పార్టీ బీజేపీ మొదటి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం కానుంది. మోదీ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం జరగనుంది

**పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శిగా తెలుగు వ్యక్తి**



**సాక్షి, న్యూఢిల్లీ:** బీజేపీ పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శిగా తెలుగు వ్యక్తి అయిన కామర్సు బాలసుబ్రహ్మణ్యంను మరోసారి కొనసాగిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బాలసుబ్రహ్మణ్యంను బీజేపీ పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శిగా నియమించారు. ఇప్పుడు మళ్లీ కేంద్రంలో అధికారం చేపట్టిన నేపథ్యంలో ఆయన్ను కార్యదర్శిగా కొనసాగించింది. 2007 నుంచి 2010 వరకు బీజేపీ జాతీయ మీడియా సహ కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం బాధ్యతలు నిర్వహించారు. నితిన్ గడ్కరీ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో లీగల్ సెల్ జాతీయ సహ కార్యదర్శిగా కూడా పని చేశారు.

# పాక్ మీదుగా వెళ్లను

- ఇరాన్, ఒమన్ మీదుగా ఎస్‌సీవోకు వెళ్లాలని మోదీ నిర్ణయం
- పాకిస్తాన్ అనుమతించిన తర్వాత నిర్ణయం మార్చుకున్న భారత్



**న్యూఢిల్లీ/బీజింగ్:** కిర్గిజిస్తాన్‌లోని బిష్కెక్‌లో ఈ నెల 13–14 తేదీల్లో జరిగే షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో)కు పాకిస్తాన్ గగనతలం మీదుగా వెళ్లరాదని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. తమ గగనతలం మీదుగా మోదీ విమానం వెళ్లేందుకు పాక్ అంగీకరించినప్పటికీ కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇరాన్, ఒమన్, ఇతర మధ్య ఆసియా దేశాల మీదుగా మోదీ విమానం కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్‌కు చేరుకుంటుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ తెలిపారు. ఈ ప్రయాణానికి సంబంధించి రెండు రూట్లను భారత ప్రభుత్వం ఖరారుచేసిందన్నారు. కాగా, భారత ప్రధాని మోదీ విమానంలో ఎస్‌సీవో సదస్సుకు తమ గగనతలం మీదుగా వెళ్లేందుకు ప్రత్యేకంగా అనుమతిస్తామని పాక్ విమానయానశాఖ మంత్రి సర్వార్‌ఖాన్ చెప్పారు. మోదీ ప్రయాణించే ఎయిరిండియా బోయింగ్ 747–400 విమానం ఢిల్లీ నుంచి బిష్కెక్‌కు వెళ్లి తిరిగివచ్చేందుకు వీలుగా 72 గంటలపాటు పాక్ గగనతలంలో రాకపోకల్ని అనుమతిస్తామని పేర్కొన్నారు. ఎస్‌సీవోలో చైనా, భారత్, పాక్, కిర్గిజిస్తాన్ సహా 8 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. మరోవైపు షాంఘై సహకార సదస్సుకు హాజరయ్యేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బయలుదేరినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారని వెల్లడించింది. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా జిన్‌పింగ్‌తో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాతో పాటు భారత్‌పై కూడా వాణిజ్య యుద్ధం మొదలుపెట్టిన నేపథ్యంలో అమెరికాను కలసికట్టుగా ఎదుర్కోవడంపై జిన్‌పింగ్, మోదీ చర్చించే అవకాశముందని ప్రభుత్వవర్గాలు చెప్పాయి.

**ఎస్‌సీవోతో పటిష్ట సంబంధాలు: మోదీ**

బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో)లో అంతర్జాతీయ భద్రత, ఆర్థిక సహకారమే ప్రధాన అజెండాగా ఉంటాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. తన బిష్కెక్ పర్యటన ద్వారా ఎస్‌సీవో దేశాలతో భారత్ సంబంధాలు మరింత బలపడతాయని ధీమా వ్యక్తం చేశారు.

**భారత రాయబారిగా వీడాంగ్**

భారత్‌తో సత్సంబంధాలను పెంపొందించుకునే దిశగా చైనా కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ దౌత్యవేత్త సున్ వీడాంగ్ భారత్‌లో తమ కొత్త రాయబారిగా నియమించింది. విదేశాంగ మంత్రి జైశంకర్ 2009–13 మధ్యకాలంలో చైనాలో భారత రాయబారిగా పనిచేసిన కాలంలో వీడాంగ్‌తో ఆయనకు మంచి అనుబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే చైనా విదేశాంగశాఖ పాలసీ–ప్రణాళికా విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న వీడాంగ్‌ను భారత్‌లో తమ రాయబారిగా నియమించింది. భారత్‌లో చైనా రాయబారిగా ఉన్న లో జుహుయిని విదేశాంగశాఖ సహాయమంత్రిగా నియమించింది.



బుధవారం ఢిల్లీలో పార్లమెంటును ఆవరించిన ధూళి తుపాను. ధూళి తుపాను కారణంగా ఢిల్లీలో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఢిల్లీతోపాటు ఉత్తరాదిన స్వల్ప వర్షాలతో ఉష్ణోగ్రత 10 డిగ్రీలు తగ్గిపోయింది.

## యూపీలో బార్ కౌన్సిల్ అధ్యక్షురాలి హత్య



**ఆగ్రా:** ఉత్తరప్రదేశ్‌లో బార్ కౌన్సిల్ అధ్యక్షురాలు దారుణహత్యకు గురయ్యారు. బుధవారం ఓ న్యాయవాది ఆమెను కాల్చి చంపి, అనంతరం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. రెండు రోజుల క్రితం జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో దార్వేశ్‌సింగ్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో ఆమె బుధవారం మధ్యాహ్నం ఆగ్రాలోని సివిల్ కోర్టుకు వచ్చారు. ఈక్రమంలో తోటి న్యాయవాది మనీశ్ శర్మ తుపాకీతో కోర్టు ఆవరణలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. దీంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మనీశ్ శర్మ తనను తాను కాల్చుకున్నాడు.

## నీరవ్ మోదీకి మరోసారి బెయిల్ నిరాకరణ

**లండన్:** పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసి.. విదేశాలకు పారిపోయిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి యూకే హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. నీరవ్ బెయిల్ పిటిషన్‌ను కోర్టు నిరాకరించింది. అతడు తప్పించుకునే అవకాశాలు ఉండటంతో బెయిల్ ఇవ్వడం కుదరదని ఇక్కడి రాయల్ కోర్ట్స్ ఆఫ్ జస్టిస్ తేల్చిచెప్పింది. నీరవ్‌కు బెయిల్ నిరాకరించే సమయంలో కింది కోర్టు చెప్పిన కారణాలనే యూకే కోర్టు కూడా పేర్కొంది. నీరవ్‌కు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశాలు సైతం ఉన్నాయని న్యాయమూర్తి ఇంగ్రిడ్ సిమ్లెర్ వ్యాఖ్యానించారు.

## ‘ఎప్పటికీ రాహులే కాంగ్రెస్ అధ్యక్షుడు’

**న్యూఢిల్లీ:** ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు రాహుల్ గాంధీ బాధ్యత వహిస్తూ ఇక ఎంతమాత్రమూ పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగనంటున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. ఇప్పటికీ, ఎప్పటికీ రాహుల్ గాంధీనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడని పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాల స్పష్టం చేశారు. రాహుల్ రాజీనామా, త్వరలో 4 రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఆ పార్టీ సీనియర్ నేతలు అహ్మద్‌పటేల్, ఖర్గే, ఆజాద్, చిదంబరం, జైరాం రమేశ్ బుధవారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు.

## జ్ఞానపీఠ్ అందుకున్న అమితవ్ ఘోష్

**న్యూఢిల్లీ:** ప్రముఖ రచయిత అమితవ్ ఘోష్(62) బుధవారం 54వ జ్ఞానపీఠ్ అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారాన్ని అందుకున్న మొదటి ఆంగ్ల రచయిత అమితవ్. ఇండియా హేబిటాట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ దౌత్యవేత్త, పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ గోపాల్ కృష్ణ గాంధీ చేతుల మీదుగా ఆయన జ్ఞానపీఠ్ అవార్డు–2018ను అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ.11లక్షల నగదుతోపాటు ప్రశంసాపత్రం అందజేస్తారు.

# కశ్మీర్‌లో ఉగ్ర దుశ్చర్య

- ఐదుగురు జవాన్ల మృతి
- ఒక ఉగ్రవాది కూడా



శ్రీనగర్‌లో అప్రమత్తంగా ఉన్న జవాను

**శ్రీనగర్:** కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. భద్రతా దళాలపై జరిపిన దాడిలో ఐదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో చోటుచేసుకుంది. ఉగ్రదాడిని తిప్పికొట్టడానికి భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడని అధికారులు వెల్లడించారు. ‘116వ బెటాలియన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు, రాష్ట్ర పోలీసులు ఇక్కడి కేపీ రోడ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మోటార్ సైకిల్ మీద వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు ఒక్కసారిగా తమ వద్ద ఉన్న రైఫిళ్లతో జవాన్లపై కాల్పులకు తెగబడ్డారు. అలాగే వారి వాహనంపై గ్రెనేడ్‌లను విసిరారు. దీంతో జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా గాయపడిన మరో ముగ్గురుని ఆస్పత్రికి తరలించాం’అని తెలిపారు. అలాగే ఈ ఘటనలో గాయపడిన అనంతనాగ్ పోలీస్ స్టేషన్ అధికారి అర్షద్ అహ్మద్‌ను చికిత్స కోసం శ్రీనగర్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ ఉగ్రవాదులను జైషే మొహ్మద్ ఉగ్రవాద గ్రూపునకు చెందిన వారుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఐసిస్ మాడ్యూల్ సూత్రధారి అరెస్టు

**సాక్షి, చెన్నై/న్యూఢిల్లీ:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అధికారులు బుధవారం శ్రీలంక ఆత్మాహుతి బాంబర్ జహ్రాన్ హషీంకు ఫేస్‌బుక్ స్నేహితుడైన ఐసిస్ తమిళనాడు మాడ్యూల్ సూత్రధారి మొహమ్మద్ అజారుద్దీన్‌ను అరెస్టు చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఏడు ప్రాంతాల్లో సోదాల సందర్భంగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. 14 మొబైల్ ఫోన్లు, 29 సిమ్‌కార్డులు, 10 పెన్‌డ్రైవ్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఆరు మెమొరీ కార్డులు, నాలుగు హార్డ్ డిస్క్ డ్రైవ్‌లు, సీడీలు, డీవీడీలు, ఒక కత్తి ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈస్టర్ పర్వదినం సందర్భంగా శ్రీలంకలో సాగిన వరుస బాంబు పేలుళ్లలో రెండు వందల మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ పేలుళ్ల అనంతరం తమిళనాడుపై ఎన్‌ఐఏ ప్రత్యేక దృష్టి పెట్టింది. గత నెల కోయంబత్తూరులో ముగ్గురి ఇళ్లలో సోదాలు జరిపి, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈనేపథ్యంలో బుధవారం 35మందితో కూడిన అధికారుల బృందం కోయంబత్తూరుకు చేరుకుంది. స్థానిక పోలీసులతో కలసి ఏడు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఉక్కడం అన్బునగర్‌లోని అజారుద్దీన్, పోతనూరులోని సదాం, అక్బర్, అక్రమ్ తిల్లా, కునియ ముత్తురులోని అబూబక్కర్ సలీం, అల్లమిన్ కాలనీలోని ఇదయతుల్లా, కరీంషా ఇళ్లలో సోదాలు జరిపారు. కోయంబత్తూర్‌కు చెందిన అజారుద్దీన్‌తో పాటు మరో ఐదుగురు నాయకత్వంలో నడుస్తున్నట్టుగా అనుమానిస్తున్న తమిళనాడు మాడ్యూల్‌పై మే 30వ తేదీన కేసు నమోదు అయ్యింది. తమిళనాడు, కేరళలో ఉగ్రదాడులు నిర్వహించేందుకు యువతను ఆకర్షించడం వారి లక్ష్యమని ఎన్‌ఐఏ తెలిపింది.

# ఆధార్ సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ:** బ్యాంకు అకౌంట్లు తెరిచేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్లు పొందేందుకు ఆధార్‌ను గుర్తింపు ధ్రువీకరణగా వాడుకునేందుకు వీలు కల్పిస్తూ రూపొందించిన సవరణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మార్చిలో విడుదల చేసిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన ఈ సవరణ బిల్లును 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలను కూడా బిల్లులో ప్రతిపాదించింది. అదేవిధంగా, 18 ఏళ్లు నిండిన వారు బయోమెట్రిక్ గుర్తింపు విధానం నుంచి బయటికి వచ్చేందుకు వీలు కల్పించే ప్రతిపాదన కూడా ఉంది.

**కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు**

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ వెల్లడించారు. రాష్ట్రంలో 2018 జూన్ 20వ తేదీ నుంచి రాష్ట్రపతి పాలన అమల్లో ఉంది. అమర్‌నాథ్ యాత్ర ముగిసిన తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటిస్తామంటూ ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రపతి పాలనకు ఇదే ఆఖరి పొడిగింపు కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత గడువు జూలై 2వ తేదీతో ముగియనుండగా తాజా పొడిగింపు జూలై 3వ తేదీ నుంచి అమలు కానుంది. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ మేరకు ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టనుంది.

**ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం**

ట్రిపుల్ తలాక్ విధానంపై నిషేధం విధిస్తూ రూపొందించిన బిల్లును కేబినెట్ ఆమోదించింది. ఇందుకు సంబంధించి ఫిబ్రవరిలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 16వ లోక్‌సభ రద్దు కావడంతో రాజ్యసభ వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లుకు కాలపరిమితి తీరింది. దీంతో ప్రభుత్వం మళ్లీ ఈ బిల్లు రూపొందించింది. ట్రస్టులకు ప్రత్యేక ఆర్థిక మండలా(ఎస్‌ఈజెడ్)లను ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించే ఎస్‌ఈజెడ్ సవరణ బిల్లుపైనా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.



బుధవారం హాంకాంగ్‌లోని లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎదుట ఆందోళన చేస్తున్న వందలాది మంది నిరసనకారులు. కేసులను ఎదుర్కొంటున్న వ్యక్తులను చైనాకు అప్పగించేందుకు వీలు కల్పించే కొత్తచట్టాన్ని వ్యతిరేకిస్తూ హాంకాంగ్‌లో నిరసనజ్వాలలు పెల్లుబికాయి.

## ఓటర్లకు సోనియా కృతజ్ఞతలు



రాయ్‌బరేలీ చేరుకున్న సోనియా

**రాయ్‌బరేలీ:** యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రాయ్‌బరేలీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కుమార్తె, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి ఆమె రాయ్‌బరేలీ వెళ్లారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి తనను ఎన్నుకున్న ప్రజలకు సోనియా గాంధీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రానున్న ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవద్దని కార్యకర్తలు సోనియాను కోరినట్లు కాంగ్రెస్ నేత సంజయ్ సిన్హ్ తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత సొంత నియోజకవర్గంలో సోనియా పర్యటించడం ఇదే ప్రథమం.

# సాక్షి బిజినెస్

గురువారం
13-6-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 194 ▼ | 59 ▼ |
| 39,757 | 11,906 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,789 | ▼ 32 |
| డోజోన్స్ | 26,007 | ▼ 41 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,368 | ▼ 31 |
| డాక్స్ | 12,115 | ▼ 40 |
| షాంఘై | 2,909 | ▼ 16 |
| నికాయ్ | 21,130 | ▼ 75 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.64 | 70.28 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.76 | 89.92 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.25 | 80.19 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.83 | 65.26 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.26 | 49.41 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.01 | 51.81 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.72 | 19.48 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.14 | 19.70 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.40 | 10.75 |




కొత్త యాక్టివాను ఆవిష్కరిస్తున్న అక్షయ్ కుమార్, తాప్సి

## హోండా నుంచి.. ప్రీమియం యాక్టివా125

### బీఎస్-6 ప్రమాణాలతో విడుదల..

**న్యూఢిల్లీ, సాక్షి బిజినెస్ బ్యూరో:** వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానున్న బీఎస్–6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన న్యూ ప్రీమియం యాక్టివా 125ను హోండా బుధవారం ఆవిష్కరించింది. ఈ ఏడాది రెండవ త్రైమాసికం నుంచి దీని అమ్మకాలను మొదలుపెట్టనున్నట్లు ప్రకటించింది. కంపెనీ నుంచి ఉత్పత్తి చేస్తున్న తొలి బీఎస్–6 అనుగుణ ద్విచక్రవాహనం ఇదేనని తెలిపింది. దీని ధర బీఎస్4 యాక్టివా స్కూటర్ కన్నా 10– 15 శాతం ఎక్కువ ఉంటుందని తెలిపింది.

**ప్రత్యేకతలు ఇవీ...**
హోండా ఈఎస్‌పీ టెక్నాలజీతో కూడిన 125 సీసీ ఇంజన్, 3+3=6 ఏళ్ల వారెంటీ, సైలెంట్ స్టార్ట్ సిస్టమ్, డిజిటల్ అనలాగ్ మీటర్, ఇడ్లింగ్ స్టాప్ సిస్టమ్, ఇంజన్ ఇన్‌హిబిటర్‌తో కూడిన సైడ్ స్టాండ్ ఇండికేటర్ మరియు ఫ్రిక్షన్ రిడక్షన్ సాంకేతిక పరిజ్ఞానం, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ ఫంక్షన్ స్విచ్ తదితరాలు ఈ కొత్త స్కూటర్‌లో ఉన్నాయి.

## థాంప్సన్ నుంచి ఆండ్రాయిడ్ టీవీలు




ఆండ్రాయిడ్ టీవీతో సీఈఓ అవనీత్ సింగ్

**న్యూఢిల్లీ నుంచి సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధి:** ఫ్రెంచ్ కన్స్యూమర్ దిగ్గజం థాంప్సన్... దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఆండ్రాయిడ్ టీవీలను విడుదల చేసింది. మేక్ ఇన్ ఇండియాకు అనుగుణంగా ఈ టీవీలను భారత్‌లోనే ఉత్పత్తి చేశామని కంపెనీ ఇండియా పేటెంట్ హక్కుదారు ఎస్‌పీపీఎల్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా చెప్పారు. దీంతో అన్ని రకాల ఆండ్రాయిడ్ టీవీలను స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న తొలి బ్రాండ్‌గా నిలిచామన్నారు. 43, 49, 55, 65 అంగుళాల వేరియంట్లలో ఈ టీవీలున్నాయని, వీటి ధర రూ. 29,999 నుంచి రూ. 59,999 వరకు ఉంటుందని చెప్పారు. ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌పై వీటిని విక్రయిస్తామన్నారు.

**ప్రత్యేకతలు:** ఇన్‌బిల్ట్ క్రోమ్‌క్యాస్ట్, డాల్బీ సౌండ్, 2.5 ర్యామ్, 16 జీబీ మెమరీ, 5000కు పైగా వివిధ ప్రీఇన్‌స్టాల్డ్ యాప్స్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌ప్లే కోసం హాట్‌కీస్, 4కే 10హెచ్‌డీఆర్ డిస్‌ప్లే తదితరాలు.

## ఉన్నతాధికారులుగా ప్రైవేటు నిపుణులు!

- కీలక స్థానాల్లో వారిని నియమించే ప్రతిపాదన
- తొలిదశలో 40 మంది నిపుణులకు చోటు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ అధికార యంత్రాంగంలో సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ప్రైవేటు రంగంలో నిష్ణాతులైన వారిని డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ వంటి కీలక పదవుల్లో పెద్ద ఎత్తున నియమించే ప్రతిపాదన ప్రభుత్వం ముందున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సాధారణంగా ఈ పోస్టుల్లో ఐఏఎస్, ఇతర గ్రూపు 'ఏ' సర్వీసుల నుంచి అధికారులను తీసుకోవడం జరుగుతుంటుంది. అయితే, ప్రైవేటు రంగంలో వివిధ విభాగాల్లో నిపుణులైన వారిని డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ పదవుల్లో నియమించేందుకు వీలుగా అధికారిక ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ సెక్రటరీ సి.చంద్రమౌళి ఆదేశించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. తొలి దశలో 40 మంది నిపుణులను లేటరల్ ఎంట్రీ విధానంలో నియమించుకోనున్నట్టు వెల్లడించాయి. ప్రభుత్వ సర్వీసుల నుంచి వచ్చే వారి మాదిరిగానే నిపుణుల నియామకాలు ఉంటాయని, దరఖాస్తులు ఆహ్వానిస్తూ త్వరలో నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. నిపుణులను ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకోవడం తప్పనిసరి అని నీతి ఆయోగ్ ఇటీవలే ప్రభుత్వానికి సూచించడం, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుండటం గమనార్హం.

# బ్యాంకు మోసాలు... @ రూ.2 లక్షల కోట్లు!





- 11 ఏళ్లలో రూ.2.05 లక్షల కోట్లుగా నమోదు
- 53 వేలకు పైగా చీటింగ్ కేసులు
- అత్యధికం ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకుల్లో

**న్యూఢిల్లీ:** దేశీయ బ్యాంకులు మోసగాళ్లకు లక్ష్యంగా మారుతున్నాయి. గత 11 ఏళ్లలో రూ.2.05 లక్షల కోట్ల మేర భారీ మోసాలు ఇక్కడి బ్యాంకుల్లో చోటు చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. సంఖ్యా పరంగా ఎక్కువ ఘటనలు అత్యధికం ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకుల్లోనే జరిగినట్టు ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. ఇక భారీగా మోసపోయినది మాత్రం పంజాబ్ నేషనల్ బ్యాంకు!!. ఈ బ్యాంకులో మోసపు ఘటనలు 2,047 నమోదయినప్పటికీ, విలువ మాత్రం 28,700 కోట్ల మేర ఉంది. ముఖ్యంగా వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఒక్కరే రూ.13,000 కోట్లకు పైగా మోసానికి పాల్పడిన విషయం గమనార్హం. పీఎన్‌బీ తర్వాత ఎస్‌బీఐకి మోసాల సెగ ఎక్కువగా తగిలింది. 23,734 కోట్ల మేర మోసాలు జరిగాయి. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన ఓ దరఖాస్తుకు బదులుగా ఈ వివరాలను ఆర్‌బీఐ వెల్లడించింది. 2008–09 ఆర్థిక సంవత్సరం నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం53,334 మోసపూరిత కేసులు నమోదయ్యాయి.

**పీఎన్‌బీలో భారీగా...**
పీఎన్‌బీలో రూ.28,700 కోట్ల మొత్తానికి సంబంధించి 2,047 మోసాలు జరిగాయి. ఐసీఐసీఐ బ్యాంకులో రూ.5,033.81 కోట్లకు సంబంధించి 6,811 కేసులు ఈ కాలంలో నమోదయ్యాయి. ప్రభుత్వరంగంలోని ఎస్‌బీఐలో 6,793 మోసపు ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటి విలువ రూ.12,358 కోట్లు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోనూ రూ.1,200.79 కోట్లకు సంబంధించి 2,497 మోసపూరిత ఘటనలు జరిగాయి. బ్యాంకు ఆఫ్ బరోడాలో 2,160 మోసపూరిత కేసులు నమోదు కాగా, వీటి మొత్తం రూ.12,962.96 కోట్లుగా ఉంది.

**విదేశీ బ్యాంకుల్లోనూ...:** భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే విదేశీ బ్యాంకులు సైతం మోసపూరిత ఘటనల బారిన పడినట్టు తెలుస్తోంది. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకింగ్ కార్పొరేషన్ ఇదే కాలంలో 1,862 మోసపూరిత కేసులను రిపోర్ట్ చేసింది. వీటి మొత్తం రూ.86.21 కోట్లు. అలాగే, సిటీ బ్యాంకులో రూ.578 కోట్లకు సంబంధ/ంచి 1,764 కేసులు వెలుగు చూశాయి. హెచ్‌ఎస్‌బీసీలో రూ.312 కోట్ల మేర రూ.1,173 మోసాలు, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ పీఎల్‌సీలో రూ.12.69 కోట్ల మేర 216 కేసులు, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులో రూ.1,221.41కోట్లతో ముడిపడిన 1,263 ఘటనలు వెలుగు చూశాయి.

### ఏ బ్యాంకులో ఎంత మేర... (2008-09- 2018-19 వరకు)

| బ్యాంకు | మొత్తం కేసులు | విలువ (రూ.కోట్లలో) |
|---|---|---|
| ఎస్‌బీఐ | 6,793 | 23,734 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 6,811 | 5,033.81 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 2,497 | 1,200.79 |
| బ్యాంకు ఆఫ్ బరోడా | 2,160 | 12,962.96 |
| పీఎన్‌బీ | 2,047 | 28,700.74 |
| యాక్సిస్ బ్యాంకు | 1,944 | 5,301.69 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 1,872 | 12,358.2 |
| సిండికేట్ బ్యాంకు | 1,783 | 5,830.85 |
| సెంట్రల్ బ్యాంకు | 1,613 | 9,041.98 |
| ఐడీబీఐబ్యాంకు | 1,264 | 5,978.96 |
| కెనరా బ్యాంకు | 1,254 | 5,553.38 |
| యూనియన్‌బ్యాంకు | 1,244 | 11,830.74 |
| కోటక్‌బ్యాంకు | 1,213 | 430.46 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు | 1,115 | 12,644.7 |
| ఓరియంటల్ బ్యాంకు | 1,040 | 5,598.23 |
| యునైటెడ్ బ్యాంకు | 944 | 3,052.34 |
| యస్ బ్యాంకు | 102 | 311.96 |

## మార్కెట్లోకి డుకాటీ 'హైపర్ మోటార్డ్ 950'

ధర రూ.11.99 లక్షలు



**న్యూఢిల్లీ:** ఇటలీకి చెందిన సూపర్ బైక్ తయారీ సంస్థ డుకాటీ.. 'హైపర్ మోటార్డ్ 950' పేరుతో అధునాతన ద్విచక్ర వాహనాన్ని మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బైక్ 937 సీసీ ట్విన్ సిలెండర్ ఇంజిన్‌తో విడుదల కాగా.. ధర రూ.11.99 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా డుకాటి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సెర్గీ కానోవాస్ మాట్లాడుతూ.. 'ప్రత్యేకించి యువత కోసం రూపొందిన బైక్ ఇది. స్పోర్ట్స్ ఫీచర్స్ కలిగి, నిర్భయంగా నడపగలిగే సూపర్ బైక్‌గా మార్కెట్లోకి ప్రవేశించింది' అన్నారాయన. హైదరాబాద్, ముంబై, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు, ఢిల్లీ–ఎన్‌సీఆర్, కొచ్చి, కోల్‌కత్తా, చెన్నైలలోని డుకాటీ డీలర్‌షిప్స్ వద్ద బుకింగ్స్ ప్రారంభమైనట్లు తెలిపారు.

## సుప్రీం కోర్టులో సత్వర విచారణ పిటీషన్

- ఇండియాబుల్స్ హౌసింగ్ దాఖలు
- సెలవుల అనంతరం విచారిస్తామన్న వెకేషన్ బెంచ్




**న్యూఢిల్లీ:** ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ (ఐహెచ్‌ఎఫ్‌ఎల్) కంపెనీకి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ కంపెనీలో రూ.98,000 కోట్ల మేర అవకతవకలు జరిగాయంటూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలైన విషయం తెలిసిందే. కేవలం రూ.3,000తో నాలుగు ఐహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్లు కొనుగోలు చేసిన పాలు విక్రయదారొకరు ఈ పిటిషన్‌ను దాఖలు చేశాడని ఐహెచ్‌ఎఫ్‌ఎల్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఏ.ఎం. సింఘ్వి పేర్కొన్నారు. కంపెనీని బ్లాక్‌మెయిల్ చేయాలనే ఉద్దేశంతోనే పిటిషనర్ దీన్ని దాఖలు చేశారని, అందుకే పిటిషన్‌లోని వివరాలను మీడియాకు లీక్ చేశారని వివరించారు. అవాస్తవాలతో కూడిన ఈ పిటిషన్ కారణంగా ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్(ఐహెచ్‌ఎఫ్‌ఎల్) మార్కెట్ విలువ రెండు రోజుల్లో రూ.7,000 కోట్లు హరించుకు పోయిందని వివరించారు. అందుకే ఈ పిటిషన్‌ను సత్వరం విచారించాల్సిందిగా విన్నవిస్తున్నానని చెప్పారు. సత్వరం విచారించాలన్న అభ్యర్థనను స్వీకరిస్తున్నామన్న వెకేషన్ బెంచ్... ఆ తర్వాత సత్వర విచారణ పిటిషన్‌లో లోపాలున్నాయని, వేసవి సెలవుల అనంతరం విచారిస్తామని పేర్కొంది.

# పరీక్ష పాసైతేనే కంపెనీకి డైరెక్టర్

- మోదీ సర్కారు యోచన
- కార్పొరేట్ మోసాలకు చెక్
- అనుభవజ్ఞులకు మినహాయింపు

**న్యూఢిల్లీ:** కార్పొరేట్ పరిపాలనను పారదర్శకంగా మార్చేందుకు, కార్పొరేట్ కంపెనీల్లో అక్రమాలు, మోసాలకు చెక్ పెట్టేందుకు నరేంద్ర మోదీ సర్కారు త్వరలోనే చర్యలు చేపట్టనుంది. దేశ కార్పొరేట్ రంగంలో గతేడాది ఐఎల్‌ఎఫ్‌ఎస్ రుణ చెల్లింపుల్లో విఫలం కావడం లిక్విడిటీని తీవ్రంగా దెబ్బతీసింది. ఈ గ్రూపు ప్రమోటర్ల మోసాలు ఒక్కొక్కటీ దర్యాప్తులో భాగంగా వెలుగులోకి వస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకును వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ ఏకంగా రూ.13,000 కోట్లకుపైగా మోసగించాడు. ఇవన్నీ చూశాక... కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలను కేంద్రం మరింత కఠినతరం చేయాలనుకుంటోంది. ఇందులో భాగంగా కంపెనీల బోర్డుల్లో స్వతంత్ర డైరెక్టర్లుగా చేరాలనుకునే వారు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం పెట్టే పరీక్ష పాస్ కావాల్సి ఉంటుందని కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. ఐఎల్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఖాతాల్లో అక్రమాల సమాచారాన్ని రిపోర్ట్ చేయనందుకు, ఆ కంపెనీకి ఆడిటింగ్ సేవలందించిన డెలాయిట్ హస్కిన్స్, బీఎస్‌ఆర్ అసోసియేట్స్‌పై ఐదేళ్లపాటు నిషేధం విధించాలని ఇప్పటికే కార్పొరేట్ శాఖ ఎన్‌సీఎల్‌టీ ముందు పిటిషన్ కూడా దాఖలు చేసిన విషయం గమనార్హం. కంపెనీల్లో మోసాలు, సంక్షోభాలకు సంబంధించిన సంకేతాలను అవి బయటపడటానికి ముందే బోర్డుల్లో ఉన్న స్వతంత్ర డైరెక్టర్లు గుర్తించగలరనేది పరిశీలకుల భావన. ''ఇండిపెండెంట్ డైరెక్టర్లకు ఎటువంటి ధర్మకర్త బాధ్యతలు లేవన్న అపోహను తొలగించాలనుకుంటున్నాం. కార్పొరేట్ విషయాల గురించి తెలియజేయడంతోపాటు, తమ విధులు, పాత్ర, బాధ్యతల గురించి వారిలో అవగాహన ఉండేలా చేయనున్నాం'' అని ఇంజేటి శ్రీనివాస్ ఈ సందర్భంగా వివరించారు.



**ఆన్‌లైన్లో పరీక్ష...**
''భారతీయ కంపెనీల చట్టం, విలువలు, క్యాపిటల్ మార్కెట్ నిబంధనలు తదితర అంశాలను పరీక్షించేలా ఆన్‌లైన్ మదింపు ఉంటుంది. డైరెక్టర్లు కావాలనే ఆసక్తి ఉన్న వారు నిర్ణీత కాలవ్యవధిలోపు పరీక్షను పాస్ కావాల్సి ఉంటుంది. పరిమితి లేకుండా ఒకరు ఎన్ని సార్లయినా పరీక్ష రాసేందుకు అనుమతిస్తాం'' అని శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్లుగా సేవలందిస్తున్న అనుభవజ్ఞులకు మాత్రం ఆన్‌లైన్ పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తామని చెప్పారు. అయితే, అటువంటి వారు ప్రభుత్వం ఏర్పాటు చేసే డేటాబేస్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కంపెనీలకు, ఇండిపెండెంట్ డైరెక్టర్లకు ఇది వారధిగా ఉంటుందని, ఇండిపెండెంట్ డైరెక్టర్ల కోసం చూసే కంపెనీలు తమతో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారిని ఈ వేదికగా కలుసుకోవచ్చని శ్రీనివాస్ తెలిపారు.

**స్వతంత్ర డైరెక్టర్ల పాత్రపై ప్రశ్నలు**
కంపెనీల చట్టం ప్రకారం ప్రతీ లిస్టెడ్ కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్లను బోర్డులో నియమించుకోవాల్సి ఉంటుంది. బోర్డు మొత్తం సభ్యుల్లో కనీసం మూడింట ఒక వంతు వీరు ఉండాలి. ఆయా కంపెనీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించడంతో పాటు, మైనారిటీ వాటాదారుల ప్రయోజనాల పరిరక్షకులుగా వ్యవహరించడమనేది వీరి బాధ్యత.

## మార్కెట్లోకి ఐఫ్లో ఎలక్ట్రిక్ స్కూటర్

ధర రూ.90,000

**న్యూఢిల్లీ:** దేశీయ మార్కెట్లోకి 22కిమ్కో సంస్థ బుధవారం మూడు ద్విచక్ర వాహనాలను ప్రవేశపెట్టింది. 2018 ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఐఫ్లో ఎలక్ట్రిక్ స్కూటర్ ఇందులో ఒకటి. ఈ మోడల్ ఢిల్లీ (ఆన్‌రోడ్డు) ధర రూ.90,000. అలాగే, లైక్ 200 (ఢిల్లీ ఆన్‌రోడ్డు ధర రూ.1.3 లక్షలు), ఎక్స్‌టౌన్ 300ఐ ఏబీఎస్‌ను (ఢిల్లీ ఆన్‌రోడ్డు ధర రూ.2.3లక్షలు) కూడా తీసుకొచ్చింది. ఐఫ్లో మినహా మిగిలిన రెండూ పెట్రోల్‌తో నడిచే వాహనాలు. వార్షికంగా 2 లక్షల వాహనాల తయారీ సామర్థ్యంతో హరియాణాలోని భివాడీలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కిమ్కో చైర్మన్ అల్లెన్‌కో ప్రకటించారు.

**ఐఫ్లో ఫీచర్లు ఇవీ...:** సంప్రదాయ స్కూటర్ రూపంతో ఉండే ఈ వాహనం ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్, ఎల్‌ఈడీ టెయిల్‌ల్యాంప్, డిజిటల్ ఇనుస్ట్రుమెంట్ కన్సోల్, బ్లూటూత్, క్లౌడ్ కనెక్టివిటీ, ముందు, వెనుకా డిస్కులతో కూడిన సీబీఎస్ బ్రేకింగ్, ముందు టెలిస్కోపిక్ ఫోర్క్స్, వెనుక ట్విన్ షాక్ అబ్జార్బర్స్ తదితర ఫీచర్లతో ఉంటుంది. ఐఫ్లో స్కూటర్ రెండు బ్యాటరీలతో ఉంటుంది. ఒక్కో బ్యాటరీ సాయంతో 30–40 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. ఇందులో అమర్చిన 2.1 కిలోవాట్ సామర్థ్యం కలిగిన మోటారు గరిష్టంగా 60 కిలో మీటర్ల వేగంతో వెళ్లొచ్చని కంపెనీ ప్రకటించింది.



# ధరలకు బ్రేక్.. పరిశ్రమల జోష్!

- ఊరటనిచ్చిన ఆర్థిక గణాంకాలు
- ఏప్రిల్‌లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 3.4 శాతం
- ఆరు నెలల గరిష్ట స్థాయి
- నిరాశలోనే తయారీ, క్యాపిటల్ గూడ్స్
- మేలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.05 శాతం
- 7 నెలల గరిష్టమైనా అదుపులోనే...!



**న్యూఢిల్లీ:** పారిశ్రామిక రంగానికి సంబంధించి అలాగే రిటైల్ ధరల పరిస్థితికి సంబంధించి బుధవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాలు కొంత ఊరట కల్పించాయి. ఏప్రిల్‌లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 3.4 శాతంగా నమోదయ్యింది. ఇది ఆరు నెలల గరిష్ట స్థాయి. అయితే పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో మెజారిటీ వెయిటేజ్ ఉన్న తయారీ రంగం దీనితోపాటు కీలకమైన క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి పరిస్థితి చూస్తే... ఆర్థిక వ్యవస్థలో మందగమన జాడలు స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఇక మేలో 3.05 శాతంగా రిటైల్ ధరల స్పీడ్ నమోదయ్యింది. నిజానికి గడచిన ఏడు నెలల కాలంలో ఈ స్థాయి భారీ ధరల స్పీడ్ నమోదుకాకపోయినా, ఆర్‌బీఐ నిర్దేశిత 4 శాతం (ప్లస్ 2 లేదా మైనస్ 2 శాతాలతో) లోపే ఉండటం గమనార్హం.

**మైనింగ్, విద్యుత్ వెలుగులు..**
ఏప్రిల్ 2018లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 4.5 శాతంగా నమోదయ్యింది. అటు తర్వాత 2018 అక్టోబర్‌లో 8.4 శాతంగా భారీ వృద్ధిని నమోదు చేసుకుంది. నవంబర్ (0.2 శాతం), డిసెంబర్ (2.5 శాతం), జనవరి (1.6 శాతం), ఫిబ్రవరి (0.1 శాతం), మార్చి (0.4 శాతం)ల్లో పారిశ్రామిక వృద్ధి నిరాశపరిచింది. తర్వాత 2019 ఏప్రిల్‌లోనే కొంత ఊరటనిచ్చే ఫలితాన్ని దేశ పారిశ్రామిక రంగం చూడగలిగింది. మైనింగ్(5.1 శాతం వృద్ధి), విద్యుత్ రంగాలు(వృద్ధి 6%) ఇందుకు ప్రధాన కారణం.

### ధరలు కట్టడిలోనే...

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపో (ప్రస్తుతం 5.75 శాతం) నిర్ణయానికి ప్రాతిపదికగా తీసుకునే వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మే నెల్లో కట్టడిలోనే ఉంది. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం– మే నెల్లో ఈ రేటు 3.05 శాతం పెరిగింది. అంటే 2018 మే నెల వస్తువుల రిటైల్ బాస్కెట్ ధర, 2019 మే నెలలో 3.05 శాతం పెరిగిందన్నమాట. 2 శాతం అటు ఇటుగా (మైనస్ లేదా ప్లస్)తో 4 శాతంగా ఉండాలన్నది ఆర్‌బీఐ విధానం. దీని ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం కట్టడిలోనే ఉందని పేర్కొనవచ్చు. అయితే జనవరి నుంచీ రిటైల్ ధరల స్పీడ్ పెరుగుతుండటం ఇక్కడ గమనార్హం. జనవరిలో 1.97 శాతంగా ఉన్న రిటైల్ ధరల స్పీడ్, ఫిబ్రవరిలో 2.57 శాతానికి చేరింది. మార్చి, ఏప్రిల్‌లో వరుసగా 2.86 శాతం, 2.99 శాతంగా నమోదయ్యాయి. ఇక మే నెల్లో ఈ రేటు ఏకంగా 3 శాతం దాటడం గమనార్హం. సూచీలోని ఐదు ప్రధాన విభాగాలనూ వేర్వేరుగా చూస్తే...



- ఆహారం, పానీయాల విభాగంలో ధరల స్పీడ్ 2.03 శాతంగా నమోదయ్యింది.
- పాన్, పొగాకు ఇతర మత్తు ప్రేరిత ఉత్పత్తుల ధరల స్పీడ్ 3.93 శాతంగా ఉంది.
- దుస్తులు, పాదరక్షల విభాగంలో ధరల స్పీడ్ 1.80 శాతంగా నమోదయ్యింది.
- గృహ రంగానికి సంబంధించి ద్రవ్యోల్బణం 4.82 శాతంగా ఉంది.
- ఫ్యూయల్, లైట్ విభాగంలో రేటు 2.48 %

# గురుకులంలో కలెక్టర్ కూతురు

- కూతురును మైనార్టీ గురుకుల పాఠశాలలో చేర్పించిన వికారాబాద్ కలెక్టర్
- కలెక్టర్ నిర్ణయంపై సర్వత్రా హర్షం



శివారెడ్డిపేటలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల -1 భవనం. ఇన్‌సెట్‌లో తాబిష్ రైనా

**సాక్షి, వికారాబాద్:** పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను పేరున్న ప్రైవేటు స్కూళ్లలో చదివించేందుకు తాపత్రయపడుతున్న రోజులివి. కానీ, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆయేషా మస్రత్ ఖానమ్ మాత్రం తనకూతురు తాబిష్ రైనాను మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కలెక్టర్‌కు ఒక బాబు, పాప ఉన్నారు. పాప తాబిష్ రైనా ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి పూర్తి చేసింది. ప్రస్తుతం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో చిన్నారి ఐదో తరగతిలో చేరాల్సి ఉంది. దీంతో ఆమె తన కూతురును వికారాబాద్‌లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల– 1లో చేర్పించాలని భావించి డే స్కాలర్‌గా అవకాశం కల్పించాలని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి బి. షఫీయుల్లాను కోరారు. ఇందుకు ఆయన సమ్మతించడంతో బుధవారం ఉదయం తన కూతురు తాబిష్ రైనాను పాఠశాలకు పంపించారు. కలెక్టర్ కూతురును తమ పాఠశాలలో చేర్పించడం ఎంతో ఆనందంగా ఉందని, పిల్లలు సైతం సంతోషం వ్యక్తం చేశారని ఆయన చెప్పారు. తమ పాఠశాలలోని విద్యార్థులందకీ మెరుగైన విద్యను అందజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆయేషా మస్రత్ ఖానమ్ తీసుకున్న నిర్ణయం ఆదర్శప్రాయమని మైనార్టీ గురుకుల పాఠశాలల కార్యదర్శి షఫీయుల్లా ప్రశంసించారు.

**బాగా బోధిస్తున్నారు..**

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యాబోధన బాగుందని అందుకే తన కూతురు తాబిష్‌రైనాను వికారాబాద్‌లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల– 1లో చేర్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. మైనార్టీ గురుకుల పాఠశాలలు బాగా పనిచేస్తున్నాయని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.




## రేపు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలను ఈనెల 14వ తేదీన (రేపు) విడుదల చేసేందుకు ఐఐటీ రూర్కీ చర్యలు చేపట్టింది. దేశ వ్యాప్తంగా గత నెల 27వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు 1.73 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి ఐఐటీ, ట్రిపుల్ ఐటీలు, ఎన్ఐటీలు ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగే విద్యా సంస్థల్లో ఉమ్మడి ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అదేరోజు నుంచి విద్యార్థుల చాయిస్ ఫీలింగ్‌కు జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) అవకాశం కల్పించనుంది.







## వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జూలై 4వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో (నాన్ మున్సిపల్) కనీసం 4 సంవత్సరాలు చదువుకున్నవారు మాత్రమే డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా నిర్ణయించారు. అభ్యర్థుల ఎంపిక పదో తరగతిలో సాధించిన గ్రేడ్ పాయింట్ ప్రకారంగా, మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్లకు లోబడి ఎంపిక చేయనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.సుధీర్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtsau.edu.inను సందర్శించాలని సూచించారు.

## డిగ్రీ విద్యార్థులకు ఆ ఫీజులను చెల్లిస్తాం: లింబాద్రి



**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే సమయంలో చెల్లించే ఫీజును తిరిగి విద్యార్థులకు సర్దుబాటు చేస్తామని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే వారు రూ.500, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని వారు రూ.1,000 చెల్లించాలని సూచించారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం అందజేస్తే రూ.500 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఆ మొత్తాన్ని విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో లేదా ఇతర ఫీజుల్లో సర్దుబాటు చేసేలా కాలేజీలకు ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించారు. లేదంటే తామే విద్యార్థులకు ఫీజు తిరిగి చెల్లించేలా చర్యలు చేపడతామని వివరించారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 24 నుంచి ఇంటర్వ్యూలు

**సాక్షి, హైదరాబాద్:** క్లినికల్ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా, స్పెషాలిటీ వారీగా ఇంటర్వ్యూల షెడ్యూలును తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

## ఇంటర్ విద్యార్థుల కుటుంబాలను ఆదుకోండి: వీహెచ్



**సాక్షి, న్యూఢిల్లీ:** ఇంటర్మీడియట్ ఫలితాల్లో అవకతవకల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను సీఎం కేసీఆర్ ఆదుకోవాలని, వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సీఎం ప్రత్యేక ప్రగతి నిధి నుంచి ఉత్తమ జెడ్పీ చైర్మన్లకు రూ. 10 కోట్లు ఇస్తానన్న కేసీఆర్, ఆత్మహత్యలు చేసుకున్న ఇంటర్ విద్యార్థుల కుటుంబాలను, హాజీపూర్‌లో హత్యాచారాలకు గురైన ఆడపిల్లల కుటుంబాలను ఎందుకు ఆదుకోరని ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్లకు నిధులు ఇచ్చే ముందు గ్రామ సర్పంచులకు చెక్ పవర్ కల్పించాలన్నారు.

## ‘ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి’

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2018 సంవత్సరానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యా సంచాలకుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా www.mhrd.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

## ‘జీహెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయండి’

**సాక్షి, హైదరాబాద్:** ఉన్నత పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాల మొదటి పర్యవేక్షణ అధికారి (జీహెచ్‌ఎం) పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, అదే విధంగా అంతర్ జిల్లా భార్యాభర్తల బదిలీలను వెంటనే చేపట్టాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.



పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

## రాసింది ఒక్కడు..కాసింది ఆరుగురు

### పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో అరుదైన ఘటన

**కొడంగల్ రూరల్:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సెంటర్‌లో బుధవారం ఒకే ఒక్క విద్యార్థి పరీక్ష రాశాడు. ముగ్గురు విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా..వీరిలో ఇద్దరు పరీక్షకు రాలేదు. దీంతో ఒక్క విద్యార్థి పరీక్ష రాస్తుండగా ఆరుగురు విధులు నిర్వహించారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792